మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

భారత జిడిపి వృద్ధి : సుభాషితాలు, చేదు నిజాలు!
ట్రంప్ ఆధిపత్యంతో ప్రపంచ దేశాల నిస్సహాయత
అమెరికాపై యుద్ధానికి ఇరాన్ క్షిపణులు సిద్ధం
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 122 | బుధవారం | 02-04-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


05

### బంగ్లా కుయుక్తులతో... ఈశాన్య రాష్ట్రాలకు ముప్పు

- యూనస్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆందోళన
- కేంద్ర విదేశాంగ విధానం దయనీయమని మండిపాటు


05

### యుపి ప్రభుత్వ తీరు దిగ్భ్రాంతికరం

- ఇళ్ల కూల్చివేతలపై ఆగ్రహం
- బాధితులకు ఆశ్రయం పొందే హక్కుకూడా లేదా? అని నిలదీత


03

### హెచ్‌సియు భూములను ప్రభుత్వం లాక్కోవడంలేదు

- కోర్టుకేసు పూర్తయినందున భూములు స్వాధీనం
- టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

## మేము పట్టించుకోకుంటే 400 ఎకరాలు

# ప్రైవేట్ చేతుల్లోకే..

### హెచ్‌సియు నుంచి ఇంచుకూడా లాక్కోలేదు

- ఆ భూములు సాధించడం ప్రభుత్వ విజయం
- హెచ్‌సియు భూములు ఆ యూనివర్సిటీ పేరుతో లేవు
- భూ బదలాయింపునకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం
- కొన్ని రాజకీయ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్

వేలాది కోట్ల రూపాయల విలువ చేసే విలువైన ప్రభుత్వ భూమిని,ప్రైవేటు వ్యక్తుల చేతి నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నందుకు అభినందించకుండా, కొన్ని రాజకీయ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పట్టించుకోకపోతే 400 ఎకరాల స్థలం ప్రైవేటు వ్యక్తి చేతుల్లో పోయేదని వివరించారు. కంచ గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి(హెచ్‌సియు) సంబంధించింది కాదని, కుట్రపూరితంగా ఒక ప్రైవేట్ వ్యక్తి తరువాయి 2లో



## ప్రభుత్వం అప్రమత్తం

- విద్యార్థి సంఘాల ఆందోళనలను ఆధారాలతో సమర్థవంతంగా ఎదుర్కోవాలి
- మంత్రులకు సిఎం రేవంత్‌రెడ్డి సూచన
- కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సమీక్ష
- ప్రతిపక్షాలు, ప్రజల అభిప్రాయాలకు సంబంధించి ఇంటెలిజెన్స్ నివేదికపై ఆరా తీసిన ముఖ్యమంత్రి

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ఆందోళనలు రాజకీయం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని సుమారు 400 ఎకరాల భూములను పరిరక్షించాలని ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాలు, హెచ్‌సియు విద్యార్థులు నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంగళవారం అందుబాటులో ఉన్న మంత్రులతో చర్చలు తరువాయి 2లో

## ఆ 400 ఎకరాలు ఎన్నడూ అటవీ భూమి కాదు

హైకోర్టులో కౌంటర్ చేయనున్న అటవీ శాఖ ప్రభుత్వ వర్గాల వెల్లడి 12

### విద్యార్థుల ప్రతినిధి బృందంతో చర్చలు జరపండి

ప్రభుత్వానికి కూనంనేని విజ్ఞప్తి



కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూములకు సంబంధించి ఆందోళన వ్యక్తం చేస్తున్న హెచ్‌సియు విద్యార్థుల ప్రతినిధి బృందంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. భూముల విషయంలో ఆందోళన చేస్తున్న తరువాయి 2లో

## పోలీస్ పహారాలో గచ్చిబౌలి

- హెచ్‌సియు భూముల విషయమై ఆందోళనలు, అరెస్టుల పర్వం
- లాఠీచార్జి జరగకుండా సంయమనం పాటించండి: పోలీసులకు డిజిపి సూచన

గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు) భూములపై గత వారం రోజులుగా జరుగున్న ఆందోళనకు ఉధృతం కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సైబరాబాద్, హైదరాబాద్ పోలీసు కమిషనరేట్లతో పాటు రాచకొండ పోలీసులు సైతం అటెన్షన్ అయ్యారు. ఒకపక్క విద్యార్థి సంఘాలు, మరో పక్క రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఆందోళన బాట పట్ట డంతో గచ్చిబౌలికి అదనపు పోలీసు బలగాలను తరలించారు. ఆందోళన కారులపై అడ్డుకుని అరెస్టు తరువాయి 2లో



### 'మై హోం విహంగం'కు భూములిచ్చినప్పుడు పర్యావరణం గుర్తుకు రాలేదా?

కెటిఆర్‌పై విరుచుకుపడిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



మైహోం విహంగకు 25 ఎకరాల భూమి కేటాయించినప్పుడు పర్యావరణం దెబ్బతింటుందని కెటిఆర్‌కు కనిపించలేదా ? అని కాంగ్రెస్ ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. హైదరాబాద్ మై హోం విహంగ వద్ద ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, విద్యార్థి నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తరువాయి 2లో

## ఔషధ నిల్వల సంస్థలపై దాడులు

- కాలం చెల్లిన మందులు విక్రయిస్తూ ప్రజారోగ్యాలతో చెలగాటం
- నెలరోజుల్లోనే 65 కేసులు నమోదు
- ఔషధాల నిల్వలో జాగ్రత్తలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం : కమలాసన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా ఔషధాల నిల్వ, కాలం చెల్లిన మందులను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న పలు ఉత్పత్తి, విక్రయదారులపైన డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో డ్రగ్స్ అధికారులు సోదాలు, దాడులు నిర్వహించి ఒక నెల రోజులో సుమారు 65 కేసులను నమోదు చేశారు. మార్చి నెలకు తరువాయి 2లో



### బాణాసంచా యూనిట్‌లో

# భారీ పేలుడు

### 18 మంది దుర్మరణం

మరో ఐదుగురికి గాయాలు



**పలాన్‌పూర్ :** గుజరాత్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. బనస్కంతా జిల్లాలో ఓ బాణ సంచా యూనిట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు ఆకాశాన్నంటాయి. మంటల ధాటికి ఒక్కసారిగా భవనం కూప్పకూలింది. ఈ ఘటనలో 18 మంది దుర్మరణం చెందగా, మరో ఐదుగురు గాయపడినట్లు అధికారులు చెప్పారు. దీసా పట్టణ సమీపంలో ఉన్న పారిశ్రామిక ప్రాంతంలో తరువాయి 2లో

## నేటి నుంచి మదురైలో

# సిపిఐ(ఎం) జాతీయ మహాసభ

- ప్రారంభోత్సవ సభకు వామపక్ష నేతలు డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య
- మహాసభ ప్రాంగణానికి కామ్రేడ్ సీతారాం ఏచూరినగర్‌గా నామకరణం
- ఏర్పాట్లు పరిశీలించిన సమన్వయకర్త ప్రకాశ్ కారాత్
- రేపు సమాఖ్యవాదంపై సదస్సుకు దక్షిణాది సిఎంలు స్టాలిన్, పినరాయ్ విజయన్




**మదురై :** తమిళనాడు రాష్ట్రం మదురైలో సిపిఐ(ఎం) 24వ జాతీయ మహాసభ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 6వ తేదీ వరకు మహాసభ జరగనున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 800 మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. ఇందులో 80 మంది పరిశీలకులు ఉన్నారు. భారత రాజకీయాలలో పెరుగుతున్న మతతత్వ, కార్పొరేట్ ఆధిపత్య ప్రభావంపై మహాసభ చర్చించి పోరాట కార్యక్రమాన్ని తీసుకోనున్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు కొడియేరి బాలకృష్ణన్ స్మారక మందిరంలో మహాసభను సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కారాత్ ప్రారంభిస్తారు. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ అధ్యక్షతన జరిగే ప్రారంభ సభకు వామపక్ష అగ్రనేతలు, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్‌లు సౌహార్ద సందేశాలు ఇవ్వనున్నారు. మహాసభ జరగనున్న తముక్కం మైదాన్‌కు కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌గా, ప్రతినిధుల సమావేశం జరిగే మదురై కన్వెన్షన్ సెంటర్‌కు కామ్రేడ్ కొడియెరి తరువాయి 12లో

## నేడు లోక్‌సభకు వక్ఫ్ బిల్లు

- మధ్యాహ్నం ప్రవేశపెట్టనున్న పార్లమెంటరీ వ్యవహారాలశాఖమంత్రి కిరెన్ రిజిజు
- బిల్లుపై జరిగిన బిఎసి నుంచి ప్రతిపక్షాలు వాకౌట్
- జెపిసిలో చేసిన సవరణలు ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం



**న్యూఢిల్లీ :** వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లుపై లోక్‌సభ బుధవారంనాడు చర్చిస్తుంది. ఈ బిల్లును ఆమోదించవలసి ఉంది. దీంతో అధికార–ప్రతిపక్ష సభ్యులమధ్య ఈ సందర్భంగా తీవ్ర వాగ్వాదాలకు రంగం సిద్ధమైనట్లయింది. ప్రశ్నోత్తరాల సమయం పూర్తయిన వెంటనే మధ్యాహ్నం 12 గంటలకు మైనారిటీలు, పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరెన్ రిజిజు ఈ బిల్లును పరిశీలన,ఆమోదానికి లోక్‌సభ ముందుంచుతారు. మంగళవారం ఈ విషయంపై జరిగిన సభా వ్యవహారాల సంఘ (బిఎసి) సమావేశం నుండి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఎజెండాను తారుమారుచేసి ప్రతిపక్షాలకు ప్రభుత్వం చోటే లేకుండా చేసిందని ప్రధాన పార్టీల నాయకులు విమర్శించారు. 31మంది సభ్యులతో కూడిన సంయుక్త పార్లమెంటరీ కమిటీలో ప్రతిపక్ష సభ్యులు చేసిన సవరణలను పట్టించుకోకపోవడంతో కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆగ్రహంతో ఉన్నాయి. సభలో ప్రతిపక్షాలకు ఎక్కువ చర్చాసమయం ఇవ్వాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ఈ బిల్లును అమలు చేయవద్దని దేశంలో ఉన్న ముస్లిం సంస్థలు కోరుతున్నాయి. ప్రతిపాదిత చట్టం రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు ఉమ్మడిగా ప్రతిఘటిస్తున్నప్పటికీ ప్రభుత్వం తరువాయి 12లో

### ఉప్పల్ స్టేడియంలోకి

## విజిలెన్స్ అధికారులు

- హెచ్‌సిఎ, ఎస్ఆర్‌హెచ్ మధ్య వివాదంపై విచారణ షురూ
- టిక్కెట్ల అమ్మకం, పాసుల జారీ తదితర అంశాలపై కొత్త శ్రీనివాస్‌రెడ్డి ఆరా

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మధ్య నెలకొన్న ఐపిఎల్ టికెట్ల వ్యవహారంపై విజిలెన్స్ విచారణ మంగళవారం షురూ అయింది. ఈ నేపథ్యంలోనే ఉప్పల్ స్టేడియంలో విజిలెన్స్ అధికారులు వచ్చారు. విజిలెన్స్ చీఫ్ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి తరువాయి 2లో

సబ్ ఎడిటర్లు కావలెను
ప్రజాపక్షం దినపత్రికలో
సబ్‌ఎడిటర్లుగా, ట్రైనీ జర్నలిస్టులుగా పనిచేయుటకు ఆసక్తిగల వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము
ఇంగ్లీషు నుండి న్యూస్ ఐటమ్స్ తర్జుమా చేయగలిగిన, ఎడిట్ చేయగలిగిన వారికి సబ్‌ఎడిటర్లుగా ప్రాధాన్యత ఇవ్వబడును
రిటైర్డ్ జర్నలిస్టులకు ప్రాధాన్యత ఉంటుంది
ట్రైనీలకు శిక్షణ కాలంలో నెలకు రూ.10,000/- స్టయిఫెండ్ ఇవ్వబడును
తెలుగులో డిటిపి నేర్పరితనం ఉండాలి
సాయంత్రం 4-5 గంటల మధ్య మా కార్యాలయములోఎడిటర్‌ను స్వయంగా కలుసుకోవచ్చు
PRAJAPAKSHAM DAILY
12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post, Hyderabad - 500068, Telangana.
Ph: 94909 52109 E-Mail: editorprajapaksham@gmail.com

## యువకుడి దారుణహత్య

- మహబూబాబాద్ జిల్లా శనిగపురం శివారు భజనతండాలో ఘటన
- మృతుడు పార్థసారథిగా గుర్తింపు
- గతంలోనూ హత్యాయత్నం ?
- భద్రాచలం నుంచి వెంటాడి చంపిన హంతకులు



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం శివారు భజనతండాలో మంగళవారం ఉదయం ఓ యువకుడుని దారుణంగా గొడ్డలితో నరికి హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. మృతుడు భద్రాచలం వాసి పార్థసారథిగా గుర్తింపు, స్థానికులు, విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వివరాల్లోకి వెళితే పార్థసారధి భద్రాచలం ఐటిసి పేపర్ బోర్డ్ డిస్పెన్సరీలో పనిచేస్తూ ఉండేవాడు. అతనికి భార్య, తరువాయి 12లో

### సుంకాలను భారత్

## గణనీయంగా తగ్గిస్తుంది

అమెరికాతో వాణిజ్యం చేసే దేశాలపై పరస్పర సమాంతర సుంకాలు అమలు చేస్తామని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**న్యూయార్క్/వాషింగ్టన్ :** భారతదేశం గణనీయంగా తన సుంకాలను తగ్గిస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికాతో వాణిజ్యం చేసే దేశాలపై పరస్పర సమాంతర సుంకాలు అమలు చేస్తామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన గడువు బుధవారం నుండి మొదలైన నేపథ్యంలో ట్రంప్ పైవిధంగా వ్యాఖ్యానించారు. "నేను విన్నదానినిబట్టి, భారతదేశం కొద్దిసేపటిక్రితం తన సుంకాలను గణనీయంగా తగ్గించుకుంది, ఎందుకని కొంతమంది చాలాకాలం క్రితమే ఈ పని చేయలేకపోయారు? చాలా దేశాలు తమ సుంకాలను నేను చెప్పినట్లు ఇప్పుడు తగ్గించుకుంటున్నాయి" అని తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ఒక్క నిమిషం మౌనం

### 2,719కి చేరిన మయన్మార్ మృతులు



**యాంగాన్ :** మయన్మార్‌లో భూకంప మృతుల సంఖ్య 2,719కి పెరిగింది. మృతదేహాలను వెలికి తీస్తున్నారు. సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భారత్, చైనా, రష్యా, దక్షిణకొరియా తదితర దేశాలకు చెందిన బృందాలు సహాయ కార్యక్రమాలలో అండగా ఉన్నాయి. కాగా మయన్మార్‌లో సైనిక జుంటా పాలకులు భూకంపం సంభవించిన నాలుగు రోజుల తర్వాత మంగళవారంనాడు దేశవ్యాప్తంగా ఒక్క నిమిషం మౌనం పాటించాలని పిలుపు ఇచ్చారు. భూకంప మృతులకు సంతాప సూచకంగా దేశమంతటా ప్రజలు మౌనం పాటించారు. వారం రోజులపాటు జాతీయ సంతాప దినాలను ప్రభుత్వం ప్రకటించింది. ఇక థాయ్‌లాండ్‌లో బహుళ అంతస్తుల భవనం కింద శిథిలాల్లో 300 మంది కూరుకుపోయారు. వారిని వెలికితీసేందుకు సహాయబృందాలు కష్టపడుతున్నాయి.

# అమెరికాపై యుద్ధానికి ఇరాన్ క్షిపణులు సిద్ధం

### ట్రంప్ హెచ్చరికకు దీటుగా ఖొమైనీ సమాధానం





**టెహ్రాన్ :** ఇరాన్–అమెరికా మధ్య మళ్ళీ ఉద్రిక్తలు పెరుగుతున్నాయి. అణుఒప్పందంపై ప్రత్యక్ష చర్చలకు రాకపోతే ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా సిద్ధమేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికకు రంజాన్ ఉపవాసదీక్షల విరమణ సందర్భంగా జరిగిన భారీసభలో ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా ఖొమైనీ తీవ్ర హెచ్చరిక చేశారు. అమెరికాకు లొంగేదిలేదనీ, అమెరికాగానీ, ఇజ్రాయెల్‌గానీ తమపై కయ్యానికి కాలుదువ్వి యుద్ధం ప్రారంభిస్తే ఎదురుదెబ్బతీస్తామని హెచ్చరించారు. రమదాన్ సందర్భంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోందనీ, అమెరికా వత్తాసుతో మారణకాండకు పాల్పడుతోందని విమర్శించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆ ప్రణాళికలు అమలును పూర్తిచేసేందుకు పాశ్చాత్య వలసవాదులు ఇజ్రాయెల్ ముసుగు వేసుకుని యుద్ధోన్మాదం, ఊచకోతలతో పశ్చిమ ఆసియాలో దురాక్రమణకు పాల్పడుతున్నారన్నారు. ఉగ్రవాద వ్యతిరేకత పేరుతో వలసవాదులు మీడియా–సంపద అనే రెండు ఆయుధాలతో ప్రపంచాన్ని ఏలుతున్నారని విమర్శించారు. తమ హక్కులను, మాతృభూమిని రక్షించుకునేవారిని ఉగ్రవాదులుగా, నేరస్థులుగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. ఇరాన్ దక్షిణతీరప్రాంతంలోని భూగర్భంలో క్షిపణివ్యవస్థలను మోహరించడానికి ఒక ప్రత్యేకకేంద్రాన్ని అభివృద్ధి చేసింది. ఖొమైనీ ప్రకటనకు అనుగుణంగానే ఇరాన్ పత్రిక మంగళవారంనాడు నేలమాళిగలలో సిద్ధంగా ఉంచిన క్షిపణి వ్యవస్థల ఫొటోలను ప్రచురించింది. అమెరికా లేదా ఇరాన్‌లపై యుద్ధానికి ఇరాన్ సిద్ధంగా ఉందని సదరు పత్రికద్వారా ఖొమైనీ మంగళవారంనాడు రెండో హెచ్చరిక చేశారు. కావాలంటే అణు సమస్యపై అమెరికాతో పరోక్ష చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. 2015లో ఇరాన్‌తో అణుఒప్పందాన్ని అమెరికా రద్దుచేసుకున్న తర్వాత ఇరాన్ తన ఆయుధ పటిమపెంచుకునే ప్రయత్నాలను మరింత ముమ్మరం చేసింది. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకుంటోందని, లెబనాన్‌లో హిజ్బుల్లా ఉగ్రవాదులను, యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదులను, గాజాలో హమాస్ ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న ఇరాన్ పశ్చిమ ఆసియాలో ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందనీ, ఇరాన్ అణుకార్యక్రమం వల్ల ఈ ఉగ్రవాదులకే ప్రయోజనం కలుగుతుందని అమెరికా ఆరోపిస్తున్నది. ఒమన్, పసిఫిక్ గల్ఫ్ ప్రాంతంలో అమెరికా నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేందుకు అత్యాధునిక గైడెడ్ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులను సిద్ధం చేసిందని అమెరికా వాదిస్తున్నది. ఈ తరుణంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ అణు ఒప్పందంపై ప్రత్యక్ష చర్చలకు రావాలని ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా ఖొమైనీకి ఒక లేఖ పంపారు. అణు కార్యక్రమాన్ని పూర్తిగా రద్దుచేసుకోవాలని ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుండి అంటున్నారు. ఆ లేఖను ఇరాన్ తిరస్కరించింది. ఆమెరికాతో ప్రత్యక్ష చర్చల ప్రశ్నేలేదని స్పష్టం చేసింది. ఇరాన్‌కు అణ్వాయుధాలు ఉండకూడదని ట్రంప్ ప్రకటించారనీ, ఐతే ఇరాన్‌తో అణుశాంతి ఒప్పందాన్ని తనిఖీ చేయాలని ఆయన కోరుకుంటున్నారనీ, ఇరాన్ చమురు ఎగుమతులను కూడా చాలా పరిమితస్థాయికి తీసుకురావాలని దశాబ్దాలుగా యత్నిస్తోందని, కానీ ఇరాన్ చమురు ఎగుమతులను అమెరికా అడ్డుకోలేకపోయిందని, అమెరికా, ఇజ్రాయెల్ రెండు ఇరాన్‌పై తీవ్ర ద్వేషం ప్రదర్శిస్తున్నాయనీ, ఐతే దాడి చేసేంత సాహసం వాటికి లేదని, అదే జరిగితే తీవ్రమైన ఎదురుదెబ్బలు వారికి తగులుతాయని ఇరాన్ పత్రిక తన విశ్లేషణలో పేర్కొంది.

**ఇరాన్‌కు అణ్వాయుధ సామర్థ్యం ఉంది**
**అలీ లారిజానీ**



ఇరాన్‌కు అణ్వాయుధాలను తయారు చేయగల సామర్థ్యం ఉందని, కానీ తమ నాయకులు ఖొమైనీ మాత్రం దానిని వ్యతిరేకించారనీ, అణ్వాయుధాలు ఉత్పత్తి చేయవద్దని పేర్కొంటూ నిషేధ ఉత్తర్వు లేదా ఒక ఫత్వా (మతపరమైన ఆదేశం) జారీ చేశారని ఇరాన్ అత్యున్నతస్థాయి రాజకీయనాయకుడు అలీ లారిజానీ అన్నారు. సోమవారం రాత్రి ఒక టెలివిజన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకవేళ అమెరికా గనుక ఈ విధంగా ఇరాన్‌పై ఒత్తిడిచేస్తూ రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తే స్వీయ రక్షణకోసం బలవంతంగా అణ్వాయుధాను ఇరాన్ తయారు చేసుకోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. తమ సర్వోన్నత నాయకుడు ఫత్వా జారీ చేయడంవల్లనే తాము అణ్వాయుధాల విషయంలో ముందడుగు వేయలేకపోతున్నామన్నారు. ఇరాన్ చేస్తున్న అణు కార్యక్రమంపై తమతో ఒక ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌పై బాంబులు వేస్తామని, అదనపు సుంకాలు విధిస్తామని గడచిన ఆదివారం (మార్చి 27) ట్రంప్ హెచ్చరిక చేయడంతో మళ్ళీ ఉద్రిక్తతలు చెలరేగాయి.

## తైవాన్ చుట్టూ
# చైనా యుద్ధ విన్యాసాలు



**బీజింగ్ :** చైనాయుద్ధ నౌకలు తైవాన్‌ను చుట్టుముట్టాయి. తైవాన్ చుట్టూ సైనిక విన్యాసాలు చేస్తున్నాయి. దీంతో తైవాన్ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన జారీ చేసింది. చైనాను ''జగడాలమారిదేశం''గా అభివర్ణించింది. 19 యుద్ధ నౌకలు తమ దీవిదేశాన్ని చుట్టుముట్టాయని పేర్కొంది. చైనా కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. ఒకేచైనా అనే విధానానికి అనుగుణంగా తాము వ్యవహరిస్తున్నామనీ, తైవాన్ స్వాతంత్ర్య ప్రకటనకు ఇది ఒక హెచ్చరిక అనీ చైనా మరో ప్రకటనలో పేర్కొంది. చైనా తీరప్రాంత గస్తీ బృందాలు తైవాన్ చుట్టూ శాంతి భద్రతల గస్తీ నిర్వహించాయని ఈ దీవి చుట్టూ చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఈస్ట్రన్ థియేటర్ కమాండ్ సంయుక్త విన్యాసాలు నిర్వహించిందని పేర్కొంది. శాంతి భద్రతల యంత్రాంగం తైవాన్ దీవిని చుట్టుముట్టిందని చైనా అధికారిక పత్రి క తన సంపాదకీయంలో తెలియజేసింది. యుద్ధ విన్యాసాలను ప్రారంభించిన వెంటనే చైనా ఈస్ట్రన్ కమాండ్ తైవాన్‌కు హెచ్చరికలు చేస్తూ వార్నింగ్ కార్టూన్లు విడుదల చేసింది. పరాన్నభుక్కులా మారిన తైవాన్ నేత ఈ ప్రాంతాన్ని విషతుల్యం చేస్తున్నారని, నాశనం చేస్తున్నారనీ పేర్కొంటూ ఈ కార్టూన్లు చిత్రించారు.

# ఉక్రేన్ యుద్ధ నివారణకు నిర్మాణాత్మకపాత్ర: చైనా ప్రకటన



**బీజింగ్ :** ఉక్రేన్‌లో యుద్ధ నివారణకు నిర్మాణాత్మకపాత్ర నిర్వహించేందుకు చైనా సిద్ధంగా ఉందని ఆ దేశ విదేశాంగమంత్రి వాంగ్ యీ ప్రకటించా రు. ఐతే ఈ ఒప్పందంలో రష్యా ప్రయోజనాలకు ఆయన మద్దతు ఇచ్చారు. ఈ వారంలో ఆయన మాస్కోలో పర్యటిస్తున్నారు. ర ష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్‌తో, అధ్యక్షుడు పుతిన్‌తో ఆయన సమావేశాలు జరుపుతారు. ఈ సందర్భం గా రష్యా పత్రిక రియా నోవాస్తీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ,ఉక్రేన్ యుద్ధ ని వారణలో నిర్మాణాత్మకపాత్ర వహించేందుకు తా ము సిద్ధంగా ఉన్నామన్నారు. అమెరికా లేదా యూరప్ దేశాల తరహాలో ఆయుధాలను సరఫరాచేసి హింసను రెచ్చగొట్టేందుకు తాము సిద్ధంగా లేమని, తటస్థవైఖరితో శాంతి చర్చలకు సహకరిస్తామని అన్నారు. ఐతే తమపై విధించిన ఆంక్షలు తొలగించాలని, ఉక్రేన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పా టు కావాలని, ఒప్పందం అనంతరం ఉక్రేన్‌కు యూరప్ శాంతి దళాలను పంపకూడదనీ రష్యా షరతులు విధిస్తున్నది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉక్రేన్‌లో యుద్ధ నివారణకు చర్యలు ప్రారంభించినప్పటికీ ఇంతవరకూ సరైన ఫలితాలను రాబట్టలేకపోయారు. 30 రోజుల శాంతి ప్రణాళికను పుతిన్ తిరస్కరించారు. ఒప్పందం అమలుకు ముందుగానే ఉక్రేన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావాలని పుతిన్ షరతు విధించారు. ఇదిలా ఉండగా, మార్చి నెలలో రష్యా సేనలు యుద్ధభూమిలో ముందుకు దూసుకుపోయాయనీ, లుగాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్ ప్రాంత సరిహద్దులో ఒక్క నెలరోజుల్లో ఉక్రేన్ 22000 మంది సైనికులను, కిరాయి సైనికులను నష్టపోయిందని సైనిక నిపుణులు ఆంద్రూ మారోచ్‌కో మంగళవారంనాడు టాస్ వార్తాసంస్థకు చెప్పారు. ఫిబ్రవరినెలతో పోలిస్తే మార్చినెలలో ఉక్రేన్ తన యుద్ధాన్ని ఉధృతం చేసిందని ఆయన పేర్కొన్నారు.

## చర్చలు జరపండి (మొదటి పేజీ తరువాయి)

వర్సిటీ విద్యార్థులపై పోలీసుల బలప్రయోగాన్ని ఆయన ఖండించారు. అరెస్టయిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని, వారిపై కేసులు పెడితే ఉపసంహరించుకోవాలని, 400 ఎకరాల భూముల అమ్మకం విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూములు హెచ్‌సియు భూములని విద్యార్థులు అంటుండగా, అవి రాష్ట్ర ప్రభుత్వానివేనని ప్రభుత్వం అంటున్నదని, ఆ 400 ఎకరాలకు బదులుగా, వర్సిటీకి అంతే మొత్తంలో భూములు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం రికార్డులు చూపిస్తున్నదని, దీనిపై సందేహాలను నివృత్తి చేసేందుకు విద్యార్థుల ప్రతినిధి బృందంతో చర్చించి, వారి అభిప్రాయాలను స్వీకరించాలని ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వానికి సూచించారు. ఇలాంటి ఆందోళనలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించడం మంచిదని, ప్రభుత్వం ముందుకొచ్చి మాట్లాడితే మంచి సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందని కూనంనేని సాంబశివరావు సూచించారు. ఇలాంటి సున్నితమైన అంశాల విషయంలో పోలీసులు అతిగా ప్రవర్తించవద్దని, దాని వల్ల సమస్య జఠిలమవుతుందని, విద్యార్థులకు సహజంగానే ఆందోళన ఉంటుందని, దానిని అర్థం చేసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## భారీ పేలుడు (మొదటి పేజీ తరువాయి)

ఉదయం 9.45 గంటలకు ప్రమాదం జరిగిందన్నారు. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో భవనం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలిందని ఎస్‌పి అక్షయరాజ్ మక్వానా తెలిపారు. బాధితులు మధ్యప్రదేశ్‌కు చెందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులని, ఎక్కువ మంది భవనం పైకప్పు కూలి మీద పడడంతోనే మృతి చెందారన్నారు. బాణసంచా నిల్వచేసే యూనిట్‌గా తెలుస్తోందని, అయితే అక్కడ బాణసంచా తయారు చేస్తారా లేదా అనేది బయట పడలేదని ఎస్‌పి పేర్కొన్నారు. అయితే అంతకు ముందు బాణసంచా తయారీ కేంద్రంగా అధికారులు పేర్కొనడం గమనార్హం. కాగా, ఘటన పట్ల ముఖ్యమంత్రి భూపింద్ర పాటిల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరు చెప్పున రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ. 50 వేలు ఇవ్వనున్నారు. ఈ ఘటన తన హృదయాన్ని కలచివేసిందని చెప్పారు. మృతులకు సంతాపాన్ని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు. సహాయక, ఉపశమన చర్యలపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నానన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించానన్నారు. అదే విధంగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కూడా ఘటనను దురదృష్టకరమైందిగా పేర్కొన్నారు. తమ ప్రభుత్వం గుజరాత్ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతోందన్నారు.

## విజిలెన్స్ అధికారులు (మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలో విచారణ చేపట్టారు.హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, స్టేడియం సిబ్బందిని విచారించారు. టికెట్ల అమ్మకం, పాసుల జారీ, తదితర అంశాలపై శ్రీనివాస్‌రెడ్డి వారిని అడిగి తెలుసుకున్నారు. కాగా, టికెట్లు, పాసుల కోసం తమను ఇబ్బంది పెడుతుందని హెచ్‌సిఎపై ఎస్‌ఆర్‌హెచ్ ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి యాక్షన్ చేపట్టారు. సమగ్ర నివేదిక సమర్పించాలని విజిలెన్స్ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో నిజాలు రాబట్టేందుకు విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు.కాగా, గతంలోనూ హెచ్‌సిఎలో అక్రమాలు జరుగుతున్నాయంటూ సెప్టెంబర్ 18న భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు సోదాలు చేశారు.ఉప్పల్ స్టేడియంలో నిర్వహించే అంతర్జాతీయ మ్యాచ్‌లకు రవాణా, క్యాటరింగ్ కాంట్రాక్టులు ఇవ్వడంలో కొందరు హెచ్‌సిఎ సభ్యులు అవకతవకలకు పాల్పడ్డట్లు కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు చేశారు. సంబంధిత డాక్యుమెంట్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## ప్రభుత్వం అప్రమత్తం(మొదటి పేజీ తరువాయి)

జరిపారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించిన పూర్తి వివరాలను మంత్రులకు సిఎం వివరించారు. ఈ భూములను గతంలోని ప్రభుత్వం ఐఎంజి భారత్ అనే ప్రైవేటు సంస్థకు కేటాయించడం, ఆ సంస్థ భూములు ఇచ్చిన ఉద్దేశ్యాన్ని నెరవేర్చకపోవడం, తిరిగి కోర్టులో కేసు గెలిచి ఆ భూములను ప్రభుత్వం తీసుకోవడం తదితర అంశాలకు సంబంధించిన పూర్తి రికార్డుల గురించి మంత్రులకు సిఎం తెలియజేశారు. ఈ విషయాలను ప్రజలలోకి మరింత విస్తృతంగా తీసుకుపోవడం ద్వారా ఈ భూములపై ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాలు చేస్తున్న ఆందోళనలను ఆధారాలతో సమర్థవంతంగా ఎదుర్కొవాలని సిఎం ఈ సందర్భంగా సూచించినట్లు సమాచారం. మరోవైపు భూముల విషయంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను కూడా మంత్రులను అడిగి సిఎం తెలుసుకున్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంతో హైదరాబాద్‌లో ప్రతిపక్షాల ఆందోళన, ప్రజల అభిప్రాయాలకు సంబంధించిన ఇంటిలిజెన్స్ నివేదికను కూడా సిఎం ఆరా తీసినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని 'వన ఫౌండేషన్' పిల్ దాఖలు చేసింది. దీనిని అత్యవసరంగా విచారణకు స్వీకరించాలని ఫౌండేషన్ తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ఈ పిల్‌పై బుధవారం విచారణ చేపడతామని హైకోర్టు తెలిపింది.

## పర్యావరణం గుర్తుకు రాలేదా? (మొదటి పేజీ తరువాయి)

సంస్థ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేసేటప్పుడు ఎందుకు స్పందించలేదన్నారు. లోపాయికారి ఒప్పందాలు, వ్యక్తిగత స్వార్థప్రయోజనాల కోసమే మై హోం సంస్థకు అక్రమంగా ప్రభుత్వ భూమిని కట్టబెట్టారని బల్మూరి వెంకట్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. హెచ్‌సియుపై బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు లేని ప్రేమ నటిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచే గచ్చిబౌలిలో సర్వే 25లో 2004లో 534 ఎకరాలు ప్రభుత్వానికి ఇస్తున్నట్టు హెచ్‌సియు రిజిష్ట్రార్ సంతకం చేశారన్నారు. బదులుగా ప్రభుత్వం 397 ఎకరాలు ఇస్తున్నట్టు సంతకం చేశారని తెలిపారు. 534లో 400 ఐఎంజి భారత్‌కు 120 ఎకరాలు, ఉద్యోగ సంఘాలకు కేటాయించారని చెప్పారు. ఐఎంజి భారత్ ఒప్పందం ప్రకారం వ్యవహరించలేదని తెలిపారు. ఏ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళకుండా ప్రభుత్వం న్యాయ పోరాటం చేసిందన్నారు. 400 ఎకరాలు ప్రభుత్వ భూమిగా కోర్టుల్లో కోట్లాది సాధించామని చెప్పారు. ఈ భూములు ప్రైవేట్ వ్యక్తులకు చెందాలని కొందరు భావించారని ఆరోపించారు. ఈ 25 సర్వే నంబర్ లోనే బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మై హోం విహంగకు 25 ఎకరాలు కట్టబెట్టారన్నారు. ఇక్కడ పెద్ద భవనాలు నిర్మించారని, రెండు భవనాలకే 100 అడుగుల రోడ్డు నిర్మించారన్నారు. ఉద్యోగ సంఘాలకు కేటాయించిన భూమిలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తప్పుడు పేర్లతో 20 ఎకరాలు ఆక్రమించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఆ 20 ఎకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందనే భయంతో శ్రీనివాస్ గౌడ్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బల్మూరి వెంకట్ మండిపడ్డారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన మై హోం నిర్మాణాల వద్దకు ఫాక్ట్ ఫైండింగ్ కమిటీ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.

## గణనీయంగా తగ్గిస్తుంది (మొదటి పేజీ తరువాయి)

ట్రంప్ అన్నారు. ఈ విధంగా సమానస్థాయిలో అన్ని దేశాలపై సుంకాలు విధించడాన్ని ట్రంప్ ''అమెరికా లిబరేషన్ డే''గా గతంలో అభివర్ణించారు. ''చాలా దేశాలు తమ సుంకాలను తగ్గించుకుంటాయని నేను భావిస్తున్నాను, ఎందుకంటే అనేక సంవత్సరాలుగా వారు అమెరికా నుండి చాలా అన్యాయంగా ఎక్కువ సుంకాలు దండుకుంటున్నారు, మీరు కార్ల విషయంలో యూరోపియన్ యూనియన్‌ను చూడండి, ఇప్పటికే యూరోపియన్ యూనియన్ 2.5 శాతం మేరకు తన సుంకాలను తగ్గించుకుంది, రెండు రోజులక్రితం ఈ ప్రకటన వెలువడింది, ఇది చాలా తక్కువ సుంకం. అమెరికా అందరికంటే చాలా తక్కువ సుంకాలు వసూలు చేస్తోంది ఇప్పటివరకూ'' అన్నారు. వాషింగ్టన్‌లోని తన ఓవల్ కార్యాలయంలో మంగళవారంనాడు పాత్రికేయులు అడిగిన ఒక ప్రశ్నకు పైవిధంగా ఆయన సమాధానం చెప్పారు.భారత్ వసూలు చేస్తున్న సుంకాలు ప్రపంచంలో అన్ని దేశాలకంటే చాలా ఎక్కువగా ఉన్నాయని గతంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. ''మీరు ఎంత సుంకం వసూలు చేస్తే మేమూ అంతే సుంకం వసూలు చేస్తాం'' అనే విధానాన్ని ట్రంప్ ప్రకటించారు. బుధవారం నుండీ (ఏప్రిల్ 2) ఈ విధానం అమలులోకి వస్తుందని, ఇందులో ఎవ్వరికీ మినహాయింపు లేదని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడానికి కొద్ది గంటలు ముందుగా వైట్‌హౌస్ ఒక ప్రకటన చేస్తూ, భారతదేశం అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై నూటికి నూరుశాతం సుంకాలు విధించిందని పేర్కొంది. ఇతర దేశాలు భారీ ఎత్తున సుంకాలు విధించాయి, కానీ వాస్తవంగా ఇంతభారీ సుంకాల వసూలు సాధ్యంకాదు, మొదట చెప్పాల్సిన దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, ఈ దేశాలు చాలాకాలంగా అమెరికా నుండి సుంకాలను పిండుకుంటున్నాయి, అమెరికా కార్మికులపట్ల వారికున్న చిన్నచూపు, నిర్లక్ష్యం ఏమిటో దీన్నిబట్టి అర్థమవుతున్నది'' అని వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి కరోలిన్ లీవిట్ మంగళవారం పాత్రికేయులతో అన్నారు. 2''అమెరికా డైరీ ఉత్పత్తులపై యూరోపియన్ యూనియన్ 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది, అమెరికా బియ్యంపై జపాన్ 700 సుంకాలు వసూలు చేస్తోంది, భారతదేశం కూడా అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై 100 శాతం సుంకాలు వసూలు చేస్తోంది, ఇక కెనడా దేశం అమెరికా వెన్న, జున్నుపైన 300 శాతం సుంకాలు వసూలు చేస్తోంది, ఈ విధంగా చాలా అన్యాయపూరితమైన వాణిజ్య విధానం అమలులో ఉంది'' అని లీవిట్ చెప్పారు.

**అమెరికా లిబరేషన్ డే పై ప్రపంచం ఉత్కంఠ**

ట్రంప్ సుంకాల గురించి ఇప్పటికీ వివరంగా తెలియకపోవడంతో అమెరికాతో వాణిజ్యం చేస్తున్న ప్రపంచదేశాలు చాలా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. ఏప్రిల్ రెండో తేదీ నుండి ఈ సుంకాలు అమలులోకి వస్తాయని నెలరోజుల క్రితమే ట్రంప్ ప్రకటించారు. భారీగా దిగుమతి సుంకాలు పడతాయని ప్రపంచ ఇన్వెస్టర్లు సిద్ధంగా ఉండటంతో ప్రపంచమార్కెట్లు ఊగిసలాటలో ఉన్నాయి. ప్రతీకార సుంకాలకు తాము సిద్ధంగా ఉన్నామని యూరోపియన్ యూనియన్ ప్రకటించగా, దుందుడుకుగా తక్షణం తాను నిర్ణయం తీసుకోబోనని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ చెప్పారు. తాము ఇంటిలిజెంట్‌గా వ్యవహరిస్తామని కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ చెప్పారు. తమ దేశ ప్రజలను తాము ఇబ్బందులపాటు చేయబోమన్నారు. ఐతే కెనడాపై 25 శాతం సుంకాలు విధించేందుకు ట్రంప్ ఎమర్జెన్సీ అధికారాలు ఉపయోగించాలని భావిస్తున్నారు. కానీ సెనేట్ మాత్రం బుధవారంనాడు రాత్రి పొద్దుపోయాక జరిగే సమావేశంలో ట్రంప్ ఆలోచనలను అడ్డుకోవాలని భావిస్తున్నది. ల్యూమినియం, స్టీలు, కార్లు, ఇతర ఉత్పత్తులపై ఇప్పటికే ట్రంప్ ఎంతెంత వసూలు చేయాలనుకున్నారో చెప్పకనే చెప్పారు. టారిఫ్‌ల అనిశ్చితివల్ల స్టాక్‌మార్కెట్లు కూడా నిశ్చలంగా ఉండిపోయాయి.

## దాడులు (మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన డ్రగ్స్ దాడుల వివరాలను డ్రగ్స్ కంట్రోల్ డైరక్టర్ జనరల్ వి.బి. కమలాసన్ రెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఎటువంటి అర్హతలేకుండా, లైసెన్సులు పొందకుండా అక్రమంగా ఔషధాలను నిల్వ, ఔషధాల నిల్వలో జాగ్రత్తలు పాటించని వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రెండు నుంచి ఎనిమిది డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన ప్రదేశంలో నిల్వ చేయాల్సిన టెటానస్ వ్యాక్సిన్,ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్‌లోని నందిని ఫార్మలో సాధారణ మందులతో కలిపి నిల్వ చేసింది. సమాచారం అందుకున్న అధికారులు ఫార్మపైన దాడులు నిర్వహించి, కేసు నమోదు చేశారు. సాధారణ ఉష్ణోగ్రతలో టెటానస్ వ్యాక్సిన్,ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు నిల్వ చేయడం ద్వారా ఆ ఔషదాల శక్తి తగ్గిపోవడంతో పాటు, ఇలాంటి ఇన్‌జెక్షన్లను వాడటం కారణంగా రోగుల ఆరోగ్యానికే హానికరం ఏర్పడే ప్రమాదం ఉన్నదని, పైగా ఇలాంటి ఔషదాలు తగిన ఫలితాలను ఇవ్వలేదని డ్రగ్స్ అధికారులు తెలిపారు. ఇలాంటి ఔషదాలను సాధారణ ఉష్ణోగ్రత కలిగిన గదిలో నిల్వ చేయడం ఔషధ లైసెన్స్ నిబంధనలకు వ్యతిరేకమని, ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం పకారం శిక్షార్హమైన నేరమని, దీనికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష పడుతుందని అధికారులు వివరించారు. ఎటువంటి అర్హ తలు లేని, డ్రగ్స్ లైసెన్సులు పొందుకుండా రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలోని చిక్కడపల్లి గ్రామంలో కుర్మ మల్లేష్ నుంచి 34 రకాల మందులు, మెదక్ జిల్లాలోని కొత్తపేట్ రూప్ల కు చెందిన బాలాజీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు చెందిన పల్య రాజు నుంచి 30 రకాలు మందులను, సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారంక చెందిన ఎబిఆర్ఎస్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ జి రాధారుక్మిణి నుంచి 20 రకాలు మందులు, మల్కాజిగిరి జిల్లాలోని బౌరంపేట శ్రీసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ షేక్ జాని బాషా నుంచి 35 రకాలు, తూంకూంటలోని శంకర్‌గౌడ్‌నుంచి 18 రకాలు, రంగారెడ్డి జిల్లా తుక్కుకూడలోని సరోజిని క్లినిక్‌కు చెందిన గుండె నర్సింహ,నుంచి 18 రకాలు, సిద్ధిపేట జిల్లాలోని జగ్‌దేవ్‌పూర్ గ్రామంలో బి.లక్ష్మ ణ్ నుంచి 11 రకాల మందులను మొత్తంగా రూ. 1.23లక్షల విలువ చేసే ఔషదాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాగా జ్వరం, డయబెటిస్, కిడ్నీ, మూత్రాశయంలో రాళ్లు, మానసిక ఒత్తిడి, ఇలా పలు రకాల వ్యాదులకు ఆయుర్వేద మందుల పేరుతో మోసపూర్తి ప్రకటనలతో ఔషదాలను విక్రయిస్తున్న సుమారు 50 సంస్థలపై డ్రగ్స్ అధికారులు దాడుల నిర్వహించి, వారి కేసు నమోదు చేశారు.

## గచ్చిబౌలి (మొదటి పేజీ తరువాయి)

చేయాలని, లాఠీచార్జికి తావివ్వకుండా చూడాలని డిజిపి డాక్టర్ జితేందర్ ట్రై కమిషనరేట్ల పోలీసు కమిషనర్లకు సూచించారు. హెచ్‌సియు భూములపై క్యాంపస్ లో విద్యార్థుల ఆందోళన నిర్విరామంగా కొనసాగుతోంది. ఈ మేరకు మంగళవారం మొత్తం తరగతుల బహిష్కరణకు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా నిరసనలను మరింత ఉధృతం చేయాలని వారు నిర్ణయించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదం రాజకీయంగా వేడెక్కింది. నిన్నటిదాకా విద్యార్థులు తమ నిరసన తెలిపారు. వారికి మద్దతుగా బిజెపి,బిఆర్‌ఎస్ నేతలు మంగళవారం యూనివర్సిటీకి వెళ్తామని ప్రకటించారు. ఐతే.. ఉద్రిక్తతల దృష్టిలో ఉంచుకుని పోలీసులు ముందస్తు చర్యలు తీసు కుంటున్నారు. హైదరాబాద్‌లో బిజెపిఎల్‌పి నేత మహేశ్వర్ రెడ్డి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇంటి ముందు భారీగా పోలీసులను మోహరించారు. ఈ క్రమంలోనే మహేశ్వర్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో హౌజ్ అరెస్ట్ చేశారు.అక్కడికి వచ్చిన బిజెపి ఎంఎల్‌ఎలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పాయల్ శంకర్, నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి నారాయణగూడ పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో పాటు హెచ్‌సియుకు వెళ్లే అన్ని మార్గాలలో పోలీసు చెక్‌పోస్టులు సైతం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఆందోళనకారుల కదలికలపై ఇంటెలిజెన్స్‌తో పాటు స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఎప్పటికప్పుడు నిఘా పెట్టారు. బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు ఈ ఆందోళనకు రాజకీయ రంగు పులమడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. హైదరాబాద్‌లోని ఆ పార్టీల ప్రధాన కార్యాలయాలు, ప్రజా సంఘాల కార్యాలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ప్రైవేట్ చేతుల్లోకీ... (మొదటి పేజీ తరువాయి)

చేతుల్లో అన్యాక్రాంతమైన రాష్ట్ర సంపదను, న్యాయస్థానంలో పోరాడి విజయం సాధించి, తిరిగి ప్రజలకు ఆస్తిగా తీసుకొచ్చామని తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర మంత్రులు దుదిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌ఎ లక్ష్మ ణ్, ఎంఎల్‌సి బల్మూరి వెంకట్, సిసిఎల్‌ఎ నవీన్‌మిట్టల్‌తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. హెచ్‌సియుకు సంబంధించిన ఇంచు భూమిని కూడా రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. హెచ్‌సియు భూములు ఆ యునివర్సిటీ పేరుతో లేవని, ప్రస్తుతం ఉన్న యూనివర్సిటీ భూములను హెచ్‌సియు పేరు మీదకు బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. హెచ్‌సియుకు భూ బదలాయింపు జరిగిన తర్వాత అప్పటి ప్రభుత్వం కంచె గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమిని బిల్లీ రావుకు చెందిన ఐఎంజి భారత్ అనే క్రీడా నిర్వహణ సంస్థకు కేటాయించారని, ప్రభుత్వ ఒప్పందం మేరకు ఆ భూమిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకపోవడంతో అప్పటి సిఎం వైఎస్‌ఆర్ ఐఎంజి భారత్ కు కేటాయించిన ఆ భూమిని రద్దు చేశారని వివరించారు. దీనిపైన ఐఎంజి భారత్ సవాల్ చేస్తూ హైకోర్టులో డబ్ల్యుపినంబర్ 24781 ద్వారా రిట్ పిటిషన్ దాఖలు చేయగా, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వాదనలు వినిపించారని వివరించారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోనికి వచ్చిన గత ప్రభుత్వం(బిఆర్‌ఎస్) ఈ అంశా న్ని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. కోట్లాది విలువైన ఈ భూమి ప్రైవేటు వ్యక్తి చేతుల్లోనే ఉంటే, మరో రకంగా గత పాలకులు వారి చేతుల్లోకి తెచ్చుకోవాలనే కుట్రతోనే న్యాయస్థానంలో గట్టిగా న్యాయ పోరాటాన్ని చేయలేదని ఆరోపించారు.ఆ తర్వాత అధికారంలోనికి వచ్చిన ప్రజాప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తి చేతుల్లో ఉన్న 400 ఎకరాల భూమి రాష్ట్ర సంపద అని,ఆ స్థలాన్ని ప్రజల ఆస్తిగా భావించి,ఈ భూమిని ప్రైవేటు వ్యక్తి చేతుల్లోకి పోనివ్వకుండా ప్రజలకు సంపద సృష్టించే ఆస్తిగా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సహా మంత్రి మండలి నిర్ణయించిందని తెలిపారు. అందుకే న్యాయస్థానంలో కొట్లాడి వేల కోట్ల విలువైన భూమిని రాష్ట్రానికి తీసుకొచ్చామని, ఇది ప్రజల విజయమంగా భట్టి అభివర్ణించారు. ఈ భూమిని రాష్ట్ర ప్రజలకు ఆస్తిగా సృష్టించాలని, లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే రెవెన్యూ శాఖ నుంచి టిజిఐఐసికి అప్పగించామే తప్ప, ఇందులో తమకు ఎటువంటి వ్యక్తిగత స్వార్థం లేదని భట్టి స్పష్టం చేశారు.ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీ లో ఫేస్ 1, ఫేస్ 2కు పునాదులు వేయడంతోనే హైదరాద్ గ్లోబల్ సిటీగా మారిందని, తద్వారా ఐటీ సంస్థలు నగరానికి వచ్చి కంపనీలు పెట్టడం వల్ల లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు దొరికాయని, దీంతో హైదరాబాద్ మహానగరం అభివృద్ధి చెందిందని తెలిపారు. అదే తరహాలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని సంపద సృష్టించేందుకు, యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న ఆలోచనతో అభివృద్ధి చేస్తున్నామే తప్ప ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి స్వార్థం లేదన్నారు. ప్రైవేటు వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతం కాకుండా పోరాటం చేసి కాపాడిన ఈ భూమిని ప్రజలకు ఆస్తిగా ఇవ్వడానికి ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని కొన్ని రాజకీయ పార్టీలు,వారికి చెందిన మీడియా సంస్థల ద్వారా, సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు అర్థం చేసుకుని, వాటిని తిప్పికొట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హెచ్‌సియుతో తనకు వ్యక్తిగతంగా బాండింగ్ ఉన్నదని,ఈ యూనివర్సిటీ మరింత అభివృద్ధి చెందాలని, అందుకు కావాల్సిన సహకారం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, అక్కడ చదివిన ప్రతి విద్యార్థికి బయటకు రాగానే ఉద్యోగాలు రావాలని, మంచి భవిష్యత్తు ఉండాలని తమ ప్రభుత్వం కోరుకుంటుందని ఆయన చెప్పారు. టిజిఐఐసి తయారు చేసిన డ్రాఫ్ట్‌లే ఔట్‌లో ఈ భూముల్లో ఉన్న న్యాచురల్ రాక్ ఫార్మేషన్స్, అందులో భాగంగా మష్రూమ్ రాక్ ను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో ఈ ప్రాంతాలను లే అవుట్ నుండి మినహాయించామన్నారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్ ఉండాలని పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భట్టి తెలిపారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హెచ్‌సియుకు చెందిన స్థలాన్ని తీసుకోవడం లేదని, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు.

**అబద్ధాలను నిజాలుగా చిత్రీకరిస్తున్న 'ఫెవికాల్ పార్టీలు ' : పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఫెవికాల్ బంధం కలిగిన రెండు రాజకీయపార్టీ లు అబద్ధాలను నిజాలుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. పక్షులు చనిపోయినట్టు రుజువు చూపిస్తారా? అని డిమాండ్ చేశారు. ఎప్పటివో పాత చిత్రాలను చూపిస్తూ సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచా రం చేస్తున్నారని ఆరోపించారు. హెచ్‌సియు ఏర్పాటు చేసిందే, కాంగ్రెస్ పార్టీ అని, ఈ యూనివరిసటీ ఇందిరాగాంధీ పెటెంట్ హక్కు అని అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## విద్యార్థులను రెచ్చగొడుతున్న బిజెపి

కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు)కి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సెంటు భూమి కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాని ఇప్పుడు తాము వర్సిటీకి ఇచ్చిన భూములు అన్నట్టు మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. అనవసరంగా హెచ్‌సియు విద్యార్థులను బిజెపి రెచ్చగొడుతుందని మండిపడ్డారు. విద్యార్థులకు నష్టం జరిగే చర్యలు ప్రభుత్వం ఎప్పటికీ చేపట్టదని ఆయన అన్నారు. ఆ భూములు ప్రభుత్వానివే అనడానికి తగిన ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయని చెప్పారు. ఇన్నాళ్ళు ఆ భూమిపై వివాదం కోర్టులో ఉండటంతో అది వర్సిటీ భూమిగా పొరబడుతున్నారని తెలిపారు. ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని కోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని విస్మరించడం దురదృష్టకరమన్నారు. కోర్టు తీర్పు అనుగుణంగానే ప్రభుత్వం ఆభూమిని స్వాధీనం చేసుకుంటుందన్నారు. న్యాయ స్థానాలకు లోబడే తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

# దేశంలోనే 'సన్నబియ్యం' చరిత్రాత్మకం

పేదలు సన్నబియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

త్వరలోనే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు

కరీంనగర్‌లో తాగునీటికి ఢోకాలేదు

రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** భారతదేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ధనికులు తినే సన్న బియ్యాన్ని పేదలకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే సన్న బియ్యం పంపిణీ పథకం చరిత్రాత్మకమని, ముఖ్యమంత్రి పేదల కోసం మహత్తరమైన పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రంలో దారిద్రరేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా తినదగిన బియ్యం సరఫరా చేస్తామని, ఈ పథకం పేదల గుండెల్లో నిలిచే పథకమని మంత్రి పేర్కొన్నారు. కరీంనగర్ పట్టణం హౌజింగ్ బోర్డు కాలనీలో మంగళవారం సన్నబియ్యం పంపిణీ పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు మంత్రి సన్నబియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ధనికులు తినే సన్నబియ్యాన్ని పేదలకు తమ ప్రభుత్వం అందిస్తున్నదని, ఈ పథకాన్ని పేద ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో అర్హులైన పేద ప్రజలందరికీ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని మంత్రి వెల్లడించారు. కరీంనగర్ జిల్లాలో 566 రేషన్ షాపుల ద్వారా 276930 రేషన్ కార్డుదారులకు ఎనిమిది లక్షల పదివేల మందికి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి నెల ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తామని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో వానాకాలంలో 72లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం వరిధాన్యం ఉత్పత్తి అయ్యిందని, దీని ద్వారా 34 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. తమ ప్రభుత్వం సన్నరకం వరిధాన్యం పండించేందుకు రైతులకు ఎకరానికి బోనస్ 500 రూపాయల చొప్పున అందిస్తున్నదని తెలిపారు. రైతులకు దాదాపు 36 కోట్ల రూపాయలను సన్న రకం వరి ధాన్యానికి బోనస్ కింద అందించామని చెప్పారు. పదేళ్ల పాలించిన బిఆర్ఎస్ సర్కారు ఇలాంటి ఆలోచన చేయకపోవడం శోచనీయమన్నారు. పేద ప్రజలను ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. కరీంనగర్‌లో తాగునీటికి ఎలాంటి ఢోకా లేదని, కొందరు ప్రజలను కన్ఫ్యూజన్ చేసేందుకు తాగు నీటి సమస్య ఉందని రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు. వారి మాటలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డిఎస్‌వో నర్సింగ రావు, సివిల్ సప్లైస్ డిఎం రజనీకాంత్, అర్బన్ బ్యాంకు అసోసియేటెడ్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఆకుల పద్మ ప్రకాష్, నేతికుంట యాదయ్య, నాయకులు మల్లికార్జున రాజేందర్, ఆకారపు భాస్కర్ రెడ్డి, మాచర్ల ప్రసాద్ తదితరులున్నారు.

# చరిత్రలో నిలిచిపోయే పథకం

గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డూ ఇవ్వలేదు

కనగల్ మండలం జి.యడవెల్లిలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్) :** సన్న బియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకమని, చరిత్రలో నిలిచిపోయే పథకామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఉగాది రోజున ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పథకం పంపిణీలో భాగంగా మంగళవారం నల్గొండ జిల్లా కనగల్ మండలం, జి.యడవల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో రూ.4.63కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం 10ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పుడో మర్చిపోయారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తండ్రి, కొడుకులు అల్లుడు, బిడ్డ రాష్ట్రాన్ని దోచుకుని ఖజానా ఖాళీ చేశారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టిందని అన్నారు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు 20 లక్షల మందిని రేషన్ కార్డులలో పేర్లు చేర్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మందికి సన్నబియ్యాన్ని ఇవ్వనున్నామని తెలిపారు. 5లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు ఇవ్వనున్నామని చెప్పారు. కనగల్ మండలంలో 20 ఏండ్ల కింద ఒక్కొక్కటి లక్ష రూపాయలతో తాను 500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, ఇప్పుడు మళ్లీ ఐదు లక్షలతో ఇల్లు కట్టిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డుదారులు, రెసిడెన్షియల్ పాఠశాలలు, పాఠశాల, హాస్టల్ విద్యార్థులు, అందరికీ సన్నబియ్యం పంపిణీ చేసేందుకు రైతులు సన్నధాన్యాన్ని ఎక్కువగా పండించాలని, రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యాన్ని ప్రోత్సహించడం లో భాగంగా గ్రేడ్ ఏ ధాన్యాన్ని 2320 రూపాయలు క్వింటాలకు చెల్లించి కొంటున్నదని, 500 రూపాయల బోనస్ ఇస్తున్నదని తెలిపారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి :** ఐకెపి ఆధ్వర్యంలో జి.యడవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, ఇన్‌చార్జి డిఎస్‌ఓ హరీష్ , డిఆర్డిఎ పిడి శేఖర్ రెడ్డి, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, డిసిఓ పత్యా నాయక్,, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం అనూప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల్లో సన్నబియ్యం కీలకం

ప్రభుత్వ ప్రతిష్టను పెంచే పథకం ఇది

అవినీతి, అక్రమాలకు తావులేకుండా కొనసాగించాలి

పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాచలం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో సన్నబియ్యం పంపిణీ పథకం కీలకంగా మారనుందని, పేద కుటుంబాల వారి ఆకలి తీర్చే ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సాహసమేనని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని 28వ వార్డు రామాటాకీస్ ఏరియా, చుంచుపల్లి మండలంలోని రాంనగర్, సుజాతనగర్‌లోని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలకులు సన్నబియ్యం పథకం అమలు ప్రకటనలకే పరిమితమైందని, ఇతర రాష్ట్రాలకు ఈ పథకం ఆదర్శం అన్నారు. ప్రజల ఆరోగ్యానికి, పోషకాహార భద్రతకు ఈ పథకం దోహదపడుతుందని, దీనిని పేదవర్గాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి అవినీతి అవకతవకలు లేకుండా, అక్రమాలకు తావులేకుండా కొనసాగించాలన్నారు. పేదల బియ్యం పక్కదారిపడితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, జిల్లా సివిల్ సప్లై అధికారి రుక్మిణిదేవి, డిఎం త్రినాథ్‌రావు, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణ, శిరీష, డిటి.మహేష్, స్థానికులు వాసిరెడ్డి మురళి, భూక్యా ధస్రు, భాగం మహేశ్వర్‌రావు, జక్కుల రాములు, కొమారి హన్మంతరావు, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, నేరెళ్ల శ్రీనివాస్, భూక్యా శ్రీనివాస్, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణ చారి, సుధాకర్, దుర్గ, యాలాద్రి, యాకూబ్, యాసిన్, వేణు, రాములరావు తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టండి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** వేసవి ఎండలు తీవ్రరూపం దాలుస్తున్న పరిస్థితిలో గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో తాగు నీటి ఎద్దడి నివారణకు పటిష్టమైన చెర్యలు చేపట్టాలని కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తగూడెం, పాల్వంచ మున్సిపల్, పబ్లిక్ హెల్త్, భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్ అధికారులతో మంగళవారం సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, ప్రతిపాదనలో ఉన్న మంచినీటి పథకాలు, బోర్లు, పైప్ లైన్లను తక్షణమే పూర్తి చేసి ప్రజలు అందుబాటులోకి తేవాలని, మరమ్మతులకు గురైన బోర్లు, పైప్ లైన్లను, మంచినీటి ట్యాంకులకు తక్షణమే మరమతులు చేయాలని ఆదేశించారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉన్నా అధికారులు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్య పరిష్కారానికి కావాల్సిన నిధులు కేటాయించే విషయంలో తొలి ప్రాధాన్యత ఇస్తానని, ఎన్ని నిధులైనా కేటాయించేందుకు వెనుకాడేది లేదన్నారు. నీటి సమస్య పరిష్కారం కోసం నియోజకవర్గానికి మంజూరైన రూ.1.90కోట్ల నిధులకు సంబంధించిన పనులు తక్షణమే ప్రారంభించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నీటి పథకాలకు కావాల్సిన నిధుల ప్రతిపాదనలు తక్షణమే అందించాలని సూచించారు. మంచినీటి సమస్యపై ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందినా అధికారులే బాధ్యతవహించాల్సి వస్తుందని, విధులపట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పబ్లిక్ హెల్త్ డిఇ శ్రీనివాస్, మిషన్ భగీరథ డిఇ సాయి, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్‌డిఈ శివయ్య, మున్సిపల్ డిఇ రవి కుమార్, ఎఇలు పాల్గొన్నారు.

## గూడాలు, తండాలలో మంచి నీటి ఎద్దడి నివారణకు
# ప్రభుత్వం ప్రత్యేక యాక్షన్ ప్లాన్

తెలంగాణ గిరిజన సమాఖ్య విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న మూడు నెలలు అధిక ఉష్ణోగ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఏజెన్సీ గిరిజన ప్రాంతాలలో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ చేపట్టాలని, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణాలకు కిలోమీటర్ల దూరంలో ఏజెన్సీ ప్రాంతాల్లో మైదాన ప్రాంతాలలో నీటి వనరులకు దూరంగా గూడాలు, తాండాలో ఆదివాసీ గిరిజనులు నివసిస్తుంటారని, వేసవి ప్రారంభానికి ముందే ఏజెన్సీలో నీటిమట్టం తీవ్రంగా పడిపోవడం తాగునీటి కోసం గిరిజనులు, ఇప్పటికే కొన్ని కిలోమీటర్ల దూరంలో చెలిమెల ద్వారా, ఊట బావుల ద్వారా నీటి కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సినటువంటి పరిస్థితి నెలకొందన్నారు. రానున్న మూడు నెలల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన తండాలలో, గూడాలలో నీటి సౌకర్యం కల్పించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు . కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వార్షిక ప్రణాళికలో గిరిజనులకు కేటాయించినటువంటి బడ్జెట్ గత కేటాయింపులు గిరిజన గూడాలకు తండాలకు ఖర్చుచేయకపోవటం వల్లనే నేడు తండాలో, గూడాలలో ఈ దుర్భర పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజన, ఆదివాసీలకు కేటాయించిన బడ్జెట్‌ను కాగితాలకే పరిమితం చేయకుండా ఈ వర్గాల అభివృద్ధికి ఖర్చు చేయడం ద్వారా వారికి కనీస వసతుల కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గూడాల్లో, తండాల్లో మంచినీటి సౌకర్యం అందేవిధంగా గిరిజనులు, వయోవృద్ధులు గర్భిణీలు, చిన్న పిల్లలకు పునరవాస కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. నోరులేని గిరిజనుల కోసం, వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని, అప్పుడే ప్రజాపాలన ప్రభుత్వం గిరిజనుల పక్షపాతి ప్రభుత్వంగా మన్నన పొందుతారని అంజయ్య నాయక్ అన్నారు.

## హెచ్‌సియు భూములను
# రాష్ట్ర ప్రభుత్వం లాక్కోవడంలేదు

కోర్టు కేసు పూర్తయినందున భూముల స్వాధీనం

హెచ్‌సియు భూముల వ్యవహారంలో బిజెపి, బిఆర్ఎస్ దోస్తీ బయటపడింది

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సియు) భూముల వ్యవహారంలో బిజెపి, బిఆర్ఎస్ పార్టీల మైత్రి మరోసారి బహిర్గతమైందని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. హెచ్‌సియు భూములను రాష్ట్ర ప్రభుత్వం లాక్కోవడంలేదని ఆయన స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌సియు భూములకు బదులుగా ఇంతకు ముందే ప్రభుత్వ భూములు కేటాయించారని చెప్పారు. అప్పటి నుంచి అవి ప్రభుత్వ భూములుగానే పరిగణించబడుతున్నాయని అన్నారు. న్యాయస్థానం స్టే విధించిన కారణంగానే ఆ భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదని తెలిపారు. కోర్టు కేసు ముగిసినందున భూములను స్వాధీనం చేసుకుంటామని ఆయన వెల్లడించారు. హెచ్‌సియు భూముల వ్యవహారంలో ఒక వైపు రాష్ట్రంలో బిఆర్ఎస్ నేతలు విద్యార్థులను రెచ్చగొడుతుండగా, మరోవైపు బిజెపి నాయకులు, కేంద్ర మంత్రులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా బిజెపి, బిఆర్ఎస్ పార్టీల స్నేహం అంబికా దర్బార్ అగర్‌బత్తి ప్రకటనలా ఉందని మహేష్‌కుమార్ ఎద్దేవా చేశారు.

# 'వర్సిటీ' భూముల్ని కాపాడాలి

సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హెచ్‌సియు భూముల్ని అమ్మకుండా కాపాడాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేయడం, అక్రమ కేసులు పెట్టడం హేయమైన చర్య అని అన్నారు. అక్కడ ఉన్న పచ్చని చెట్లను ధ్వంసం చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూముల్ని, పర్యావరణ భూముల్ని యూనివర్సిటీ పరిధిలోనే ఉంచాలన్నారు. హైదరాబాద్ పర్యావరణ సమతుల్యత రక్షించడానికి ప్రభుత్వం, పౌర సంఘాలు, రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలన్నారు. ఇది రాజకీయ కుట్రలకు అవకాశంగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యార్థులు, పౌర సమాజం, విద్యార్థి సంఘాలు ఐక్యంగా కదిలి ప్రభుత్వ చర్యలపై బలమైన పోరాటం చేయాలని ఆయన కోరారు.

## హెచ్‌సియు భూముల అమ్మకం
# అనాలోచిత నిర్ణయం




విద్యార్థి జెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్ వర్గాలకు ప్రభుత్వం ధారాదత్తం చేసే అనాలోచితమైన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంతో పాటు ఓయులో అప్రజాస్వామిక సర్క్యులర్ ఉపసంహరించుకోవాలని రాష్ట్ర విద్యార్థి జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. హెచ్‌సియు భూములను అమ్మకాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ, పిడిఎస్‌యు, పిడిఎస్‌యు (విజృంభణం, ఎఐటిఎస్‌ఓ, బిఆర్ఎస్‌వి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఓయులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట.లక్ష్మణ్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్. మూర్తి, పిడిఎస్‌యు (వి) విజయ్, పిడిఎస్‌యు నవీన్ , బిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ హెచ్‌సియు భూములను కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేసే అనాలోచితమైన నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు. హైదరాబాద్‌కి ఆక్సిజన్ అందించే హెచ్‌సియు భూములను వేలం వేయడం ద్వారా బయోడైవర్సిటీని దెబ్బ తీస్తున్నారని, రాత్రికి రాత్రి బుల్డోజర్లు పెట్టి భూమిని చదును చేయడం దుర్మార్గమన్నారు. దీనిని అడ్డుకునేందుకు వెళ్లిన విద్యార్థులపై పోలీస్‌లు కర్కశంగా వ్యవహరిస్తూ నిరసన తెలియజేసిన విద్యార్థినిలు అని చూడకుండా పోలీసులు హింసించడం, అమ్మాయిలను రాత్రి వరకు పోలీస్ స్టేషన్‌లో బంధించి మరోసారి ఆందోళన కార్యక్రమంలో బలవంతంగా లేఖలు ఇవ్వాలని పోలీసులు ఒత్తిడి తీసుకురావడం దారుణమన్నారు. పజాస్వామ్యానికి అంబాసిడర్‌గా చెప్పుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిర్బంధాన్ని ఏమంటారు అని వారు ప్రశించారు. శాంతియుతమైన పద్ధతుల్లో నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల పైన కేసులు పెట్టి, జైలుకి తరలించిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి నాయకులు ర్యాలీగా తార్నాక వైపు దూసుకువెళ్లేందుకు యత్నించడంతో వారిని పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయినవారిలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, అన్వర్, హైదరాబాద్ అధ్యక్షుడు చైతన్య యాదవ్, ఓయూ కార్యదర్శి సత్య, నాయకులు హరీష్, అరుణ్, వెంకటేష్, ఆకాష్ తదితరులు ఉన్నారు.

## 'సన్నాలు' పంపిణీ కార్యక్రమాన్ని
# సమర్థవంతంగా అమలుచేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లను ఆదేశించారు. ఉగాది పండుగ రోజున ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిచే ప్రారంభమైన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించేందుకు మంత్రులు, స్థానిక ఎంఎల్‌ఎలతో చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, అందుకు తగిన విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఇప్పటికే యాభై శాతానికి పైగా సన్నబియ్యం చౌక ధరల (రేషన్ షాప్) దుకాణాలకు వచ్చాయని, మిగిలిన వాటికి సైతం రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు. బియ్యం నాణ్యత, పరిమాణానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్లకు సిఎస్ సూచించారు.

**SIDDHU COLLEGE OF EDUCATION**
Recognized by NCTE & Affiliated to MGU
Near Srinivasa Theatre, Huzurnagar - 508204, Suryapet (Dist).

WANTED FACULTY

| Post | Qualifications |
|---|---|
| Principal | Ph.D with 8 Years teaching experience in Teacher training Institutions |
| **Lectures:** | |
| 1. MPA | MPA with 55% Marks |
| 2. Life Sciences | M.sc, M.Ed with 55% marks and NET/SLET is compulsary |
| 3. English | M.A, M.Ed with 55% marks and NET/SLET is compulsary |

Qualified Candidates may send their resumes by post on or before 09-04-2025
**Note:** Selection through University Selection Committee.

Sd/- Secretary / Correspondant
Cell:9246778803



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## వాణిజ్య సిలిండర్ ధర తగ్గింపు

**న్యూఢిల్లీ :** హోటళ్లు, రెస్టారంట్లు సహా వాణిజ్య అవసరాల కోసం వాడే వాణిజ్య సిలిండర్ గ్యాస్ ధరను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తగ్గించాయి. రూ.41 తగ్గించినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. నేటి నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నాయి. అయితే, రాష్ట్రాలను బట్టి ఈ తగ్గింపులో మార్పు ఉంటుంది. తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.1,762, ముంబయిలో రూ.1,714.50, చెన్నైలో రూ.1,924.50గా ఉంది. ఇక, గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పిజి సిలిండర్ ధరలను చమురు సంస్థలు సవరించలేదు.

**ఎటిఎఫ్ ధర తగ్గింపు**

విమాన ఇంధన (ఎటిఎఫ్) ధరల్ని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 6.1 శాతం మేర తగ్గించాయి. తాజా తగ్గింపుతో దిల్లీలో ఒక్కో కిలో లీటర్ ధర రూ.5,870.54 తగ్గి రూ.89,441.18కు చేరింది. ముంబయిలో కిలో లీటర్ ఎటిఎఫ్ ధర రూ.83,575.42, చెన్నైలో రూ.92,503.80, కోల్కతాలో రూ. 91,921 ఉంది.



## జార్ఖండ్‌లో రైలు ప్రమాదం..

### మంటల్లో లోకో పైలెట్లు సహా ముగ్గురు మృతి..!

**సాహిబ్‌గంజ్ :** జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రెండు గూడ్స్ రైళ్లు ఢీకొట్టుకున్నాయి. ఆ తర్వాత మంటలు చెలరేగి రెండు ఇంజిన్లకు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో లోకో పైలెట్లు సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచా రం. ఈ ఘటనలో ముగ్గురు సిఐఎస్ఎఫ్ జవా న్లు సైతం గాయపడ్డట్లు తెలుస్తున్నది. ఈ ఘట న తెల్లవారు జామున 3.30 గంటలకు జరిగినట్లు తెలుస్తున్నది. ఫరక్కా నుంచి లాల్మాటియాకు వెళ్తున్న గూడ్స్ రైలు బర్హైట్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టినట్లు సమాచారం. ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో.. కష్టపడి మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉన్నది. ఆదివారం ఒడిశాలో రైలు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. కామా ఖ్య ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. కటక్‌లోని నెర్గుండి రైల్వేస్టేషన్ సమీయంలో ప్రమాదం జరిగింది. బెంగళూరు నుంచి రైలు నంబర్ 12251 అసోంలోని కామాఖ్య స్టేషన్‌కు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా.. ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.

## అత్యాచారం కేసులో మతబోధకుడికి జీవితఖైదు



**చండీగఢ్:** యువతిపై అత్యాచారం కేసులో ప్రముఖ మతబోధకుడు బాజిందర్ సింగ్‌కు పంజాబ్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధి స్తూ తీర్పునిచ్చింది. పంజాబ్‌కు చెందిన బా జిందర్ సింగ్... 2018లో ఓ యువతిపై లైం గిక వేధింపులకు పాల్పడినందుకు గాను మొహా లీ కోర్టు ఇటీవల అతడిని దోషిగా తేల్చింది. తాజాగా శిక్ష ఖరారు చేసింది. ఈ కేసులో బాజిందర్ సింగ్‌కు కోర్టు యావజ్జీవ జైలుశిక్ష విధించగా... నిందితులుగా ఉన్న మరో ఐదుగురిని నిర్దోషులుగా తేల్చింది. బాజిందర్ సింగ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని జిరాక్‌పుర్‌కు చెందిన ఓ మహిళ 2018లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. విదేశాలకు తీసుకెళ్తానని ఆశపెట్టి అతడు తనను ఇంటికి ఆహ్వానించాడని బాధితురాలు తెలిపింది. అక్కడ తనపై లైంగిక దాడికి పాల్పడి... ఆ దృశ్యాలను రికార్డ్ చేశాడని ఆరోపించింది. అతడి డిమాండ్లకు అంగీకరించకపోతే ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించినట్లు తెలిపింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఇటీవల ఢిల్లీ విమానాశ్రయంలో అతడిని అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరిపిన కోర్టు.. అతడిని దోషిగా తేల్చి జీవితఖైదు విధించింది. హర్యానాకు చెందిన బాజిందర్ సింగ్ ఓ జాట్ కుటుంబంలో జన్మించాడు. 2012లో మత బోధకుడిగా మారాడు. అయితే, ఇతడిపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమార్తెకు నయం చేస్తానని డబ్బులు తీసుకున్నట్లు దిల్లీకి చెందిన దంపతులు 2022లో కేసు పెట్టారు. 2023లో సింగ్‌పై ఆదాయపు పన్నుశాఖ సోదాలు కూడా చేసింది.

## మణిపూర్‌లో పిఎం కిసాన్ పథకంలో అక్రమాలు

**న్యూఢిల్లీ :** మణిపూర్‌లో పిఎంకిసాన్ పథకం అమలులో 'అవకతవకలు' జరిగాయని ఆడిట్ నివేదికలో వెల్లడయిందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని కేం ద్ర ప్రభుత్వం మంగళవారం తెలిపింది. అర్హత లేని రైతులకు బదిలీ చేయబడిన ఏదైనా మొత్తా న్ని తిరిగి పొందడం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించినట్లు కేంద్ర వ్యవసా యం, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ అన్నారు. 'మణిపూర్ ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ప్రకారం, అకౌంటెంట్ జనరల్ (ఎజీ) ఆడిట్ నివేదికలో కొన్ని అవకతవకలు నివేదించబడ్డాయి. తదనుగుణంగా, రాష్ట్రం ఈ విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది' అని మంత్రి లోక్‌సభకు తన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. కాగా, కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి 19 వాయిదాల ద్వారా రూ.3.68 లక్షల కోట్లకు పైగా పంపిణీ చేసిందని మంత్రి చెప్పారు. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు అనర్హులైన లబ్ధిదారుల నుంచి రూ.416 కోట్లు వసూలు చేసినట్లు ఆయన వివరించారు.

# బంగ్లా కుయుక్తులతో.. ఈశాన్య రాష్ట్రాలకు ముప్పు

● యూనస్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆందోళన ● కేంద్ర విదేశాంగ విధానం దయనీయమని మండిపాటు

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌తో భూపరివేష్టితమైన భారత ఈశాన్య రాష్ట్రాలకు సముద్రానికి చేరుకోవడానికి మార్గం లేదని, ఆ ప్రాంతానికి తామే రక్షకులమంటూ బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ చేసిన వ్యాఖ్యలపై భారత్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. చైనా పర్యటనలో యూనస్ చేసిన ఈ వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకర వ్యాఖ్యలని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా ఆందోళన వ్యక్తంచేశారు. ''బంగ్లాదేశ్ అనుసరిస్తోన్న విధానం మన ఈశాన్య ప్రాంతానికి తీవ్ర ముప్పుగా కనిపిస్తోంది. మన ప్రభుత్వం మణిపూర్‌ను పట్టించుకోవడం లేదు. అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులో చైనా ఒక గ్రామాన్ని నిర్మించింది. తమ దేశ (బంగ్లాదేశ్) నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మనల్నే చుట్టుముట్టాలని బంగ్లా ప్రయత్నిస్తోంది. అలాంటి పరిస్థితుల్లో మన విదేశాంగ విధానం దయనీయంగా కనిపిస్తోంది'' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక బంగ్లాలో హైకమిషనర్‌గా పని చేసిన వీణా సిక్రీ... యూనస్ వ్యాఖ్యలను ఖండించారు. ''అవి దిగ్భ్రాంతికరం. ఆ విధంగా మాట్లాడటానికి యూనస్‌కు ఏమాత్రం హక్కులేదు. ఈశాన్య ప్రాంతం భారతదేశంలో అంతర్భాగమని ఆయనకు తెలుసు. ఈశాన్య భారతం ద్వారా బంగాళాఖాతంలోకి ప్రవేశించడంపై బంగ్లాతో అధికారిక ఒప్పందాలు ఉన్నాయి'' అని స్పష్టంచేశారు.



**యూనస్ వ్యాఖ్యలను అసోం సిఎం ఖండన**

యూనస్ వ్యాఖ్యల్ని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా ఖండించారు. భారత వ్యూహాత్మక కారిడార్ చికెన్స్ నెక్ కారిడార్ తో ముడిపడి ఉన్న అంశాలు.. ఆయన వ్యాఖ్యలకు కారణమన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం సిలిగురి భూభాగంలో ఇది ఉంది. '7 సిస్టర్స్'గా పిలిచే 7 ఈశాన్య రాష్ట్రాల (అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపుర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, త్రిపుర) ను భారత ప్రధాన భూభాగంతో ఈ కారిడార్ కలుపుతోంది. దీని చుట్టూ నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ విస్తరించి ఉన్నాయి. గతంలోనూ ప్రధాన భూభాగాన్ని, ఈశాన్య ప్రాంతాన్ని విడదీసేలా స్వదేశంలోనే వ్యతిరేక శక్తులు ప్రయత్నించాయన్నారు. అందుకే ఆ కారిడార్ అంతటా సమర్థవంతమైన రైల్వే, రోడ్డు నెట్‌వర్క్ అభివద్ధి చేయడం అత్యావశ్యకమని తెలిపారు. ఇంకా.. చికెన్ నెక్‌ను బైపాస్ చేసేలా రెండు భూభాగాలను అనుసంధానించే ప్రత్యామ్నాయ రహదారి మార్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అయితే అందుకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని, సంకల్పం, ఆవిష్కరణలతో ఆ దిశగా విజయం సాధించవచ్చునన్నారు. యూనస్ చేసిన ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను తేలిగ్గా తీసుకోరాదని... అవి వారి దీర్ఘకాలిక వ్యూహాలను ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు.

పశ్చిమ బెంగాల్‌లో ఉన్న ఈ ప్రాంతంలో కొంతభాగం కేవలం 22 కిలోమీటర్ల వెడల్పు ఉంది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లకు అతి దగ్గర్లో ఉంది. చైనా ఆధీనంలోని చుంబీ లోయ దీనికి అత్యంత సమీపంలో ఉంది. ఈ ప్రదేశంపై దాడి చేసి భారత్ నుంచి ఈశాన్య రాష్ట్రాలను వేరు చేసే ప్రమాదం ఉందని భారత సైనిక వ్యూహకర్తలు కొన్ని దశాబ్దాలుగా ఆందోళన చెందుతున్నారు.

# యుపి ప్రభుత్వ తీరు దిగ్భ్రాంతికరం

● ఇళ్ల కూల్చివేతలపై ఆగ్రహం
● బాధితులకు ఆశ్రయం పొందే హక్కు కూడా లేదా? అని నిలదీత

**న్యూఢిల్లీ :** ఇళ్ల కూల్చివేతల అంశమై ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆ తీరు దిగ్భ్రాంతికరమని వ్యాఖ్యానించింది. బాధితులకు ఆశ్రయం పొందే హక్కు కూడా లేదా..? అని ప్రశ్నించింది అధికారులు కూల్చేసిన వేసిన ఇంటి బయట ఒక చిన్నారి ఏడుస్తూ ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం గురించి న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఇటువంటి దృశ్యాలు చూసి ప్రజల హృదయాలు కలత చెందుతున్నాయన్నారు. కూల్చివేతలు పూర్తిగా అమానవీయం. చట్టవిరుద్ధం. దేశంలో రూల్ ఆఫ్ లా ఒకటి ఉంది. ఈ తరహాలో నివాస భవనాల కూల్చివేత ఒక ఫ్యాషన్ కాకూడదు. బాధితులకు ఆరువారాల్లో రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలి అని ప్రయాగ్‌రాజ్ అభివృద్ధి సంస్థను ఆదేశించింది. ప్రయాగ్‌రాజ్‌లో చట్టప్రక్రియను పాటించకుండా కూల్చివేతలు చేపట్టడాన్ని గతంలోనూ సుప్రీం తీవ్రంగా స్పందించింది. ఇది తప్పుడు సంకేతాలను పంపుతోందని అసహనం వ్యక్తంచేసింది. 2023లో పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్‌కు చెందిన భూమిగా భావించి, అందులోని నివాసాలను రాష్ట్ర ప్రభుత్వం తప్పుగా కూల్చివేసిందని బాధితులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. వారిలో ఒక న్యాయవాది, ఒక ప్రొఫెసర్‌తో పాటు మరికొందరు ఆ బాధితులు ఉన్నారు. అయితే కూల్చివేతలకు సంబంధించి వారు వేసిన పిటిషన్లను గతంలో అలహాబాద్ హైకోర్టు తోసిపుచ్చింది. దాంతో వారు సుప్రీంను ఆశ్రయించారు.

## నకిలీ ఓటరు ఐడిలపై చర్చకు భయమెందుకు?

### మోదీ సర్కార్‌పై టిఎంసి ఆగ్రహం



**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ ప్రభుత్వం నకిలీ ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డు అంశంపై చర్చించేందుకు ఎందుకు వెనకాడుతోందని తణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) మంగళవారం ప్రశ్నించింది. బడ్జెట్ సమావేశాలు ముగియడానికి రెండు రోజులు మిగిలి ఉండగా, ఈ అంశంపై చర్చకు నిరాకరించడాన్ని నిరసిస్తూ టిఎంసి సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. 'నకిలీ గుర్తింపు కార్డు అంశంపై చర్చ కోసం మేము నోటీసు ఇచ్చాం. ఇంకా ఎటువంటి తీర్పు వెలువడలేదు. ప్రతిరోజూ మా పార్టీ, ఇతర ప్రతిపక్ష పార్టీల నుంచి అనేక మంది సభ్యు లు చర్చకు నోటీసు జారీ చేస్తున్నారు. కానీ అధికార పక్షం నిరాకరిస్తూనే ఉంది' అని తృణమూల్ రాజ్యసభ ఎంపి డోలా సేన్ అన్నారు. 'చర్చ జరుగుతుందని రాజ్యసభలో అంగీకరించినప్పటికీ, వారు దానిని అనుమతిస్తారని ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి సూచన లేదు' అని తెలిపారు. రాజ్యసభలో తృణమూల్ ఉప నాయకురాలు సాగరికా ఘోష్ మాట్లాడుతూ ఈ అంశం ఎన్నికల సంస్కరణలు, ప్రజాస్వామ్యానికి కేంద్రమని అ న్నారు. అందుకే మేము చర్చ కోసం డిమాండ్ చేస్తున్నాం' అని తెలిపారు.

## గాంధీ మునిమనవడి పిటిషన్‌ను 'సుప్రీం' తిరస్కృతి

సబర్మతీ ఆశ్రమ్ పునారాభివృద్ధికి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేసిన తుషార్‌గాంధీ



**న్యూఢిల్లీ :** సబర్మతీ ఆశ్రమ్ పునరాభివృద్ధి ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా జాతిపిత మహాత్మాగాంధీ మునిమనవడు తుషార్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్ట్ మంగళవారం తిరస్కరించింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం.సుంద్రేష్, రాజేష్ బిందాల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పిటిషన్‌ను దాఖలు చేయడంలో రెండు సంవత్సరాలకు పైగా ఆలస్యం కావడాన్ని గుర్తించి ఈ పిటిషన్‌లో జోక్యం చేసుకోవడదానికి అయిష్టత చూపించింది. గుజరాత్ హైకోర్ట్‌కు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలుచేసిన తుషార్‌గాంధీ ప్రతిపాదిత ప్రాజెక్ట్ స్థలాకృతిని మారుస్తుందని పేర్కొన్నారు.'ప్రాజెక్ట్ ఉద్దేశపూర్వకంగా ప్రబలంగా ఉన్నటువంటి 40 సారూప్య భవనాలను గుర్తించింది. మిగిలిన భవనాలు 200 కూల్చివేయడం లేదా పునర్నిర్మించబడతాయి' అని ఆ పిటిషన్‌లో తెలిపారు. ఆశ్రమం ప్రధాన ప్రాంతం దెబ్బతినదని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని పరిగణనలోనికి తీసుకుని ఉత్తర్వును సవాల్ చేయజాలలేరని సుప్రీంకోర్టు చెప్పింది. గుజరాత్ ప్రభుత్వం తరపున న్యాయవాది కమల్ త్రివేదీ ప్రాతినిథ్యం వహించారు. ప్రధాన ఆశ్రమం 5 ఎకరాల పరిధిలో విస్తరించి ఉందని, దానిని పునరాభివృద్ధి సమయంలో ముట్టుకోబోమని హైకోర్టుకు తెలిపినట్లు చెప్పారు. నేషనల్ గాంధీ స్మారక్ నిధి (ఎన్‌జిఎస్ఎన్) ఆధ్వర్యంలో పునరాభివృద్ధి జరిగేలా ఆదేశించాలని కోరుతూ తుషార్‌గాంధీ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. సబర్మతీ ఆశ్రమ్ గాంధీ ఆశ్రమంగా పేరొందింది. 1917లో మహాత్మాగాంధీ సబర్మతీ ఆశ్రమాన్ని నెలకొల్పారు.

## భారత్-చైనా దౌత్యసంబంధాల వజ్రోత్సవ వేడుక



**బీజింగ్ :** భారత్-చైనా దేశాలమధ్య దౌత్య సంబంధాలు ప్రారంభమై 75 సంవత్సరాలు గడచిన సందర్భంగా రెండు దేశాల నాయకులు మంగళవారంనాడు పరస్పర శుభాంకాక్షలు తెలియజేసుకున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా జిన్‌పింగ్ భారత రాష్ట్రపతి ద్రౌపదీముర్ముతో సంభాషించారు. రెండు దేశాలూ మరింత సన్నిహితంగా పనిచేస్తూ సంబంధాలను వృద్ధి చేసుకోవాలని జిన్‌పింగ్ ఆకాంక్షించారు. డ్రాగన్-ఎలిఫెంట్ జాతీయ చిహ్నాల సమైక్యత పరస్పర భాగస్వామ్య విజయాలకు చిహ్నాలని అన్నారు. భారత్-చైనా రెండు దేశాలూ అత్యంత పురాతనమైన నాగరికతగల దేశాలు, ఆసియాలో అభివృద్ధి చెరందుతున్న ప్రధానదేశాలు, గ్లోబల్ సౌత్‌లో అతికీలకమైన దేశాలు, రెండు దేశాలలో ఆధునీకరణదిశగా ముందుకువెళ్ళే కృషి అత్యంత కీలకదశలో ఉంది, రెండు దేశాల సంబంధాల అభివృదిద్ధి మౌలిక ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి దోహదం చేస్తాయన్నారు.

అదేవిధంగా చైనా ప్రధానమంత్రి లీ క్వియాంగ్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ మాట్లాడుతూ,చరిత్రగమనంలో రెండుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు మన భాగస్వామ్యకృషిని, పరస్పర విజయాలను సహకార విస్తృతిని చాటి చెబుతాయన్నారు. రెండు దేశాల నాయకుల వ్యూహాత్మక భాగస్వామ్యంలో భారత్‌తో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందన్నారు. దీర్ఘకాలిక దృక్పథంతో ద్వైపాక్షిక సంబంధాలను నిర్వహించడానికి తమ దేశం సంసిద్ధంగా ఉందని అన్నారు. గత ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా రష్యాలోని కజాన్‌లో భారత్-చైనా నాయకులు మోదీ,జిన్‌పింగ్ సమావేశాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ ఇద్దరి నాయకులూ రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను అభివృద్ధి చేయడానికి వ్యూహాత్మక మార్గదర్శకత్వాన్ని సమకూర్చారని గువో జియాకున్ గుర్తుచేశారు. ఈ ఇద్దరి నాయకుల ఏకాభిప్రాయాలను అమలు చేసేందుకు రెండు దేశాలు కట్టుబడి సహకారాన్ని ప్రోత్సహిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నాయని అన్నారు. రెండు దేశాలు పరస్పరం లోతైన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నాయని, శాంతిని ఉమ్మడిగా ముందుకు తీసుకువెళుతున్నాయని పేర్కొన్నారు.

## సంభాల్ మసీదు వైట్‌వాషింగ్ వ్యతిరేక పిటిషన్ విచారణకు.. 'సుప్రీం' నిరాకరణ



**న్యూఢిల్లీ :** ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం సంభాల్ జిల్లా లో మొఘలుల కాలంనాటి జమామసీదుకు సు న్నం వేయాలని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాను (ఎఎస్ఐ) కోరుతూ అలహాబాద్ హైకో ర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. మార్చి 12న హైకోర్టు జమామసీదుకు వారం రోజుల వ్యవధిలోపు సున్నం వేయడం పూర్తి చేయాలని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాను కోరింది. ప్రస్తుత పిటిషన్‌ను ఎంటర్‌టైన్ చేయడానికి మేం ఇష్టపడటం లేదు. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషన్‌దారు సతీష్‌కుమార్ అగర్వాల్ తరపున హాజరైన న్యాయవాది బరుణ్‌సిన్హా హైకోర్టు ఆదేశాలను వ్యతిరేకించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ తన ఉత్తర్వులో 'మసీదు గోడలకు ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా సున్నాలను మంగళవారం నుంచి వారం రోజులలోపు వేయించడం పూర్తి చేసేందుకు సమయాత్త ం అవుతోంది. ఎలాంటి అదనపు లైటింగ్‌ను గోడలకు పెట్టకూడదు. ఆరోపిత మసీదు ప్రాంతంలో ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ఉపయోగించనున్న ఫోకస్ లైట్లు/ ఎల్ఇడి రూపంలో ఏర్పాటుచేయనున్న బయటి లైట్లు స్మారకాలకు నష్ట ం కలిగించవచ్చు. కాబట్టి మసీదు వెలుపలి ప్రాంతంలో లైటింగ్‌ను ఉపయోగించవచ్చు' అని తెలిపింది. 'మసీదు కమిటీ వైట్‌వాషింగ్ కోసం చేసిన ఖర్చు పూర్తి అయిన వారం రోజుల తర్వాత వెచ్చించిన ఖర్చు తిరిగి చెల్లించబడుతుంది' అని ఆయన చెప్పారు. హైకోర్టు ఇంతకుముందు ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా తరపున హాజరైన న్యాయవాదిని మసీదు బయటి గోడలకు సున్నం వేయడం వల్ల ఎలాంటి దురభిప్రాయాలు కలుగుతాయో నిర్దిష్టమైన వాదనలతో తిరిగి రావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. దీనికి ముందు కోర్టు ఆదేశం మేరకు ఒక సర్వే నిర్వహించగా అది గత ఏడాది సంభాల్‌లో హింసకు దారితీసింది.

## నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు పరిమితం

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య తరచూ ఎదురు కాల్పుల ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనల్లో పలువురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతుండగా..మరికొందరు ప్రభుత్వానికి లొంగిపోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు పరిమితమైనట్లు పేర్కొన్నారు. దీంతో మనం మరో మైలు రాయిని చేరుకున్నామన్నారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారని.. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. వచ్చే ఏడాది మార్చినాటికి నక్సలిజాన్ని పూర్తిగా పెకిలించివేస్తామని పునరుద్ఘాటించారు. హోంమంత్రిత్వ శాఖ రూపొందించిన నివేదికల ప్రకారం.. దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 ఉన్నాయి. నివేదికల ప్రకారం..2015లో ఇవి 35 ఉండగా.. 2018 నాటికి 30కి తగ్గాయి. 2021నాటికి 25కు వచ్చాయి. తాజాగా భద్రతా దళాలు చేపడుతున్న వరుస దాడుల వల్ల ఇవి 6కు చేరాయి. బస్తర్ ప్రాంతంలో సోమవారం భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందింది. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాది ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో 135 మంది మావోయిస్టులు భద్రతా సిబ్బంది కా ల్పుల్లో చనిపోయారు. ఇందులో 119 మంది ఒక్క బస్తర్ డివిజన్‌లోనే మరణించినట్లు అధికారులు తెలిపారు. గత శనివారం సుక్మా, బీజాపూర్‌లో జరిగి న రెండు ఘటనల్లో 18 మంది మావోయిస్టులు మృతి చెందారు. మరో వైపు సోమవారం 50మంది మావోయిస్టులు తాము లొంగిపోతున్నట్లు ప్రకటించారు.

## 1991 చట్టం చెల్లుబాటుపై.. తాజా పిటిషన్ విచారణకు 'సుప్రీం' నో

**న్యూఢిల్లీ :** ఆగష్టు 15, 1947 ఒక ప్రదేశంలో మతపరమైన స్వభావాన్ని తప్పనిసరిచేసే నిబంధన ఆరాధన స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం 1991 చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన తాజా పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. అత్యున్నత న్యాయస్థానం వద్ద 1991 చట్టంలోని వివిధ నిబంధనలను సవాల్ చేస్తూ ప్రస్తుతం న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ పిటిషన్ సహా ఇప్పటికే ఆరు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనానికి న్యాయవిద్యార్థి నితిన్ ఉపాధ్యాయ్ చేసుకున్న అభ్యర్థనలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పిటిషన్లలో తన పిటిషన్‌కూడా ఒకటని విన్నవించారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద తాజా ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించేందుకు తాము సుముఖంగా లేమని స్పష్టంచేశారు. అయితే న్యాయ విద్యార్థి పెండింగ్ పిటీషన్లలో జోక్యాన్ని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను మాత్రం ధర్మాసనం అనుమతించింది. 1991 చట్టం, 1947 ఆగష్టు15న ఉనికిలో ఉన్నటువంటి ఏదైనా మతపరమైన స్వభావాన్ని లేదా ఆరాధనను కొనసాగించడానికి వీలుకల్పించిన స్థలాన్ని మార్చడాన్ని నిషేదిస్తుంది. అయితే అయోధ్యలోని రామజన్మభూమి మసీదుకు సంబంధించి వివాదాన్ని దాని పరిధికి దూరంగా ఉంచారు. అయితే అసలు మతపరమైన ప్రార్థనా స్థలాన్ని నిర్ధారించేందుకు తగిన ఆదేశాలు జారీ చేయాలని ఉపాధ్యాయ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఇది తాజా కేసులతో పాటు మతపరమైన స్వభావాన్ని మార్చే ప్రక్రియను, చట్టంలోని సెక్షన్ 4(2)చట్టాన్ని సవాల్ చేసింది. ఈ పిటిషన్ అడ్వకేట్ శ్వేత సిన్హా ద్వారా దాఖలు చేయబడింది.'ఇది స్థలంనిర్మాణాత్మక మార్పు అనుమతించదగినది' అని పిటిషన్ పేర్కొంది.ఈ చట్టం ఎటువంటి శాస్త్రీయ లేదా నిర్దిష్ట మతపరమైన ప్రదేశాన్ని నిషేధించలేదు' అని పిటిషన్‌లో జోడించబడింది. అయితే 1991చట్టానికి సంబంధించి అధికసంఖ్యలో పిటిషన్లు దాఖలు కావడంపై సుప్రీంకోర్టు ఫిబ్రవరిలో అసంతృప్తి వ్యక్తం చేసింది.

## త్వరలో బిజెపికి నూతన అధ్యక్షుడు?

**న్యూఢిల్లీ:** బిజెపికి త్వరలోనే కొత్త అధ్యక్షుడు ఎన్నికకానున్నారు. ఈ ప్రక్రియ దాదాపు 10 నెలలుగా పెండింగ్‌లో ఉంది. పార్లమెంటు సమావేశాలు ముగిసిన వెంటనే అధ్యక్షుడిని ఎన్నుకోవాలని బిజెపి భావిస్తోంది. వాస్తవానికి మార్చి 15 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలి కానీ పార్లమెంటు సమావేశాల కారణంగా మరోమారు జాప్యం జరిగింది. ఇప్పటికే 13 రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు ముగించి... 13 మంది రాష్ట్ర అధ్యక్షులను పార్టీ ప్రకటించింది. ఉత్తరప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, బెంగాల్‌తో సహా మిగతా రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను మరో వారం రోజుల్లో ప్రకటించే అవకాశమున్నట్లు వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియ మొదలవుతుందని వెల్లడించాయి. బిజెపి జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవాలంటే 50 శాతం రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తి కావాలి. అంతకుముందు బూత్, మండలం, జిల్లా స్థాయి ఎన్నికలు జరగాలి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా 2019లో జెపి నడ్డా బాధ్యతలు చేపట్టారు. 2020 జనవరిలో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ నేత అమిత్ షా స్థానాన్ని భర్తీ చేశారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆయన పదవీ కాలం 2024 జూన్ వరకు పొడిగించారు. ఇప్పుడు ఆయన కేంద్ర మంత్రివర్గంలో ఉన్నారు. దీంతో జాతీయ అధ్యక్షుడిగా సమర్థుడిని ఎన్నుకోవాలని బిజెపి భావిస్తోంది. అయితే ఈ ప్రక్రియ అంత సులువేమీ కాదు. ఇందుకోసం కుల సమీకరణలు సరైన విధంగా జరిగాలి. డీలిమిటేషన్, భాషా వివాదం వేళ ఉత్తరాదికి, దక్షిణాదికి మధ్య విభజన దృష్ట్యా ఈ ప్రక్రియ మరింత జఠిలమైంది. కాగా, ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో ఏయే స్థానాలలో మెజారిటీని రాలేదో, ఆయా చోట్ల పట్టు సాధించే పనిలో బిజెపి ఉంది. దీంతో ఆ రాష్ట్రం నుంచి జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కాగా, బోర్డుతో పాటు ఆర్ఎస్ఎస్ ఆమోదిస్తేనే ఇలా ఎంపికయ్యే అభ్యర్థికి పదవి వరిస్తుంది.

## పాలనా వైఫల్యాలు కప్పిపుచ్చేందుకే పేర్ల మార్పు:మాయావతి



**లక్నో :** రాష్ట్రాలలోని బీజేపీ ప్రభుత్వాలు జిల్లాలు, నగరాలు, సంస్థల పేరు మార్చే ధోరణిని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి విమర్శించారు. ఇది పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చే లక్ష్యంతో 'సంకుచిత మనస్తత్వ రాజకీయాలకు' ఉదాహరణగా అభివర్ణించారు. ఉత్తర ప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం మాదిరిగానే మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు జిల్లాలు, నగరాలు, సంస్థల పేర్లను మారుస్తున్నాయి. ఇది చట్ట పాలన ద్వారా పాలన కాదు. ద్వేషం, వివక్ష ఆధారంగా వారి వైఫల్యాలను కప్పిపుచ్చడానికి చాలా ఆందోళన కలిగించే సంకుచిత మనస్తత్వం గల రాజకీయం' అని ఆమె 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 1995–2012 మధ్య నాలుగు బీఎస్పీ ప్రభుత్వాల కాలంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు ఆమె చెప్పారు. కొత్త జిల్లాలు, తహసీళ్లు, ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు కొత్త పేర్లతో స్థాపితమయ్యాయని, ఉన్న పేర్లు ఏవీ మార్చలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు ఈ విధానం నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలని ఆమె కోరారు. వివిధ రాష్ట్రాల్లోని వివిధ ప్రదేశాలు, సంస్థల పేర్లను మార్చడంపై కొనసాగుతున్న చర్చ మధ్య మాయావతి వ్యాఖ్యలు వచ్చాయి. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి సోమవారం హరిద్వార్, డెహ్రాడూన్, నైనిటాల్, ఉధమ్ సింగ్‌లోని 11 ప్రదేశాల పేర్లు మార్చనున్నట్లు ప్రకటించారు.

## సమాజ సేవలో యువత ముందుండాలి

**ప్రజాపక్షం/మునుగోడు:** సమాజ శ్రేయస్సు కొరకు యువత సమాజ సేవలో ముందుండాలని ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మండల కేంద్రంలో అస్వ సేన యూత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు వేసవి దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రానికి పని నిమిత్తం వచ్చే వివిధ గ్రామ ప్రజల దప్పిక తీర్చేందుకు అస్వ సేన యూత్ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, మాజీ ఎంపీపీలు పోలగొని సత్యం, కర్నాటి స్వామి యాదవ్, మాజీ జెడ్పిటిసి జాజుల



అంజయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ హర్షణీయం : సిపిఐ

**ప్రజాపక్షం/చందంపేట :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యాన్ని ప్రారంభించడం పట్ల చందంపేట మండల సిపిఐ కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిపిఐ మిత్ర పక్షంతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని పేదలకు సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించడం సంతోషకరమైన విషయం అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులను అందించడం జరుగుతుందని అన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గత బిఆర్ఎస్ పది సంవత్సరాల కాలంలో ఒక్క కొత్త రేషన్ కార్డును కూడా ఇవ్వలేదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతుందని ప్రతి ఒక్క పేదకు సంక్షేమ పథకాలు అందజేస్తూ ముందుకు సాగాలని ఆయన కోరారు.






## విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెడవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** పాలకులు దేశంలోని పౌరులకు విద్య, వైద్యం పూర్తి స్థాయిలో ఉచితంగా అందించినప్పుడే ప్రజలు అభివృద్ధి చెందుతారని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో శాఖ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 76 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో లక్షలాది మంది ప్రజలు సరైన విద్య, వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అత్యవసర సమయంలో సరైన వైద్యం అందక ఎంతోమంది పేదలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులకు కార్పొరేట్ సంస్థలపై ఉన్న ప్రేమ పేద ప్రజలపై లేదన్నారు. పార్టీ గ్రామశాఖల మహాసభను ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేసుకొని మేనెలలో మండల మహాసభలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభలో కార్యదర్శిగా కందుకూరి శ్రీను మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు దొడ్డ వెంకటయ్య, నాయకులు కీసర కొండలు, కందుకూరి వెంకటయ్య, శంబయ్య, అక్కి పుల్లయ్య, గుండు ఇస్తారు, నరసింహారావు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్టు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని చిన్నరావులపల్లి గ్రామానికి చెందిన ములకలపల్లి రమేష్ అంబర్‌పేట్‌కు చెందిన టేకుల మనీష్ కొండాపూర్ ఘట్కేసర్‌కు చెందిన కొందరి వ్యక్తుల దూల్పేటకు చెందిన సింగ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. రమేష్ మనీష్ అనే వ్యక్తి ఇద్దరు సునాయాసంగా డబ్బులు సంపాదించాలని ఆలోచనతో సింగ్‌తో ఏర్పడిన పరిచయంతో గంజాయిని తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లు తయారుచేసి చుట్టుపక్కల గ్రామాల్లో గంజాయి అలవాటు ఉన్న వ్యక్తులకు విక్రయిస్తుండగా ఈనెల 31న దూల్పేటకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి బీబీనగర్ వస్తుండగా సాయంత్రం 6 గంటలకు బీబీనగర్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండడంతో పల్సర్ బైక్ పై త్రిబుల్ రైడింగ్‌తో వెళ్తున్న వ్యక్తులను అనుమానాస్పందంగా కనిపించడంతో వాని విచారించగా వారి వద్ద నుండి 160 గ్రాముల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, ఒక బజాజ్ బైక్ పల్సర్ స్వాధీనం చేసుకున్నట్లు హౌస్ ఆఫీసర్ సిఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గంజాయి సరఫరా చేసి విక్రయిస్తే చట్టపరమైన నేరం కిందికి వస్తుందని ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపడమే ఉత్తమం అన్నారు. మండలంలో ఏ ప్రాంతంలోనైనా గంజాయి విక్రయించినట్లు సమాచారం వస్తే వెంటనే 100 నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సదర్ నేరస్థలను పట్టుబడి చేసిన వారిలో ఎస్సై రమేష్, ఎస్సై అమర్ సింగ్, కానిస్టేబుల్ రాము, పి.శ్రీనివాస్, జనార్ధన్లను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

## ఫిర్యాదుదారుడితో గౌరవంగా మెలగాలి



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు అకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డ్ లను , సిబ్బంది నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. వారు ఏఏ విధులు నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారునితో సిబ్బంది గౌరవంగా మెలగాలని, వచ్చిన ఫిర్యాదు పై తక్షణమే విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్సైకి సూచించారు. నిత్యం ప్రజలతో లైనింగ్ మెయింటేన్ చేస్తూ నేరాలకు సంబంధించిన ముందస్తు సమాచారం సేకరించాలన్నారు. సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీ బీట్ సిబ్బందిని పెంచి పట్టణంలో ఎలాంటి నేరాలు జరగకుండా నిఘా పెంచాలని, పగలు వేళల్లో తిరిగే బూల కోల్ట్స్ సిబ్బంది అలర్ట్‌గా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆయా కేసులలో పట్టుబడ్డ వాహనాలు కోర్టు అనుమతి తీసుకొని డిస్పోజల్ చెయ్యాలని ఎస్సై కళ్యాణ్ కుమార్ ను ఆదేశించారు. ఎస్పీ వెంట డి. ఎస్పీ వై. మొగిలయ్య, సిఐ టి. శ్రీను ఉన్నారు.

## గ్రామంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలంలోని రామచంద్రపురం గ్రామంలోని పలు సమస్యల పరిష్కారానికై ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సురుపంగ చందు రామచంద్రపురం గ్రామ ప్రజల తరపున భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో నూతన వాటర్ ఫిల్టర్, అసంపూర్తిగా ఉన్న బిసి కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయాలని, అవసరమున్న చోట సీసీ రోడ్లు మంజూరు చేయాలని, వ్యవసాయ బావుల వద్ద 2 నూతన 100కేవీ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసే విధంగా సంబధిత అధికారులతో చర్చించాలని కోరడం జరిగింది. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉగ్గి దుర్గా ప్రసాద్, కొండోజు రోహిత్ పాల్గొన్నారు.



# ప్రజాపాలనలో అందరికీ సన్నబియ్యం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రజాపాలనలో అందరికి ఆహార భద్రత సన్నబియ్యం పంపిణీ దేశంలోనే చారిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఫంక్షన్ హాల్లో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి వెంకట రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు నియజకవర్గం నుండి పెద్ద ఎత్తున్న మహిళలు,ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రభుత్వం రూ.2 వేల 858 కోట్లు ఖర్చు చేసి ప్రతి ఒక్క పేద కుటుంబానికి ప్రతి మనిషికి ఆరు కిలోల చొప్పున ప్రతి ఒకరికి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం వచ్చాక ఎన్నో బ్రిడ్జిలు నిర్మించి ఆలేరు నియోజకవర్గంలో 120 చెరువులు నింపి పంటలు సమృద్ధిగా పండించుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయని ఆలోచన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలు కడుపు నిండా అన్నం తినాలని సన్నబియ్యం పథకం రూపొందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మనగోటి జోజి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు బొమ్మగాని అంజమ్మ, తహశీల్దార్ శేషగిరిరావు, డీలర్ల మండల అధ్యక్షులు గంగేశ్వర్ పాల్గొన్నారు

### ప్రజలు కడుపు నిండా తినాలని : సామేల్

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** ప్రజలు సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం అడ్డగూడూరు మండలకేంద్రంలో రేషన్ షాప్ లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు.

### సన్న బియ్యం పథకం చరిత్రాత్మకం..!

### ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

**ప్రజాపక్షం/ హాలియా:** రాష్ట్రంలోని ప్రతి పేదవాడు సన్న బియ్యం తినేలా కాంగ్రెస్ సర్కార్ మహోత్తర పథకాన్ని అమలు చేయడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. హాలియా పట్టణ కేంద్రంలోని అంగడి బజార్ లోగల చౌక ధరల దుకాణంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడవల్లి నరేందర్ రెడ్డి, చింతల చంద్రారెడ్డి, కుందూరు రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### పేదల కడుపు నింపుతాం : కుంభం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** గ్రామీణ ప్రాంత పేద ప్రజల కడుపు నింపడానికి ప్రభుత్వం ఎంతైనా భరిస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం బీబీనగర్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం కార్యక్రమాన్ని షాపు నంబర్ ఒకటి షాప్ నెంబర్ 2 షాప్ నెంబర్ మూడులో గల లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అదేవిధంగా పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను కూడా పూర్తి చేస్తామని ఆయన ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, డిఎస్ఓ వనజ, తాసిల్దార్ భగత్, ఎంపీడీవో వై.శ్రీనివాస్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు రాజయ్యవైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, సింగల్ విండో డైరెక్టర్ సత్తయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురకండి సత్తిరెడ్డి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట:** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాట అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 48వ వార్డులోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి కడుపునిండ అన్నం పెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతీరుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, మాజీ డిసిసిబి డైరెక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చొక్కయ్య గౌడ్, సాజిద్ ఖాన్ పాల్గొన్నారు.






# సంక్షేమ బోర్డు పరిరక్షణే మన ధ్యేయం

### ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ:** భవన నిర్మాణ కార్మిక సంఘం దేవరకొండ మండల 6వ మహాసభ మండల కేంద్రంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో మంగళవారం జరిగింది. ఈ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎఐటియుసి జెండాను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ఎగురవేశారు. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ బోర్డు పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని, నిర్మాణ రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపైన రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మరిన్ని పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక చట్టాల హక్కులను కాలరాస్తూ పని గంటల విధానం పెంచుతూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరడానికి ఈ ప్రభుత్వం అనేక ఆంక్షలు పెడుతూ కాలయాపన చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ఒక కార్మికుడు తాను సంక్షేమ బోర్డులో చేరాలన్న గాని రెన్యువల్ చేసుకోవాలన్న గాని నెలల తరబడి ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉందని ఇలాంటి పరిస్థితుల నుండి బయట పడాలంటే పోరాటాలే శరణ్యం అని ఆయన పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా 10లక్షలు పెంచాలని, సహజ మరణాన్ని ఐదు లక్షల వరకు పెంచాలని, పెళ్లి కానుక 30 వేల నుండి 50వేలకు పెంచాలని, డెలివరీ కేసుని 50వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మహాసభకు గ్యార వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి, ఎఐటియుసి డివిజన్ కోశాధికారి వెంకట్రాములు, మండల కార్యదర్శి మల్లయ్య, సైదులు, లక్ష్మీ నారాయణ, యాద య్య, పవన్, మల్లయ్య, వెంకటయ్య, యాదయ్య, శ్రీను పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో వెయ్యి మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా వెయ్యి మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేసినట్లు డిఎస్ఓ రాజేశ్వర్ రావు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో శాసన సభ్యులు మందుల సామేల్, కోదాడ నియోజకవర్గంలో జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మెన్ వంగవీటి రామారావు, సూర్యాపేట నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 610రేషన్ షాపుల ఉండగా 585 షాపుల్లో 51వేల మందికి 6కిలోల చొప్పున వెయ్యి మెట్రిక్ టన్నుల సన్న బియ్యం తొలిరోజు పంపిణీ చేసినట్లు తెలిఇపారు. జిల్లాలోని 610రేషన్ దుకాణాల్లో నిత్యం లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



# గ్రామ పోలీస్ వ్యవస్థ బలోపేతం



### పెండింగ్ కేసుల్లో దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలి : జిల్లా ఎస్పి కె నర్సింహ్మ

**ప్రజాపక్షం/సూర్యాపేట:** గ్రామ పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయాలని జిల్లా ఎస్పి కె నర్సింహ అన్నారు. పెండింగ్‌లోని కేసుల్లో దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాయంలో పోలీస్ ప్రజా భరోసా నూతన కార్యక్రమాన్ని ప్రారంభించి నెలవారి పోలీస్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పోలీస్ అధికారి గ్రామాల్లోని సమస్యలను గుర్తించి ప్రతి బుధవారం గ్రామంలో ప్రజా భరోసా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రజలకు చట్టాలు, భద్రతపై అవగాహన కల్పించాలని, సమస్యలు సృష్టించే వ్యక్తులకు కౌన్సిలింగ్ చేసి నేరాలను అదుపు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పోలీస్ అధికారి ఫోన్ నెంబర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. స్థానిక సంస్థలకు వచ్చే నాటికి గ్రామాలు పోలీసుల అధీనంలో వచ్చి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలన్నారు. పోలీస్ శాఖకు శాంతిభద్రతల రక్షణ, పౌరుల భద్రత ముఖ్యమన్నారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ బాధితులలకు భరోసా కల్పించేలా ప్రణాళిక ప్రకారం పని చేసి నాణ్యమైన దర్యాప్తు చేయాలన్నారు. వర్గ విభేదాలకు సంబంధించి భవిష్యత్తులో ఏలాంటి అవాంచనీయమైన సంఘటనలు చోటు చేసుకోకుండా సమాచారం సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి నాగేశ్వర్ రావు, ఎఆర్ అదనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్పి మట్టయ్య, ఎఆర్ డిఎస్పి నరసింహచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సిఐలు చలమందరాజు, రామకృష్ణారెడ్డి, రఘువీర్ రెడ్డి, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణ, ఆర్ఐ నారాయణరాజు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

**పని చేసే సిబ్బందికి గుర్తింపు లభిస్తుంది**

అంకితభావంతో పని చేసే ప్రతి సిబ్బందికి సరైన సమయంలో గుర్తింపు లభిస్తుందని జిల్లా ఎస్పి కె నర్సింహ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 2023లో కోదాడల పట్టణంలో ఓ ఇంట్లో పేకాటరాయుళ్లను అరెస్టు చేసి 68వేలు సీజ్ చేసి కోర్టుకు కేసు పంపడం జరిగింది. ఈ కేసులో పని చేసిన పోలీసులకు 34వేలు రివార్డు ఇస్తూ కోర్టు ఉత్తర్వూలు ఇవ్వడంతో అప్పటి సిఐ రాము, ఎస రామాంజనేయులు, కానిస్టేబుల్ ఆంజనేయులు, సతీష్, వెంకటేశ్వర్లు, శ్రీనులకు రివార్డు నగదును అందజేశారు.

# కంకర పరిచారు...బిటి మరిచారు!

### నెలల తరబడి రోడ్లు పూర్తి చేయని వైనం...వాహన దారులు, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

### పూర్తి చేయకుంటే ధర్నాలు చేస్తాం.... రైతు సంఘం

**ప్రజాపక్షం/డిండి:** నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం డిండి మండలంలో ఎల్లారెడ్డి బావి నుండి శాంతి గూడెం జెడ్పి రోడ్డు కందుకూరు వరకు, రామంతాపూర్ గదరాల్‌తండా చెరుకుపల్లి వరకు, నెమలిపూర్ ఆకుతోటపల్లి నిజాం నగర్ వరకు, వావిలికోల్ బ్రహ్మణపల్లి చారగొండ వరకు రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారి ప్రజలు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. మండలంలోని బిటి రోడ్లు సాంక్షన్ కావడంతో సదరుకాంట్రాక్టర్ కంటితుడుపు చర్యగా రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించి కంకర పరిచారు. కంకర పరిచి కొన్ని నెలలు చదును చేయకుండా అలాగే వదిలేసారు. పక్క నుండి వాహనదారులకు వీలుగా ప్రత్యామ్నాయం చేయకుండా వదిలేసారు. ఇలాగ కొన్ని నెలలు వాహనదారులు కింద పడుతూ లేస్తూ కాలం రోడ్డు వేస్తారేమోనని కాలం వెళ్లబుచ్చారు కానీ వారు అనుకున్న బిటి రోడ్డు పూర్తి కాకుండా కేవలం కంకర తోనే అసంపూర్తిగా వదిలేయడంతో నెలల తరబడి ఎదురు చూసిన ఫలితం లేకుండా పోయి సంవత్సరం గడిచే పరిస్థిలులు ఎదురవుతున్నాయని ప్రజలు, వాహనదారులు అధికారుల పర్యవేక్షణ కాంట్రాక్టర్ తీరు పట్ల మండిపడుతున్నారు. మండలంలోని బిటి రోడ్లు ఎల్లారెడ్డి బావి నుండి శాంతి గూడెం జెడ్పిరోడ్డు కందుకూరు వరకు, రహమంతాపూర్ గదరాల్‌తండా చెరుకు పల్లి వరకు, నెమిలిపూర్ ఆకుతోటపల్లి నిజాం నగర్‌వరకు , వావిల్‌కోల్ బ్రహ్మణపల్లి చారగొండ వరకు బీటి రోడ్లు కొన్ని కంకర పోసి మరికొన్ని కేవలం సైడ్ల పొంటి మట్టిపోసి వదిలేసారని దీనివలన ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారుల స్పందించి కాంట్రాక్టర్‌పై వత్తిడి తీసుకువచ్చి విలైనంత త్వరగా పనులు పూర్తి చేసి బిటి రోడ్డు వేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్ అన్నారు. పనులు పూర్తి చేయకుంటే ఆర్ అండ్ బి కార్యాలయం వద్ద సంబంధిత గ్రామాల ప్రజలు,వాహనదారులతో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని మైనోద్దిన్ హెచ్చరించారు.



## రెడ్డి యూత్ కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/కొత్తపల్లి: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో రెడ్డి యూత్ సంఘ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కసూరి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా దామరపల్లి అనిల్ కుమార్ రెడ్డి, కార్య దర్శిగా కస్తూరి మధుకర్ రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దామెరపల్లి దామోదర్‌రెడ్డి, మాగం తిరుపతిరెడ్డి, చింతల మోహన్ రెడ్డి, దామిడి అంజిరెడ్డి, దామరపల్లి రాజిరెడ్డి, కస్తూరి జీవన్ రెడ్డి, దామరపల్లి రాజేందర్ తదితరులున్నారు.

## మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైనా స్త్రీ వైద్య సేవలు

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాపక్షం/మంథని : మంథని లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మరింత మెరుగ్గా స్త్రీ వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ బి.సోని, స్త్రీ వైద్య నిపుణురాలని కాంట్రాక్టు ప్రాతిపదికన రిక్రూట్ చేసుకున్నారు.ఆసుపత్రిలోని మహిళా రోగులకు ఇక నుంచి మరింత మెరుగ్గా వైద్య సేవలు అందించ బడుతాయని తెలిపారు.గర్భిణీ స్త్రీలకు అవసరమైన రోగులు ఈ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతుల నిరసన



ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామ శివారులోని చెరువు నుండి అక్రమంగా నీటిని గుర్తుతెలియని వ్యక్తులు వదలడంపై ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డకు చెందిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వేళలో ఇష్టరాజ్యంగా అనుమతి లేకుండా చెరువులోని నీళ్లను అక్రమంగా వదులుతున్న వారిని గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని రైతులు నిరసన ద్వారా కోరుతున్నారు. సాగునీరు ఇబ్బందులు ఉన్న సమయంలో చెరువులోని నీటిని పంటలకు వాడుకోవాలని అలా కాకుండా రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు నీటిని అక్రమంగా నీటిని వదలడం దారుణమని నిరసనద్వారా చెరువునీటిని అక్రమంగా వదులుతున్న వారినిగుర్తించి వారిపైచర్యలుతీసుకోవాలనిరైతులుకోరుతున్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే గంగుల



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ పట్టణంలోని కమాన్ ప్రాంతంలో గల విశ్వబ్రాహ్మణ అఫీషియల్, ప్రొఫెషనల్ (వోపా)ఆధ్వర్యంలో వారి కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నగర బిఆర్ఎస్ చల్లహరిశంకర్, వోపా సభ్యులతో కలిసి ప్రారంభించారు. వేసవిలో బాటసారులకు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన వోపా సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమం అనంతరం వోపా డైరీని, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. మాజీ కార్పొరేటర్లు దిండిగాల మహేష్, జంగిలి సాగర్, వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి, గౌరవ అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్, జిల్లా అధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గాలిపెల్లి శంకరయ్య, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, ఓపా సంఘం బాధ్యులు తదితరులున్నారు.

## అంజన్న స్వామిని దర్శించుకున్న ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి



ప్రజాపక్షం/సారంగపూర్: జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రేచపల్లి గ్రామంలో మంగళవారం హనుమాన్ ఆలయంలో ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డి అంజన్న స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మేడిపల్లి ఆనంద్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో ఉండగా వారి నివాసంలో కలిసి వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మంగళారపు గంగన్న తండ్రి భూమయ్య, అనారోగ్యంతో ఇటీవల మరణించిన వారి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హోండా రామచంద్రారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హరీష్, నాయకులు తిరుపతిరెడ్డి, ఆకుల రాజిరెడ్డి , ప్రసాద్‌గౌడ్, ఇబ్రహీం, రాజన్న, బేర మహేష్ తదితరులు ఉన్నారు.

## ఎఎస్ఐ రమణారెడ్డి పదవీ విరమణ




ప్రజాపక్షం/గంగాధర: గంగాధర పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్ఐ దాసరి రమణారెడ్డి మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా చొప్పదండి సిఐ ప్రకాష్ గౌడ్, గంగాధర ఎస్ఐ వంశీ కృష్ణలు గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. సుదీర్ఘ కాలం పాటు పోలీసు శాఖలో ఉత్తమమైన సేవలందించారని కొనియాడారు. విధి నిర్వహణలో పదవీ విరమణ అనివార్యమేనని, అనంతరం విశ్రాంత ఉద్యోగిగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎఎస్ఐ కిష్టయ్య, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, భగవాన్ రెడ్డి, చంద్రమౌళి, సిబ్బంది రమణారెడ్డిని ఘనంగా సన్మానించారు.

## ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు



ప్రజాపక్షం/వీర్నపల్లి:ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశం అని మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బాపుసింగ్‌తండా,భూక్యా తండా గ్రామాలలో మంగళవారం సన్న బియ్యం పథకాన్ని మండల అధ్యక్షులు భూత శ్రీనివాస్‌గౌడ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లెంకల లక్ష్మ ణ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకం నిరుపేదలకు ఒక వరంలా మారుతుందని, ఇది తెలంగాణ ప్రజలు గర్వించదగిన విషయం అని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పంపిణీ

### ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి



ప్రజాపక్షం/చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం గ్రామాల్లో పండుగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంతో పాటు సుందరగిరి, ఇందుర్తి, నవాబుపేట, తదితర గ్రామాల్లో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, చిగురుమామిడి తహసీల్దార్ ముద్దసాని రమేష్‌లు కొబ్బరికాయలు కొట్టి రిబ్బన్ కట్ చేసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ధనవంతులు తినే సన్నబియ్యాన్ని పేదవారు తినాలనే మహోన్నత లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు ప్రారంభించిందని తెలిపారు. పేదలకు సన్నబియ్యం అందించాలనే లక్ష్యంతో నిరంతరం పనిచేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరు సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్‌దారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని తహసీల్దార్ రమేష్ డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బొడిగె పరశురాములు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పూల లచ్చిరెడ్డి, చింతపూల నరేందర్ పటేల్, ఎనగందుల లక్ష్మ ణ్, వంగ కనకయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణు, సింగిల్ విండో డైరెక్టర్ కూతురు రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు శ్రీమూర్తి రమేష్, ప్రవీణ్, మాజీ ఉప సర్పంచు జీల సంపత్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు అందె సురేష్, మహమ్మద్ బాబు మియా, బండోజు రాజేందర్, పోటు మల్లారెడ్డి, జిల్లెల్ల రమేష్, గందె రాజయ్య, కక్కెర్ల వెంకటేశం గౌడ్, జీల శ్రీకాంత్ యాదవ్ తదితరులున్నారు.

## కరెంటు షాక్‌తో రైతు మృతి



ప్రజాపక్షం/గంగాధర: గంగాధర మండలంలోని కురిక్యాల గ్రామంలో మంగళవారం ఉదయం ఒగ్గరి ప్రశాంత్ అనే యువ రైతు కరెంటు షాక్‌తో మృతి చెందిన సంఘటన మంళవారం చోటు చేసుకుంది. కరెంటు కోతలతో పొలం ఎండిపోతుందని ప్రతి రోజులాగే మంగళవారం ఉదయం 4.30 గంటలకు పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లగా మోటారు ఆన్ చేసే క్రమంలో కరెంటు షాక్‌తో మరణించినట్లు స్థానికులు తెలిపారు. మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని జీవితం గడుపుతున్న ప్రశాంత్‌కు 12సంవత్సరాల లోపు ముగ్గురు పిల్లలున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో పాటు బిఆర్ఎస్ నాయకులు ఆస్పత్రి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు సరిగా లేకపోవడంతోనే రాత్రి, ఉదయం పొలాల కాడికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే యువ రైతు మరణించాడన్నారు. ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని, ప్రశాంత్ కుటుంబానికి రూ.15 లక్షల సాయమందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు, తాజా మాజీ సర్పంచ్ మేచినేని నవీన్ రావు ఉన్నారు. మృతుడి బార్య ఒగ్గరి ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్ఐ బి.వంశీకృష్ణ తెలిపారు.

# అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట పట్టణ పరిధిలోని పొన్నాల వై జంక్షన్ వద్ద ఉన్న గౌరి శంకర్ తరుణి వైన్స్‌లో 29/03/2025 నాడు రాత్రి సమయంలో దొంగతనం చేసిన నిందితుడు గుర్రం అఖిల్‌ను మార్చి 31నాడు సాయంత్రం 4 గంటలకు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సిద్దిపేట త్రీటౌన్ సిఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం పొన్నాల వై జంక్షన్ వద్ద గల తరుణి వైన్స్ సిబ్బంది రోజు మాదిరిగానే 29/03/2025 నాడు రాత్రి పది గంటలకు వైన్స్ మూసి వెళ్లినారని, తిరిగి మరుసటి రోజు 30/03/ 2025 నాడు ఉదయం 10గంటలకు వచ్చేసరికి గుర్తు తెలియని దొంగ పైకప్పు రేకులను విప్పి వైన్‌షాపులోకి ప్రవేశించి 30వేల రూపాయల నగదు,2 మెన్షన్‌హౌస్ ఫుల్‌బాటిల్స్ దొంగలించాడని ఫిర్యాదు రావడంతో సాంకేతిక పరిజ్ఞానంతో త్రీటౌన్ సిబ్బంది చంద్రయ్య, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, బాబు, సెంట్రల్ క్రైం ఇన్స్‌పెక్టర్ అంజయ్య, సిబ్బంది యాదగిరి, ప్రవీణ్, శివ, నగేష్‌లతో కలిసి ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుని కోసం వెతుకుతుండగా నిన్న మార్చి31 నాడు పొన్నా వై జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా వెళ్లి పట్టుకొని విచారించగా వైన్‌షాపులో దొంగతనం చేసినట్లు గుర్రం అఖిల్ అలియాస్ తాడిశెట్టి మణికంఠ ఒప్పుకున్నాడని తెలిపారు. నేరస్తుడి నుండి 30వేల రూపాయల నగదు,ఒక మద్యం బాటిల్, రెండు పానలు, తాడును స్వాధీన పరుచుకొని నిందితుడిని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండుకు పంపించామని తెలిపారు. నిందితుడి స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, శాలిపేటకు చెందినవాడని గతంలో హుండీ పోలీస్‌స్టేషన్,తాడేపల్లిపల్లి పోలీస్‌స్టేషన్ పరిదిలో దొంగతనాల కేసులలో జైలుకు,రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లివచ్చాడని,అక్కడినుండి సికింద్రాబాద్ వచ్చి పలు దుకాణాలలో దొంగ తనం చేసి వచ్చిన డబ్బులతో జల్సాలకు ఖర్చు చేశాడని తెలిపారు. సిఐ విద్యాసాగర్ షాపుల యాజమానులు మరియు గృహాల యాజమానులు సిసి కెమరాలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని, నేరస్తులను పట్టుకోవడంలో,వ్యక్తి గత భద్రతకు ఉపయోగపడుతాయని సూచించారు.

## ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న 'గంగుల'



### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: గతంలో మానేరు డ్యాం డెడ్ స్టోరేజ్‌కు వచ్చినప్పుడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో తాము ధర్నాలు చేస్తే మంత్రిగా ఉండి పట్టించుకోని గంగుల కమలాకర్ ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని సు డా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి దుయ్యబట్టా రు. స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చే సిన విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడు తూ ఇప్పుడున్న 5.7 టిఎంసిల నీటితో కలిపి ఈ నెల 15 తారీఖు వరకు 6.5 టిఎంసి వరకు నిల్వ ఉంటుందని తెలిపారు. మిడ్‌మానేరు నుంచి సరిపోయేంత నీటిని లోయర్ మానేరు డ్యాంకు తరలిస్తామని నరేందర్ రెడ్డి అన్నారు. జులై నెల వరకు కరీంనగర్ కార్పోరేషన్ త్రాగునీటికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గంగులకు అన్నీ తెలిసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకం తీసుకురావడాన్ని ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయన్నారు. గతంలో దొడ్డు బియ్యం రీసైక్లింగ్ చేసి బిఆర్ఎస్ నాయకులు కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. సమావేశంలో దన్నసింగ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జీడి రమేష్, దండి రవీందర్, కీర్తి కుమార్, అస్తాపురం రమేష్, జూపాక సుదర్శన్, ఉప్పరి అజయ్, సాయిరాం, మాసుంఖాన్, బషీర్, ఇమామ్, ఆంజనేయులు, యనమల మంజుల, హనీఫ్, మామిడి సత్యనారాయణ రెడ్డి, వాడి వెంకట్ రెడ్డి, ఇమ్రాన్ తదితరులున్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### టిడిపి పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్: పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అమలు చేయకపోవడంతో గత ఎన్నికల్లో ప్రజలు కెసిఆర్ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పి గద్దె దింపడం జరిగిందని , ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన అనేక హామీలు అమలు పరచకుండా ప్రజలను మభ్యపెడుతుందని, అందుకు తగిన ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తెలుగుదేశం పార్టీ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ వంచ శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. 6 గ్యారంటీల విషయంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని యువతను, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎల్ఆర్ఎస్‌ను పూర్తిగా రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు 25 శాతం రాయితీ ఇస్తామంటూ మోసం చేయడం సబబు కాదన్నారు. హెచ్‌సియు భూములు విక్రయించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ విప్ లక్ష్మ ణ్‌కుమార్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ జన్మదిన వేడుకలు యువజన కాంగ్రెస్ ఎస్‌సి బిసి సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు జీవన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ధర్మపురి శాసనసభ్యులు విప్ లక్ష్మ ణ్‌కుమార్ జన్మదిన పురస్కరించుకొని జిల్లా కార్యాలయంలో జన్మదిన కార్యక్రమాన్ని నిర్వహించిన యువజన కాంగ్రెస్ ఎస్‌సి బిసి సెల్ సభ్యులను అభినందించారు. లక్ష్మ ణ్‌కుమార్ వారి ప్రజా జీవితాన్ని ఎన్ఎస్‌యు ఐ కార్యకర్తగా ప్రారంభించారు. విద్యార్థి విభాగం నుండి యువజన కాంగ్రెస్ నాయకుడిగా ధర్మారం మండల సభ్యుడిగా ఆనాడు రామగుండం శాసనసభ నుండి మొట్టమొదటిగా పోటీ చేసి ఆశించిన ఫలితం పొందలేనప్పటికి ఏ మాత్రం నిరుత్సాహపడకుండా ఆలుపెరుగని పోరాటం చేశారని ఆయన పోరాట స్ఫూర్తిని జీవన్‌రెడ్డి అభినందించారు. రాబోయే భవిష్యత్ కాలంలో రాష్ట్రంలో మంచి గుర్తింపు పొంది రాష్ట్రంలో మంచి నాయకుడిగా ఎదగాలని ఆశించారు. ఏప్రిల్ 1 వ తేది రాష్ట్ర స్థాయిలో ఉగాది సందర్భంగా నిరుపేద వర్గాలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం, అదే రోజు లక్ష్మ ణ్‌కుమార్ జన్మదిన రోజు కావడంతో ఆరంభించడం సంతోషకరమన్నారు. మహిళ శక్తి ద్వారా ప్రతి మహిళకు వడ్డీలేని రుణాలను ప్రభుత్వం అందిస్తుందని, అర్హులైన లబ్ధిదారులకు రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు ఆరంభింప చేస్తుందని అన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు బండ శంకర్, బీర్పూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాష్ యాదవ్, మాజీ ఎంపీపీ రమేష్ బాబు, నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు స్వామిరెడ్డి, జిలాల్ల కాంగ్రెస్ అధ్యక్షులు గుండ మధు, రఘువీర్ గౌడ్, కార్మిక విభాగం అధ్యక్షులు బొల్లి శేఖర్, జగదీశ్వర్, నర్సన్న, విజయ్, ఫిషర్ సెల్ విభాగం అధ్యక్షులు తోపారపు రజనీకాంత్, కాంగ్రెస్ నాయకులు బడుగు రాజేంధర్, లైశెట్టి విజయ్, గిరిధర్, గోట నరేష్, రాజేష్, ప్రదీప్, అభి, శేఖర్, హరీష్, రాజేష్, వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం

### సిద్దిపేట నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : తెల్లరేషన్‌కార్డు కలిగి ఉన్న నిరుపేదలకు ప్రతి నెల సన్న బియ్యం కాంగ్రెస్ ప్రభుత్వం అందచేస్తుందని.. కాంగ్రెస్‌ది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని సిద్దిపేట నియోజక వర్గం కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో 10,14,34, 43 వార్డుల్లో రేషన్‌కార్డుదారులకు డిఎస్‌ఓ తనుజ రెవెన్యూ అధికారులతో కలసి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈసందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ ప్రతి నెల రేషన్‌కార్డు ఉన్న వ్యక్తులకు ఒక్కోక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం అందచేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆకలితో అలమటిస్తున్నవారికి అండంగా ఉండేందుకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు.నిరుపేదలకు సన్న బియ్యం అందించాలనే సంకల్పంతో సిఎం రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకున్నారన్నారు. గత పదేండ్ల కెసిఆర్ పాలనలో నిరుపేదలకు సన్న బియ్యం ఆలోచన లేకుండ పోయిందని విమర్శించారు.కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన ఒక్కోక్క హామీని ప్రాధాన్యత క్రమంలో నేరవేరుస్తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ప్రజలకు సమన్యాయం అందిచేందుకు ప్రణాళిక బద్ధంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికి త్వరలో కొత్త రేషన్‌కార్డులు అందచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముద్దం లక్ష్మి, ఆలకుంట మహేందర్, పూర్ణిమ ఎల్లం, బుచ్చిరెడ్డి,కలిమోద్దీన్, మార్క సతీష్, గయాసోద్దీన్,వహాబ్, అజ్మత్, మాలీక్, అరవింద్,రాకేశ్, రాజిరెడ్డి, రజని, రేషన్‌డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంగరి నాగరాజు, జిల్లా అధ్యక్షులు కూర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రజాపక్షం / ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన తొందుర్తి రాజేందర్(30) దుర్మరణం చెందాడని ధర్మపురి ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మృతుడు రాజేందర్ ధర్మపురి పట్టణంలోని వెంకటేశ్వర షాపులో సేల్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని, రోజులాగే విధులు పూర్తి చేసుకుని తన మోటార్‌సైకిల్ పై స్వగ్రామం తుమ్మెనాలకు వెళ్తుండగా వెనుకనుండి అతివేగంగా వచ్చిన బ్రిజా కార్ బైక్‌ను ఢీకొట్టడంతో రాజేందర్ తలకు బలమైన గాయాలు కాగా అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని భార్య గంగరాజు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

## మహిళలకు నూతన చట్టాలు రక్షణ

### సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : మహిళలకు పిల్లలకు నూతన చట్టాలు రక్షణగా నిలుస్తాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. కొత్త చట్టాలతో నేరస్తులకు మరింత కఠిన శిక్షలు అమలు చేయ టం జరుగుతుందన్నారు. మహిళల రక్షణ గురించి తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా షీటీమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలకు బాల,బాలికలకు విద్యార్థినీ, విద్యార్థులకు రక్షణగా నిలుస్తూ సేవలు అందించటం జరుగుతుందన్నారు. మంగళవారం సిపి అనురాధ మీడియాతో మాట్లాడుతూ ఏదైన సంఘటనపై ఫోన్ కాల్ వస్తే సత్వరమే సంఘటన స్థలానికి చేరుకుంటమన్నారు. గుర్తించిన హాట్స్పాట్ ప్రదేశాల్లో .సిసి కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నరు. పని చేయకపోతే వెం టనే సంబధిత పోలీస్ అధికారులకు రిపేర్ చేయాలని సూచించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే షీటీమ్స్ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. మహిళలు, బాలికలు విద్యార్థినీలు షీటీమ్స్ సేవలు వినియోగించుకోవాలని సూచించా రు. ఎల్లవేళల అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. మహిళలు అత్యవసర సమయాల్లో డయల్ 100కు కాల్‌చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఏవరైన వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 డయల్‌కు పోన్ చేయాలని సూచించారు.

## ఎల్‌ఒసి అందజేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండల కేంద్రంలోని కట్టెల నాగమణి అనారోగ్యం బాగలేక హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎల్‌ఓసీ దరఖాస్తు చేసుకోగా మంజూరైన లక్షా రూపాయల ఎల్‌ఓసీ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పద్మవెంకటేశ్, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

## ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. ఆయన సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే సవదానంగా వారి సమస్యలు విని పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్పష్టం చేశారు. అధికారం ఉన్న లేకున్నా సంగారెడ్డి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు.



## సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలకు మరింత లాభం

### జిల్లా కల్టెకర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్ రేషన్ దుకాణంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి నిరుపేదకు లాభం చేకూర్చే విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యంలో అత్యధిక విలువ గల పోషకాలు, విటమిన్లు ఉంటాయని, వీటి ద్వారా రక్తహీనత, జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. రేషన్ బియ్యాన్ని ప్రజలు ఎవరు దళారులకు అమ్మవద్దని తెలిపారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ సన్న బియ్యాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ తహసీల్దార్ రాజు, పౌరసరఫరాల శాఖ అధికారులు, డీలర్ అసోసియేషన్ సభ్యు లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** అర్హత గల ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే కోవా లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని హడ్కో కాలనీలో రేషన్ షాప్ నెంబర్ 6లో ఆసిఫాబాద్ తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేతో కలిసి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఒక్కో లబ్ధిదారుడికి 6 కిలోల చొప్పున ప్రభుత్వం నుండి సరఫరా చేసే సన్న బియ్యంను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ సాయన్న, డిటి పోచయ్య, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రేగుంట కేశవరావు, రేషన్ డీలర్ వరలక్ష్మి , లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో...



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ :** రాష్ట్రవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణం ఇందిరా మార్కెట్‌లో రేషన్ షాపులో ఎమ్మెల్సీ దండే విఠల్, జేసీ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల సంభాషణలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి దండే విఠల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని ప్రారంభించిందని, ప్రతి లబ్ధిదారుడికి ఆరు కిలోల సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు. పేదలకు మరింత సహాయం అందించేందుకు ఈ పథకం అవసరమైందన్నారు. అందరూ ఇంట్లో వండుకొని వినియోగించుకోవాలని, దళారులకు అమ్మకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఎంఆర్‌ఒ కిరణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు సీడమ గణపతి, షబ్బీర్, శరత్ ముదిరాజ్, రేషన్ షాపు డీలర్లు ఉమేష్ బంగ్, లడ్డు బాబు, తూడూరు విజయ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో భయపడేది లేదు

### సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రమేష్



**ప్రజాపక్షం/దస్తురాబాద్ :** రాష్ట్రంలో ప్రభుత్వ భూములు కాపాడేందుకే కమ్యునిస్టు పార్టీ(సిపిఐ) ఉన్నాయని అక్రమ అరెస్టులకు నిర్బంధాలకు భయపడేది లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ కార్యదర్శి భుక్య రమేష్ అన్నారు. మంగళవారం రోజు దస్తురాబాద్ పోలీస్ స్టేషన్‌లో అరెస్ట్ చేసి తరలించారు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయాన్నే ఇంటికి వచ్చి అరెస్టు చేసి తీసుకుపోవడం పట్ల ఉద్యమాలు ఆపలేరని అన్నారు.పోలీసుల నిర్బంధంతో పాలన సాగడం సాధ్యం కాదని యూనివర్సిటీ భూములు అమ్మకాలు ఆపేందుకు విద్యార్థులతో కలిసి ఉద్యమం ఇస్తామని,ఎంత కాలం అరెస్టు చేస్తారో చూస్తామని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు విద్యార్థుల ఉద్యమాలను అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను తాకట్టు పెడుతూ ఎక్కడా కూడా భూములు లేకుండా అడుగులు లేకుండా చేయడం పట్ల రేపు మనకే నష్టం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి భూముల అమ్మకాలను విరమించుకోవాలని కోరారు.

# అర్హత గల ప్రతి లబ్ధిదారుడికీ సన్న బియ్యం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/నస్పూర్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండలంలో 3217005, 3217012 నంబర్లు గల చౌక ధరల దుకాణాలలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు తో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదవారి కడుపు నిండా అన్నం పెట్టాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌక ధరల దుకాణాల నిర్వాహకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాజీవ్ యువ వికాసం**

నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అవకాశం కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఈ పథకం ద్వారా చేయూత అందించడం జరుగుతుందని, అర్హులైన వారు ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 50 వేల రూపాయల లోపు రుణం 100 శాతం మాఫీ, 1 లక్ష రూపాయల లోపు రుణం 90 శాతం రాయితీ, 1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, 2 లక్షల రూపాయల నుంచి 4 లక్షల రూపాయల వరకు 70 శాతం రాయితీ లభిస్తుందని, రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణాల ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి రోజు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. లే అవుట్ క్రమబద్ధీకరణలో భాగంగా ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లింపుదారులకు అవగాహన కల్పించి, సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**లబ్ధిదారులు సన్న బియ్యం తప్పకుండా తీసుకోవాలి**

**ప్రజాపక్షం/జైపూర్ :** ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న సన్న బియ్యాన్ని తప్పకుండా తీసుకోవాలని, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం అందించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జైపూర్ మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమైన పథకం అని, ప్రతి లబ్ధిదారుడికి ఈ పథకం ద్వారా సహాయం అందుతుందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా పేద ప్రజలకు ఆహారం మరియు పోషక విలువలను అందించే లక్ష్యంతో ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం జైపూర్ మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఎంపిడిఒ సత్యనారాయణ గౌడ్, ఎపిఒ బాలయ్య, మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం

### వ్యవసాయ సలహాదారు పోచారం, కార్పొరేషన్ చైర్మన్ కాసుల



**ప్రజాపక్షం/బాన్సువాడ :** రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. మంగళవారం బాన్సువాడ మండలంలోని కొల్లూరు గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ కల్పించడం జరుగుతుందని, బోనస్ ద్వారా రైతుల కుటుంబాలు సంతోషంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, డిఎస్‌వో మల్లికార్జున్, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు రెంజర్ల సాయిలు, గంగుల గంగారాం, నార్ల రవీందర్ గుప్తా, వెంకన్న గుప్తా, విఠల్ రెడ్డి, లింగమేశ్వర్, వెంకటేశ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**బాన్సువాడలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన పోచారం, కాసుల**

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సన్నబియ్యాన్ని అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం పాత బాన్సువాడలోని 26,27,28 కొల్లూరు గ్రామంలోని పదవ నెంబరు రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పథకాన్ని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, డిఎస్‌ఓ మల్లికార్జున్, సొసైటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, రెంజర్ల సాయిలు, గంగుల గంగారాం, నార్ల రవీందర్ గుప్తా, వెంకన్న గుప్తా, విఠల్ రెడ్డి, లింగమేశ్వర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీలో కేంద్రానిదే 90శాతం వాటా

### ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్



**ప్రజాపక్షం/బైంసా :** రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం శుభసూచకమని, అయితే ఈ నిధుల్లో 90 శాతం వాటా కేంద్రానిదేనని ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్ అన్నారు. మంగళవారం బైంసా పట్టణంలోని అనసూయ పవార్ నగర్, కాలనీలో ప్రభుత్వం చేపట్టే సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క రైతుకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. అదేవిధంగా కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్, లబ్దిదారులకు తులం బాంగారం పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ దారులకు 2000 రూపాయల నుంచి 4000కు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన వృద్ధులకు, బీడీ కార్మికులకు, వితంతువులకు తక్షణమే పింఛన్ అందేలా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయపకులపై ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కొసం అందరితో కలిసి పని చేస్తామని, ప్రజలు తనకు ఐదు సంవత్సరాల సేవ చేసే భాగ్యాన్ని కల్పించారని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. బైంసాలో డ్రైనేజ్ సిస్టం కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా 16 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించేలా కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి తీసుకురావాలన్నారు. అదేవిధంగా కేంద్రం ద్వారా రేషన్ కార్డులు ఇప్పించేందుకు తాము చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌తో పాటు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన కేంద్రాలలో దరఖాస్తులు

### కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

**ప్రజాప్రక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పొందేందుకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రాలు మున్సిపల్ ప్రజాపాలన సేవా కేంద్రాలలో నేరుగా దరఖాస్తులు అందించవచ్చని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ, ఈబీసీ వర్గాల నిరుద్యోగ యువత ఈ పథకం కింద దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను అన్ని ప్రజాపాలన సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కుల, ఆదాయ ధృవీకరణ, ఆధార్ పాన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నెంబర్‌ను చేసి ప్రజాపాలన, సేవా కేంద్రాలలో అందించాలని కలెక్టర్ సూచించారు. ఇదివరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవల్సి ఉండగా ప్రస్తుతం ఆఫ్‌లైన్ విధానంలోనూ నేరుగా దరఖాస్తులు అందించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు.

అన్ని ప్రజాపాలన సేవా కేంద్రాలలో ఖాళీ దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని సరైన విధంగా దరఖాస్తులు చేసుకునేలా సిబ్బంది సహకారం దిస్తారన్నారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తులు అందించాల్సిన అవసరం లేదని తెలిపారు.

**ప్రతినెలా 8248 మెట్రిక్ టన్నుల పైచిలుకు సన్నబియ్యం పంపిణీ : కలెక్టర్**

నిరుపేద కుటుంబాలకు కూడా సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిన మేరకు జిల్లావ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టడం జరిగిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వెల్లడించారు. జిల్లాలో ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులు కలిగిన 4,02,154 కుటుంబాలలోని 13,01,012 మందికి ప్రతినెల 8248.076 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. జిల్లాని 3,80,222 కుటుంబాలు ఆహార భద్రత కార్డులుండగా వాటి పరిధిలోని 12,50,996 మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 75, 05,856 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అంత్యోదయ కార్డులు 20,916 ఉండగా వాటి పరిధిలోని 57,997 మందికి 7,32,060 మెట్రిక్ టన్నులు సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. అన్నపూర్ణ కార్డులు 1016 ఉండగా 103 మందికి 10,160 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ప్రతినెల పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా గల 759 ప్రజాపంపిణీ కేంద్రాల ద్వారా కార్డుదారులందరికి నిర్దేశిత కోటా మేరకు సన్నబియ్యం పంపిణీ జరిగేలా పకడ్బంధీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.

**అట్టహాసంగా సన్న బియ్యం ప్రారంభం :**

కాగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. రూరల్ మండలం మల్లారం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి లాంఛనంగా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారు. నగరంలోని దుబ్బ, కోటగల్లీ, అహ్మద్ పురాలలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, శ్రీకాంత్ రెడ్డి, రవి రాథోడ్, సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు



### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ప్రజాపక్షం/ జన్నారం :** రాష్ట్ర ప్రజలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించడం ఆనందనీయమని ఖానాపూర్ ఎంఎల్‌ఎ వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం జన్నారం మండలం పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని జిసిసిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారునికి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తారని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ బియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అభ్యున్నతి సంక్షేమ తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ రాజ్ మనోహర్ రెడ్డి, ఎంపిడిఒ ఉమర్ షరీఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీ నారాయణ, సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, మోహన్ రెడ్డి, ఆర్‌ఐ. గంగరాజు, జిసిసి డీలర్ ప్రభాకర్, డీలర్ల సంఘం నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డంప్‌యార్డ్ తరలింపునకు వెంటనే చర్యలు



### శ్రీరాంపూర్ జిఎంకు ఎఐటియుసి వినతి

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సిసిసి ఏరియాలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద ఉన్న డంప్ యార్డ్‌ను వెంటనే తరలించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జిఎంకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె. బాజీ సైదా మాట్లాడుతూ కార్మికులు నివాసముంటున్న ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఉండటంతో కార్మికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. డంపు యార్డ్ ప్రాంతంలో ఆర్‌కె పై కాలనీ, బ్యారెక్స్, సిసిసి బంగ్లాస్, సింగపూర్ పునరావాస ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల నివాసితుల ఆరోగ్యం ప్రమాదంలో పడిందన్నారు. చెత్తను దహనం చేయడం వల్ల వాతావరణంలోకి హానికరమైన పొగ వ్యాపించి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా యాజమాన్యం వెంటనే డంప్ యార్డ్‌ను ఇతర ప్రదేశానికి మార్చాలని డిమాండ్ చేశారు. డంప్ యార్డ్‌ను వెంటనే తరలించకపోతే అవసరమైతే పర్యావరణ బోర్డుకు ఫిర్యాదు చేసి, ఆందోళనలు ఉధృతం చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, జిఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రామచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శులు ఆకుల లక్ష్మణ్, సంగం సదానందం, గునిగంటి నరసింగారావు, సందీప్, నవీన్ రెడ్డి, మారపల్లి సారయ్య, కుమారస్వామి, తిరుపతి, మూడ సుధాకర్, సాయిరాజు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ప్రతి ఒక్క హిందువు సోదర భావంతో మెలగాలని, యువత సన్మార్గంలో నడుస్తూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీర హనుమాన్ యాత్రలో ఆర్మూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డితో కలిసి, జంగల్ హనుమాన్ వద్ద హనుమాన్, శ్రీరాముని విగ్రహాలకి పూజలు చేసి జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారతదేశ భిన్న సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని, భిన్నత్వంలో ఏకత్వం కలదనీ పేర్కొన్నారు. ధర్మాన్ని కాపాడుకుంటూ మంచి మార్గంవైపు నడవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఏద నిండా భక్తి భావాన్ని నింపుకొని, సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అదే విధంగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ హిందువుల సంతాన నియంత్రణతోనే ప్రమా దం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూమన్న, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు సురేష్, ఎన్నారై గణేష్, దొనికేనీ దయనంద్ అంకం మహేందర్, రాజురా సత్యం, నిమ్మల రమేష్, ఆకుల శ్రీనివాస్, పుప్పల ఉపేందర్, భజరంగ్‌దళ్ ప్రముక్ కాశి వేణి ప్రణయ్, భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతమే లక్ష్యం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఎర్రజెండా అంటే పేద ప్రజలకు ధైర్యం ఇచ్చే జెండా, పేద ప్రజల ఆశాజ్యోతి సిపిఐ పార్టీని ఖానాపూర్ నియోజవర్గంలో బలోపేతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ అన్నారు. ఖానాపూర్ మండలంలోని గోసంపల్లి గ్రామంలో శాతవార్షికోత్సం సందర్భంగా సిపిఐ పార్టీ పథకాన్ని కామ్రేడ్ కలవేని శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ కలవేని శంకర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ దేశ స్వతంత్రం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని, దున్నే వాడిదే భూమి అంటూ పేద ప్రజలకు భూమిని పంచుతూ, బడుగు బలహీన వర్గాలకు సాగు భూమి ఇళ్ల స్థలాలకై పోరాడిన ఘనత ఒక సిపిఐ పార్టీకి చెందిందని అన్నారు. ఎక్కడ ప్రభుత్వ స్థలాలు ఉంటే అక్కడ పేదలకు గుడిసెలు వేసి నివాసం కల్పించేందుకు ప్రభుత్వాలతో కొట్లాడిన ఘనత కమ్యూనిస్టులదే అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సిపిఐ పార్టీని మరింత బలోపేతం చేస్తూ కార్మికుల పక్షాన, పేదల పక్షాన నిలవాలని, గత ప్రభుత్వాల అహంకారపూరితంగా పేద ప్రజలను పూర్తిగా అనుగదొక్కారని, ఇప్పుడు కూడా ప్రభుత్వం కొట్లాడి అనేక హక్కులు సాధించేవరకు సిపిఐ పేద ప్రజల వెంట ఉంటుందని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం చట్టం కోసం సిపిఐ ఎంతో పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్, అదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, కామ్రేడ్ ఎల్‌ఆర్ ఉపాలి, కడకుంట్ల రవి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ చిలుకూరి ఇస్తారే, ఖానాపూర్ భవాణ నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్, సొరపాక రాజన్న, నరసింహులు సిపిఐ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# మహిళ

ఫోకస్

## చెరువులు తవ్వి వర్షపునీటిని ఒడిసిపట్టి..



నీటి కష్టాలు మహిళలకే ఎక్కువ. అందుకే, వారికి నీటి విలువ తెలుసు. నీటి పరిరక్షణపై దృష్టి పెట్టగలుగుతారు. ఈ విషయాన్ని పశ్చిమబెంగాల్ సుందర్‌బన్స్ డెల్టా రీజియన్ గ్రామాలలో స్వయం సహాయ బృందాలు (ఎస్‌హెచ్‌జి) నిరూపిస్తున్నాయి. వర్షపునీటి నిల్వ,సంరక్షణ అమలు బాధ్యతలు నిర్వహిస్తూ, దేశానికి మార్గదర్శకం చేస్తున్నాయి. హూగ్లీ నది బంగాళాఖాతంలో కలిసే సంగమ ప్రదేశంలో సారవంతమైన సాగుభూములున్నాయి. దక్షిణ 24 పరగణాలజిల్లా పథార్ ప్రతిమ బ్లాక్‌లోని అనేక జిల్లాలకు చెందిన స్వయం సహాయ బృందాలు ఈ డెల్టా భూములను సాగు చేస్తున్నాయి. కానీ ఈ సంగమ ప్రదేశంవల్ల ఈ ప్రాంతంలోని భూగర్భజలాలలో స్వచ్ఛమైన త్రాగునీటిలో ఉప్పదనం వచ్చి చేరుతున్నది. ఉప్పదనం నిండిన ఈ భూగర్భజలాలను వ్యవసాయానికి ఉపయోగించడంవల్ల పంటలకు నష్టం కలుగుతుంది. అందువల్ల కొత్తగా చెరువులు తవ్వి, వర్షపునీటిని ఒడిసిపట్టి ఆ నీటిని నిల్వచేసే పద్ధతులను అమలు చేసే బాధ్యతలు ఈ ప్రాంత మహిళా స్వయం సహాయ బృందాలు తీసుకున్నాయి. దీనివల్ల పాత చెరువులలో కూడా ఉప్పదనం తగ్గుతున్నది. వర్షపునీటి నిల్వ బాధ్యతలను ఈ గ్రూపులు చక్కగా అమలు చేస్తున్నాయి. వర్షపునీటిని నిల్వచేసే పద్ధతుల అమలువల్ల రాబోయేకాలంలో తమ వ్యవసాయ భూముల్లో మంచి దిగుబడుల వల్ల మంచి లాభాలు వస్తాయన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది. ఈ సారవంతమైన హూగ్లీనదీతీర భూముల్లో ఉప్పదనం పెరగడంవల్ల భూగర్భజలాలలో లవణత పెరిగిందనీ, దాదాపు 127.9 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న భూములు ఈ లవణత బారిన పడ్డాయని స్థానికులు చెప్తున్నారు. కాగా, వర్షపునీటిని ఒడిసిపట్టి సంరక్షించే ప్రత్యామ్నాయ పద్ధతులవల్ల సాగు దిగుబడులు మెరుగుపడతాయి. ప్రభుత్వేతర సంస్థ మద్దతు, మార్గదర్శకత్వం ద్వారా గ్రామస్థులు కొత్తగా తవ్విన చెరువులలో వర్షపునీటిని నిల్వ చేస్తున్నారు. పథార్ ప్రతిమ బ్లాక్‌లో అనేక స్వయం సహాయ బృందాలున్నాయి. ఇందులో పనిచేసే 530 మంది సభ్యులలో షిఫాలీ బేరా ఒకరు. ప్రపంచ స్వచ్ఛంద సేవాసంస్థ చొరవతో తాము ఈ పనులు చేపట్టామన్నారు. ఇప్పుడు వర్షపు నీటి నిల్వపద్ధతులను చేపట్టామనీ, గ్రామస్థులకు కూడా దీనినే ప్రోత్సహిస్తున్నామన్నారు. 'ఇప్పటికీ ఈ ప్రాంత భూగర్భనీటిలో ఉప్పదనం చాలా ఎక్కువగా ఉంది. కొత్తగా తవ్విన చెరువులలో నింపిన వర్షపునీటిలో ఉప్పదనం లేదు, పాత చెరువులలో కూడా ఇప్పుడు కొద్దికొద్దిగా ఉప్పదనం తగ్గుతున్నది, దీనివల్ల క్రమంగా సమీప కాలువల ద్వారా ఉప్పదనం పోతుంది,



రాబోయే రెండు సంవత్సరాలలో కొత్త వర్షపు నీరు వచ్చి చేరుతుంది, సాగు దిగుబడులు పెరుగుతాయి, అనేక కూరగాయ పంటలు పండిస్తాం, వరి పండిస్తాం, చివరకు కృత్రిమ పద్ధతులలో మంచినీటి చెరువులలో చేపల పెంపకం కూడా వృద్ధిచేస్తాం' అని బేరా చెప్పారు. వాతావరణ మార్పులను కూడా తట్టుకునేందుకు, వాటి నుండి తేరుకునేందుకు వీలుగా సాగుభూమి నిర్వహణ, మట్టి నాణ్యత, జన్యుపరమైన జాగ్రత్తలు తీసుకోవడంద్వారా నీటి నాణ్యత నిలబెట్టుకుని, మట్టిలో తేమను పెంచుకునేందుకు స్థిరమైన వ్యవసాయ పద్ధతులు ఈ ప్రాంతంలో పాటిస్తామన్నారు. ఏదిఏమైనా వర్షపు నీటిని ఒడిసిపట్టడమేగాక, నీటిని నిల్వ చేయడానికి కూడా కృషి చేస్తున్న ఈ మహిళా స్వయం సహాయక గ్రూపులు దేశానికే మార్గదర్శకం చేస్తున్నాయి. కర్తవ్యాన్ని బోధిస్తున్నాయి.



## ధైర్యం... సునీత సొంతం

సునీతా విలియమ్స్‌ను కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. అంతరిక్షయానం వంటి అంశాలపై ఆసక్తిలేని వారికి కూడా ఆమె ఎవరో తెలుసు. కేవలం వారం రోజుల కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు వెళ్లి, అక్కడే తొమ్మిది నెలలు చిక్కుకుపోయి, ఇటీవలే తిరిగి భూమిపైకి వచ్చిన 59 ఏళ్ల సునీత ప్రదర్శించిన ధైర్యం ఇప్పుడు ప్రతి ఒక్కరికీ సుపరిచితమే. ఐఎస్ఎస్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత తొలిసారి మీడియాలో మాట్లాడిన సునీతలో అదే ఉత్సాహం. ముఖంపై అదే చెరగని చిరునవ్వు. ఎక్కువ కాలం అంతరిక్షంలో ఉండడం వల్ల ఆమె కండరాలు పనిచేయకుండాపోయాయని, ఆమె నడక మరచిపోయిందని, తిరిగి అడుగులు వేయడానికి చాలాకాలం పడుతుందని సోషల్ మీడియాలో వార్తలు హోరెత్తిపోయాయి. అంతరిక్షయానం పూర్తి చేసుకున్న తర్వాత ప్రతి వ్యోమగామిని తొలుత రిహాబిలేషన్ సెంటర్‌కు తరలిస్తారు. అక్కడ ఆరోగ్య పరీక్షలు జరిపిన తర్వాత, కొంతకాలం అవసరమైన సేవలు అందిస్తారు. సునీతను, ఆమెతోపాటు భూమికి తిరిగి వచ్చిన బుచ్‌విల్మోర్, అలెగ్జాండర్ గొర్బొనొవ్, నిక్ హేగ్‌ను కూడా రిహాబిలేషన్ సెంటర్‌కు తరలించారు. ఆ తర్వాత మొదటిసారి ఆమె మీడియాతో మాట్లాడింది. విల్మోర్ కూడా పాల్గొన్న ఆ సమావేశంలో, సునీత తన తండ్రి జన్మస్థలమైన భారత్ పట్ల తనకు ఉన్న అభిమానాన్ని చాటుకుంది. 'అంతరిక్షం నుంచి భారత్ ఎలా కనిపించింది?' అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, అత్యద్భుతంగా కనిపించిందని వ్యాఖ్యానించింది. భారత్‌కు వెళతానని, అక్కడ ప్రజలను కలుస్తానని చెప్పింది. సునీత తండ్రి దీపక్ పాండ్య గుజరాత్ నుంచి 1958లో అమెరికా వలస వెళ్లాడు. ఒహియోలోని క్లేవ్ ల్యాండ్‌లో ఇన్‌టర్న్‌షిప్, మెడిసిన్‌లో రెసిడెన్సీ ట్రైనింగ్ తీసుకున్నాడు. దీపక్ పాండ్య, ఉర్సులైన్ బోనీ పాండ్య దంపతులకు 1965, సెప్టెంబర్ 19న ఒహియోలో జన్మించిన సునీత, అనంతరం తనతల్లిదండ్రులు, సోదరుడు జే థామస్, సోదరి దినా అన్నాద్‌తో కలిసి మాసచూసెట్స్ రాష్ట్రానికి తరలివెళ్లింది. చదువు పూర్తయిన తర్వాత, 1987లో యుఎస్ నేవీలో చేరింది. 1989లో నావల్ ఏవియేటర్‌గా బాధ్యతలు స్వీకరించింది. 1998 ఆగస్టులో, అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా'లో చేరే అవకాశం దక్కించుకుంది. ప్రతిభాపాటవాలు... అనన్యసామాన్యమైన ధైర్యసాహసాలు ఆమెకు వ్యోమగామిగా ఎంపికయ్యే అవకాశాలను కల్పించాయి. భారత మూలాలున్న రెండో మహిళా వ్యోమగామిగా చరిత్ర సృష్టించింది. అంతకు ముందు కల్పనా చావ్లా అంతరిక్షయానం చేసిన విషయం తెలిసిందే. దురదృష్టవశాత్తు వ్యోమనౌక పేలిపోవడంతో కల్పన దుర్మరణంపాలైంది. నాటి భయానక దృశ్యాలను యావత్ ప్రపంచం, ముఖ్యంగా భారత్ మరచిపోలేదు. అందుకే, ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తడం, ఫలితంగా అక్కడే చిక్కుకుపోవడం భారతీయులందరినీ తీవ్రమైన ఆందోళనకు గురి చేసింది. ఆమె ఆరోగ్యంపై ఎన్నో అనుమానాలు తలెత్తాయి. అంతరిక్షం నుంచి తన క్షేమ సమాచారాలను పంపుతున్నప్పటికీ, ఆమె ఆరోగ్యం క్షీణించిందనే వార్త దావానలంలా వ్యాపించింది. చివరికి సునీత క్షేమంగా భూమికి చేరిన తర్వాత కూడా సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్యంపై భిన్నమైన కథనాలు వినిపించాయి. ఊహాగానాలకు... పుకార్లకు తెరదించుతూ మార్చి 31వ తేదీన విల్మోర్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడింది. అంతరిక్ష యాత్ర అనుభవాలను పంచుకుంది. భారత్‌ను సందర్శించాలనే కోరిక వెలిబుచ్చింది. అత్యంత సంక్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ, ఆత్మవిశ్వాసం కోల్పోని సునీత కోట్లాది మంది మహిళలకు మార్గదర్శకురాలు. మరోసారి అంతరిక్ష యాత్రకు సిద్ధమని ప్రకటించడం కొసమెరుపు.



## 'బాల్ వివాహ ముక్త్ భారత్' | ఆచరణ సాధ్యమా?



విభిన్న కుల ఆచారాలు... లెక్కలేనన్ని మత విశ్వాసాలు వేళ్లూకున్న భారత దేశంలో బాల్య వివాహాలను కట్టడి చేయడం సాధ్యమా? ఈ సమస్యపై 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' ద్వారా అద్భుతంగా వివరించారు గురజాడ అప్పారావు తన 'కన్యాశుల్కం' నాటకంలో. ఈ నాటకం తొలిసారి ముద్రితమై 133 సంవత్సరాలైంది. అప్పట్లో తీవ్రంగా ఉన్న బాల్య వివాహాల సమస్య, ఇప్పటికీ కొనసాగడం దారుణం. పరిస్థితులు కొంత మారినప్పటికీ, బాలికల స్వేచ్ఛకు పెళ్లిపేరుతో కళ్లెం వేసే దుష్టసాంప్రదాయం కొనసాగుతునే ఉంది. ఇలాంటి తరుణంలో, 2029 నాటికి దేశంలో బాల్య వివాహాల రేటును 5 శాతానికి తగ్గించడమే లక్ష్యంగా కేంద్రంలోని మోదీ సర్కారు ప్రకటించడాన్ని ఒక సాహసంగానే చెప్పుకోవాలి. 'బాల్ వివాహ ముక్త్ భారత్' పేరుతో ప్రారంభించిన ప్రాజెక్టు విజయవంతమైతే, అంతకు మించిన ఆనందం ఏముంటుంది? కానీ, ఇప్పటి వరకూ ఎన్నో పథకాలను ప్రకటించి, నినాదాలతో హోరెత్తించి, చివరికి వాటిని అటకెక్కించిన చరిత్ర ఉన్న బిజెపి ప్రభుత్వం, ఈ కార్యక్రమాన్నయినా చిత్తశుద్ధితో అమలు చేస్తుందా లేక ఎప్పటి మాదిరిగానే మాటలకే పరిమితమవుతుందా? అనేది చూడాలి. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రారంభించిన 'బాల్ వివాహ ముక్త్ భారత్' ప్రాజెక్టు దేశంలో బాల్య వివాహాలను నిర్మూలించడానికి సమష్టి ప్రయత్నంలో అన్ని వర్గాలను వాటాదారులుగా చేర్చడానికి ప్రయత్నిస్తుంది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, బిహార్, జార్ఖండ్, రాజస్థాన్, త్రిపుర, అస్సాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. జాతీయ సగటుతో పోలిస్తే 300 రెట్లు అధికం. ఈ గణాంకాలను చూస్తే, 2029 నాటికి బాల్య వివాహాలను గణనీయంగా తగ్గించడం సాధ్యమవుతుందా అనే అనుమానం కలగక మానదు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం బాల్య వివాహాల రేట్లు 2006లో 47.4 శాతం నుండి 2019—21లో 23.3 శాతానికి తగ్గాయి. ఈ రేటును మరింత తగ్గించడమే లక్ష్యంగా 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్' పోర్టల్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన పెంచడానికి, కేసులను నివేదించడానికి, పురోగతిని పర్యవేక్షించడానికి ఇది ఒక వేదిక. బాల్య వివాహాలను నిరోధించడంలో, బాధిత వ్యక్తులకు మద్దతు ఇవ్వడంలో వారి చురుకైన పాత్రను నిర్ధారించడానికి ఉపయోగపడుతుంది. పర్యవేక్షణ, మూల్యాంకన యంత్రాంగాలను బలోపేతం చేయడం ద్వారా బాల్య వివాహాల నిషేధ అధికారుల (సిఎంపిఒలు) సమర్థవంతమైన పర్యవేక్షణను సులభతరం చేయడానికి కూడా పోర్టల్ ఉపయోగపడుతుంది. బాల్య వివాహాలకు సంబంధించి ప్రజలు తమ ఫిర్యాదులను నమోదు చేసుకోగలుగుతారు. ఇవి దేశంలో ఎక్కడైనా సంబంధిత సిఎంపిఒలకు నేరుగా చేరుతాయి. అన్ని రాష్ట్రాలు పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలని, సిఎంపిఒలను నమోదు చేయాలని కేంద్రం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా కేసుల నిజసమయ పర్యవేక్షణ ఉంటుందని పేర్కొంది. ఈ పోర్టల్ పర్యవేక్షణ కోసం కేంద్రంలో నోడల్ అధికారులను నియమిస్తారు. నిజానికి ఇది మంచి ప్రయత్నమే. బాల్య వివాహాలకు బుగ్గవుతున్న బాలికల జీవితాలకు ఊరటనిచ్చే విషయమే. అయితే, కేంద్రం కేవలం మాటలతో సరిపుచ్చుకోకుండా ఈ ప్రాజెక్టును సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలి. రాజకీయ ప్రయోజనాలు ఆశించకుండా, చిత్తశుద్ధితో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేయాలి. అప్పుడే ఇలాంటి ప్రాజెక్టుల వల్ల ఉపయోగం.

---

## కార్మిక సంఘాల బలోపేతంతోనే సంక్షేమం, హక్కుల రక్షణ

ఎఐటియుసి మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడిపోషం




**ప్రజాపక్షం/కాసిపేట :** కార్మిక సంఘాల బలోపేతంతోనే సంక్షేమం, హక్కులకు రక్షణ ఉంటుందని ఎఐటియుసి మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి పోషం పేర్కొన్నారు. మంగళవారం కాసిపేట మండల కేంద్రంలో టిఎస్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) మండల కమిటీని ఎన్నుకున్నారు. సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల దాసు, టిఎస్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నిర్మాణ బాధ్యుడు దాగం మల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాడి పోషం మాట్లాడుతూ ఈనెల 13న జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం బలోపేతానికి నూతన నాయకత్వం కృషి చేయాలని, సూచించారు. గౌరవ అధ్యక్షుడిగా జాడి పోచం, అధ్యక్షుడిగా బండారి సత్తయ్య, ఉపాధ్యక్షుడిగా ఉప్పులేటి మధురయ్య, ప్రధాన కార్యదర్శిగా గంగాధరి రాజయ్య, సహాయ కార్యదర్శిగా భోగి సత్తయ్య, కోశాధికారిగా నల్ల శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా కాలువ రాజేష్, ఎస్‌కె. మహబూబ్, దాసరి లింగయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దాడి గట్టయ్య, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కొంకుల రాజేష్, దాగం రాజలింగు, గట్టు సర్వేశం, దుర్గం పోశం, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి అవునూరి రాజు, అధ్యక్షుడు రామగిరి వెంకన్న పాల్గొన్నారు.

## కబ్జాకు గురవుతున్న చారిత్రక కట్టడాలు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు

సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు




**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** గద్వాల చారిత్రక కట్టడాలను కోట బావుల స్థలాలు కబ్జాలు కాకుండా రక్షించాలని, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ గద్వాల జిల్లా సమితి డిమాండ్ చేసింది. గద్వాల చారిత్రక కట్టడాలు స్థలాలు బావులు కబ్జాలకు గురవుతుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపాలిటీ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆంజనేయులు మాట్లాడారు. కబ్జాలకు పాల్పడుతూ ప్రభుత్వ స్థలాలను బావులను కొల్లగొడుతున్న మాజీ మున్సిపాల్ చైర్మన్ వేణుగోపాల్ పై సమగ్ర విచారణ దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ని కోరారు. కోట, చారిత్రక కట్టడాలతో గద్వాలకు పేరు వచ్చిందని, వాటి రక్షణకు పునర్నిర్మాణం కొరకు పురావస్తు శాఖ, ప్రభుత్వం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి డి.రాము, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రంగన్న, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.పరమేష్, నాయకులు ఖసీం,వెంకటన్న, గంగాధర్, కృష్ణ ,కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## యువతను మోసగిస్తున్న ప్రభుత్వాలు

ఉపాధి అవకాశాలు కల్పించకుండా మతఛాందస విధానాలు నూరిపోయడం దుర్మార్గమైన చర్య

ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర




**ప్రజాపక్షం/వలిగొండ :** యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమిద్దామని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. యువతకు మత ఛాందస విధానాలను నూరిపోయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎఐవైఎఫ్ వలిగొండ మండల 4వ మహాసభ స్థానిక శివశక్తి ఫంక్షన్ హాల్‌లో మారోజు నర్సింహాచారి అధ్యక్షతన జరిగింది. ఎఐవైఎఫ్ జెండాను ధర్మేంద్ర ఎగురవేసి మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ పాలకులు స్వార్థ నీచ రాజకీయాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదన్నారు. కానీ ఆ బాధ్యతను మరిచి వికృత మతఛాందస పోకడలను అనుసరిస్తూ విభజన సృష్టించి అశాంతిని నెలకొల్పాలని చూస్తున్నారని, ఈ చర్యలను యువత తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. విద్య, ఉపాధి హక్కులు పొందడం మన హక్కు అన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం 10 కోట్ల ఉద్యోగాలు ఆవిరైపోతున్నాయన్నారు. ప్రతి సంవత్సరం 10 లక్షల ఉద్యోగాలు మాత్రమే పుట్టుకొస్తున్నాయని భారతదేశ సెంటర్ ఫర్ ఎంప్లాయిమెంట్ మానిటరింగ్ సంస్థ గణాంకాలు ప్రకటించాయన్నారు. దీనివలన దేశంలో ఆర్థిక సమతుల్యత దెబ్బతింటుందని, దీనికి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడమే ప్రధాన కారణమన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసి కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ వేయడమే ప్రధాన కారణ మన్నారు. సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ ఎఐవైఎఫ్ విద్య, వైద్యం, ఉపాధి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలన్నారు. వలిగొండ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, మూసీ నదిని ప్రక్షాళన చేయాలని, పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్య సేవలు అందించాలని, పరిశ్రమలలో రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్ల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ పాలకుల అవలంభిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, వలిగొండ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎలగందుల అంజయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి సుద్దాల సాయి కుమార్, మేడి దేవేందర్, బాలగోని రాజు, కందుకూరి వినయ్, గుండెగోని నాగరాజు, సలిగంజి కృష్ణ కుమార్, ప్రదీప్, బొడిగ సుదర్శన్, నార్కెట్పల్లి మత్స్య గిరి, కట్ల యాదగిరి పాల్గొన్నారు.

## సంక్షేమబోర్డు పరిరక్షణే ధ్యేయం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (గరిడేపల్లి):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పరిరక్షణే ఎఐటియుసి ధ్యేయమని సంఘం రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం 6న మహాసభ దిడ్డి సత్యనారాయణ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తూ నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని చెప్పారు. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ హక్కులను కాలరాస్తుందన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో చేరాలంటే అనేక ఆంక్షలు పెట్టి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు రూ.10లక్షల ప్రమాద భీమా కల్పించాలని, సహజ మరణంకు రూ.5లక్షలు పెంచాలని, పెళ్లి కానుకగా రూ.30 వేల నుండి 50వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎడవల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన మహాసభలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి త్రిపుర సుధాకర్ రెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జెట్టి ప్రసాద్, నాయకులు రమేష్, మస్తాన్, రవి పాల్గొన్నారు.




## మహిళలపై అఘాయిత్యాల నివారణకు కఠిన చట్టాలు అమలు

మహిళా సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగమ్మ




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యల నివారణకు కఠినమైన చట్టాలు అమలు చేయాలని మహిళా సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో జరిగిన మహిళ సమాఖ్య 3వ మండ ల మహాసభలో యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణతో కలిసి మహిళ సమాఖ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో జంగమ్మ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళలపై అత్యాచారాలు, వ్యక్తిగత హింసలకు పాల్పడుతున్నా నేరాలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని ఆరోపించారు. మహిళలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్ స్థాయిని అమలు పరచడంలో ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయన్నారు. అభివృద్ధి, సాధికారత సాధించేంతవరకు మహిళా సంఘాలు ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించాల్సిన బాధ్యత మహిళలపై ఉన్నదన్నారు. మిస్ వరల్డ్ అందాల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడానికి తప్పు పట్టారు. అసభ్యకరమైన అందాల పోటీలను నిలుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలని కోరారు. వృద్ధాప్య, దివ్యాంగుల, ఒంటరి మహిళల పెన్షన్ సౌకర్యం, అర్హులైన పేద మహిళలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి నివేశ స్థలాలను అందజేయడంలో ప్రభుత్వంపై మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలను చైతన్యపరిచి ఉద్యమాలు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి మంచాల రాధమ్మ, రేపాక ఉమా, శనిగల భాగ్యమ్మ, మంచాల పద్మ, మంచాల మాధవి, ఆలేటి సబిత, నల్ల మహేశ్వరి, నాగమ్మ, బోళ్ల స్వప్న, నల్ల మహేశ్వరి, ఇంద్రియాల నాగమ్మ, సిపిఐ మండల కార్యదర్శి గాధగాని మాణిక్యం, మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, పసుపులు నరసింహ, సునీల్ మధు పాల్గొన్నారు.

## పోరాటాలతో సమస్యలు పరిష్కారం

ఎఐటియుసి మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** పోరాటాల ద్వారానే భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఎఐటియుసి మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాయలం వీరభవన్‌లో ఎఐటియుసి అనుబంధ భవన నిర్మాణ కార్మికులు తాపి, పెంయిటర్స్ సంయుక్త సమావేశం బూర్గుల శ్రీనివాస్, గులగట్లు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి మంద శంకర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కోట్లాదిమంది కార్మికుల సంక్షేమం కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆనేక పోరాటాలు నిర్వహించిన ఫలితంగానే ఆనాడు కేంద్ర హోం మంత్రి ఇంద్రజిత్ గుప్తా, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చతురాన ఆధ్వర్యంలో 1996 లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దానిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగ వైకల్యం ఈ నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోవాలని చూస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో 2003 నుండి వెల్ఫేర్ బోర్డు ద్వారా 11 రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం ప్రమాద, సహజ మరణం, వివాహ కానుక, ప్రసూతి కానుక, సంక్షేమ పథకాల ద్వారా అందిస్తోందన్నారు. కొంత మేరకు రక్షణగా ఉన్నాయని, ఢిల్లీ, పంజాబ్, కర్ణాటక, హర్యాన, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కార్మికులకు పెన్షన్, పిల్లలకు స్కాలర్‌షిప్, స్వంత వసతిగృహాలు వంటి పథకాలు అందిస్తోందన్నారు. మన రాష్ట్రంలో కూడా భవన నిర్మాణ కార్మికులకు నూతన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు ఎస్‌కె జానీ, ఎండి పాషా, కొమ్ము యాకన్న, రమణ, బాబు, మహిమూద్, శేఖర్, బట్టు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఖోఖో పోటీలకు రెఫరీగా కోట రాంబాబు

**ప్రజాపక్షం /నర్సంపేట :** జాతీయస్థాయి ఖోఖో పోటీలకు రెఫరీగా నర్సంపేట బాయ్స్ హై స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కోట రాంబాబు ఎంపిక అయినట్లు పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, నర్సంపేట మండల విద్యాశాఖ అధికారి కొర్ర సారయ్య తెలిపారు. సారయ్య మాట్లాడుతూ ఒడిస్సా రాష్ట్రంలోని పూరి జగన్నాథ స్వామి స్టేడియంలో మార్చి 31 నుండి ఏప్రిల్ 4 వరకు జరుగుచున్న 57వ సీనియర్ నేషనల్ ఖోఖో పోటీలకు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (బాయ్స్) ఫిజికల్ డైరెక్టర్గా గా విధులు నిర్వహిస్తున్న కోట రాంబాబు ఎంపిక కావడం అనందనీయమన్నారు. జాతీయ ఖో ఖో పోటీలకు ఎంపికైన కోట రాంబాబు మాట్లాడుతూ పూరీ లో జరుగుచున్న జాతీయ స్థాయి కోకో పోటీలలో యావత్ భారతదేశం నుండి అన్ని రాష్ట్రాల టీములు , కేంద్రపాలిత ప్రాంతాలు పాల్గొంటున్నాయని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ ఖో ఖో సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు జంగా రాఘవ రెడి, నాతి కృష్ణమూర్తి , ఉమ్మడి వరంగల్ జిల్లా ఖో ఖో సంఘం ప్రధాన కార్యదర్శి తోట శ్యాం ప్రసాద్, తదితరులకు రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గరీబోళ్లకు కడుపునిండా భోజనం



**ప్రజాపక్షం/గూడూరు:**మహబూబాబాద్జిల్లా గూడూరు మండల కేంద్రంలో సన్నబియ్యం కార్యక్రమాన్ని మంగళవారం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, ఆర్డీవో కృష్ణవేణి సివిల్ సప్లైజిల్లా అధికారి ప్రేమ్ కుమార్ప్రారంభించారు.ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నిరుపేత కుటుంబం కడుపునిండా భోజనం చేయడమే అక్ష్యంగా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణి పథకాన్ని ప్రారంభించిందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించి సన్నబియ్యం పంపిని చేస్తామని స్పష్టం చేశారు. గూడూరు మండలలో 146 మందికి కల్యాణ లక్ష్మీ , షాదీముబారక్ చెక్కులు అందజేశారు. తహసిల్దార్ శ్వేత ఆర్ఐ మల్లయ్య జిల్లా మండల నాయకులు మాదవపెద్ది ప్రదీప్రెడ్డి, నెక్కొండ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్రెడ్డి,చిట్టి వెంకన్న, వాంగుడోత్ కోమ్మాలు, శ్రీపాల్రెడ్డి భూక్య పద్మ, మాదాస్ రమేష్, బోల్లికోండ మధు, పేరాల సురేందర్ యాకయ్య కూమారస్వామి తదితరులున్నారు.

## ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు



**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు అన్నారు. వరంగల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కీర్తినగర్ ఆరోగ్య మహిళా క్లినిక్ ను మంగళవారం సందర్శించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవల గురించి, సమయపాలన వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని , సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలన్నారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు. వైద్యాధికారిని డాక్టర్ జాబిలి, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఎల్డి కంప్యూటర్ నాగరాజు, వైకుంఠం , వైద్య సిబ్బంది మొదలగు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి గెజిటెడ్ హెచ్ఎంలకు శిక్షణ

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఇటీవల కొత్తగా ప్రమోషన్ పొందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు, ఎల్ ఎఫ్ఎల్ హెచ్ఎంలకు, స్కూల్ అసిస్టెంట్లకు జిల్లా వ్యాప్తంగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఏ.రవీందర్రెడ్డి తెలిపారు. మార్చి 3,4 తేదీల్లో రెండు రోజులపాటు ప్రభుత్వ హైస్కూల్, మోడల్ స్కూల్ అనంతారంలో 560మంది పదోన్నతులు పొందిన ప్రధానోపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో అట్టడుగు స్థానంలో ఉనక్న జిల్లాను ప్రస్తుతం అన్ని విషయాల్లో రాష్ట్రంలో ముందంజలో ఉంచే విషయంలో ప్రతి ఒక్కరి కృషి అభినందనీయమని డిఇఓ తెలిపారు.

## పెంచిన టోల్చార్జీలు తగ్గించండి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా టోల్ చార్జీలను సోమవారం అర్ధరాత్రి నుండి పెంచడం జరిగిందని, వాటిని ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఉన్న విధంగానే టోల్ చార్జీలు కొనసాగించాలని, చార్జీలు పెంచి ప్రయాణికుల మీద, వాహనదారుల మీద అదనపు భారం వేయద్దని ఆయన కోరారు. జాతీయ రహదారులు మూడున్నరశాతం నుండి ఐదు శాతం వరకూపెంచడం అలాగే ఔటర్ రింగ్ రోడ్ చార్జీలు కూడా పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. తక్షణమే పాత పద్ధతిలోనే టోల్ చార్జీలు వసూలు చేయాలని విజయసారథి డిమాండ్ చేశారు.

## సిఎం సహాయనిధి..పేదలకు సంజీవని

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** అనారోగ్యంతో ప్రైవేట్ దావఖానలో వైద్యం చేయించుకున్న రోగులకు సిఎంఆర్ ఎఫ్ చెక్కుల ద్వారా ఆర్థికంగా కొంత రిలీఫ్ నిచ్చే విధంగా ప్రభుత్వ సహాయం అందజేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీలో రాని రోగుల కోసం ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థికంగా వైద్యం చేయించుకొని నష్టపోయిన వారిని ఆదుకునేందుకు సహాయపడుతుందన్నారు. పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఓ సంజీవినిగా ఉపయోగపడుతుందని వివరించారు.టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, ముంజల రవీందర్, దాట్ల శ్రీనివాస్, తోట రంజిత్, మహేందర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గ్రూప్–1 ర్యాంకర్ తోట సోనికి అభినందన



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గ్రూప్1 ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 203 ర్యాంకు, మల్టీ జోనల్ స్థాయిలో 93వ ర్యాంకు సాధించిన తోట సోనికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తోట సోని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని కలిసిన సందర్భంగా ఆయన శాలువా కప్పి సత్కరించి, పూల మొక్క అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ పేద, మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన సోని గ్రూప్1 అధికారిగా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. తోట సోని భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డిని కలిసిన వారిలో సోని తో పాటు కాంగ్రెస్ నాయకులు పులి రాజు, సోని తండ్రి తోట దామోదర్ తదితరులు ఉన్నారు.

# నెరవేరిన సన్నబియ్యం సంకల్పం

### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
### హనుమకొండ జిల్లాలో లాంఛనంగా ప్రారంభమైన సన్న బియ్యం పంపిణీ



**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లాలో మంగళవారం లాంఛనంగా ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి రేషన్ కార్డుదారు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ని 12మండలాల్లో సుమారుగా 200 పైచిలుకు రేషన్ దుకాణాల ద్వారా 2881 క్వింటాల సన్న బియ్యం పంపిణీ జరిగిందని, ఈ బియ్యం పంపిణీ ఈ నెల 5వ తేదీ వరకూ జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య తెలిపారు. హనుమకొండ జిల్లాలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్రెడ్డి, అధికారులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పథకం గురించి ఎమ్మెల్యేలు ప్రసంగించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లోని 5వ డివిజన్ రెడ్డికాలనీ, 57వ డివిజన్ గోకుల్ నగర్ లో ఎమ్మె ల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూరు మండల కేంద్రాలలో ప్రారంభించారు. ఎమ్మెల్యేలతో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, అధికారులున్నారు.

## సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మక ఘట్టం

**ప్రజాపక్షం/గీసుకొండ:** పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి సీఎం రేవంత్రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి అన్నారు. గీసుకొండ మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీచేసేఅవకాశం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రావటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సన్న బియ్యం పంపిణీ చేయడం చారిత్రాత్మక ఘట్టమని, ఏ ప్రభుత్వం వచ్చినా దీనిని మార్చేసాహసం చేయదన్నా. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడే ఆహా ర భద్రత చట్టం తీసుకవచ్చిందని గుర్తు చేశారు. ఒక్క గీసుకొండ మండలంలోనే 18,446 కుటుంబాలకు 32టన్నుల బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ఆర్డీవో సత్యపాల్రెడ్డి, తహసీల్దారు ఎండీ రియాజుద్దీన్, డీటీ రవీందర్రావు, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, ఏపీఎం సురేష్కుమార్, నాయకులు రుద్ర ప్రసాద్, సౌజన్య, కొమురారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, వెంకటి, రవీందర్, జావిద్, గోదాసి చిన్న, ప్రవీణ్, కొమురారెడ్డి, రమేష్, నాగరాజు, ప్రవీణ్, భరత్, నాగరాజు, రమేశ్, రవికుమార్ ఉన్నారు.

## బెట్టింగ్ యాప్ల జోలికెళ్లొద్దు

### జయశంకర్ జిల్లా ఎస్పి కిరణ్ ఖరే

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, నిషేధిత ప్లే కార్డ్స్, గేమింగ్ యాప్ లకు, ఐపీఎల్ బెట్టింగ్ లకు దూరంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ సమయంలో సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, ప్రజలు విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్ లకు బానిసలుగా మారి, అప్పులపాలపై ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు. ఆన్లైన్ బెట్టింగ్, ప్లే కార్డ్, గేమ్స్ కట్టడికి జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్స్ వల్ల యువత ఆర్థికంగా దెబ్బతిని చివరికి సూసైడ్ చేసుకొని ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, బెట్టింగ్లకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. బెట్టింగ్ నిర్వహించే వారిపై పోలీస్ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లల పై ప్రవర్తన పై నిఘా పెట్టాలని, ప్రతి రోజూ పిల్లలు వారు చేస్తున్న పనుల గురించి ఆరా తీయాలని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. ఆన్లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్ ల నిర్వాహకుల మార్గదర్శకంలోనే బెట్టింగ్ లు ఆపరేట్ చేయబడతాయని, బెట్టింగ్ యాప్ లలో డబ్బులు పెట్టుబడిగా పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దనీ, ఎస్పీ యువతకు సూచించారు. బెట్టింగ్ యాప్ ల డౌన్ లోడ్ ద్వారా ప్రజల వ్యక్తి గత సమాచారం. అకౌంట్ వివరాలు, సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్ళే అవకాశం ఉన్నందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండి, బెట్టింగ్ సంబంధిత సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని, ఇన్ఫర్మేషన్ అందించినవారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం



**ప్రజాపక్షం/తొర్రూరు :** పేదల కడుపు నింపేందుకే సీఎం రేవంత్ రెడ్డి సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టారని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నాంచారిమడూరులో రేషన్ కార్డు లబ్దిదారులకు సన్న బియ్యాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. యశస్వినిరెడ్డి మాట్లాడుతూప్రతీ వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడి గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, మండల నాయకులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినతి



**ప్రజాపక్షం/ తొర్రూరు :** రోజు రోజుకు ఎంతో అభివృద్ధి చెందుతున్న తొర్రూరు పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డికి వామపక్ష పార్టీల నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వర్రావు, సిపిఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్, మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగయ్యలు మాట్లాడారు. తొర్రూరులో మంజూరైన వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులనుప్రారంభించాలన్నారు. తొర్రూరు పట్టణంలో ప్రైవేట్ భూమిని కొనడానికి నిధుల కొరత ఉంటే వామపక్ష పార్టీలు జోల పట్టుకొని నిధులు వసూలు చేయడానికి కూడా సిద్ధంగాఉన్నామనిచెప్పారు. తొర్రూరు ప్రధాన రహదారిపై డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేస్తూ విద్యుత్ స్తంభాలను తొలగించాలన్నారు. అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి ఇల్లు లేని వారికి నివాసాన్ని కల్పించాలన్నారు. తొర్రూరులో సబ్ రిజిస్ట్రార్, ఏటీఓ, ఫైర్ స్టేషన్, ఇరిగేషన్ కార్యాలయం, మినీస్టేడియం, బాలికల హైస్కూ ల్, పాలిటెక్నిక్ కళాశాలలు, తదితర కార్యాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. సీపీఎం తొర్రూరు మండల కార్యదర్శి ఎండి. యాకూబ్, సీపీఐ మండల కార్యదర్శి బంధు మహేందర్ పాల్గొన్నారు.

# జామాయిల్ చెట్లు నరికివేతపై చర్యలేవి?

### వామపక్ష పార్టీ నేతలు



**ప్రజాపక్షం/ములుగుప్రతినిధి:** భూ ఆక్రమణదారుల ఆగడాలను అరికట్టి లింగాపూర్ వద్ద గల భూములలోని జామాయిల్ చెట్లను నరికి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీ నేతలు తుమ్మల వెంకట్రెడ్డి, తోట మల్లికార్జునరావులు డిమాండ్ చేశారు. మంగళవారం లింగాపూర్ భూముల పరిశీలనకు వెళ్ళిన వారు మాట్లాడుతూ వెంకటాపూర్ శివారు లింగాపూర్ వద్ద గత నలభై సంవత్సరాలుగా సాగులో ఉన్న రైతులపై దౌర్జన్యం చేస్తూ వారి భూములను స్వాధీనం చేసుకోవడానికి అనేక అరాచకాలు సృష్టిస్తూ అక్కడ సర్వే నెంబర్ల 18 64, 18 65లోని ఆరు ఎకరాల భూమిలోని జామాయిల్ చెట్లను నరికిన చింతల చరణ్, తైలం గౌతంసాగర్, తైలం నరేష్ సాగర్పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత 2020నుండి ఇక్కడ మా తాతల పట్టా భూమి ఉన్నదని చెప్పుతూ కాస్తు కబ్జాలో ఉన్న రైతులపై దౌర్జన్యాలు దాడులు చేస్తూ వాస్తవ పట్టాదారుల బూమిలోని 12 ఏళ్ల జామాయిల్ తోటను అక్రమంగా నరికారని పేర్కొనారు. అలాగే ఆ ప్రాంతంలో భూముల సమస్యలు పరిష్కారం కావాలంటే లింగాపూర్ నుండి జవహర్నగర్ వరకు ఉమ్మడి సర్వే నిర్వహించి ఎంజాయ్మెంట్ లిస్టు ఆధారంగా ప్రతి రైతుకు హక్కులు కల్పించి కాస్తు కబ్జా లేని పట్టాదారుల పట్టాలు రద్దు చేసి ప్రతి ఒక్క రైతుకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సర్వే పూర్తిగా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగితేనే అందరికి న్యాయం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు వెంటనే స్పందించి భూ ఆక్రమణదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరిశీలన బృందంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజద్ పాష, గఫూర్, సిపిఐ ములుగు, వెంకటాపూర్ మండల కార్యదర్శులు ముత్యాల రాజు, బండి నర్సయ్య, సిపిఐ నాయకులు బోడ రమేష్, మామిడి నటరాజ్, బాధిత రైతులు, కంకల మల్లమ్మ, కంకల రమేష్, కొరిమి భూమిరెడ్డి, హద్దుల రైతులతు గుజ్జులక బాలకృష్ణ, బాధిత రైతులు రామిరెడ్డి, జంపాల మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## మామునూరులో మెరిసిన గ్రూప్–1 ర్యాంకర్



**ప్రజాపక్షం/వరంగల్టౌన్ :** వరంగల్ జిల్లా ఖిల్లా వరంగల్ మండలం మామునూరు కి చెందిన గాలి రాహుల్ ఇటీవల టిజిపిఎస్సి విడుదల చేసిన గ్రూప్1 జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ లో 555వ ర్యాంక్ సాధించి, మల్టీ జోన్ 1 ఎస్సీ కేటగిరి లో 23వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. గాలి రాహుల్ 2023–2024లో టీజీపీ ఎస్సీ నిర్వహించిన ఏవో, జే ఏ ఓ ఎక్సమ్ లో జూనియర్అకౌంట్స్ఆఫీసర్ (జేఏఓ)గా ఎంపిక అయ్యారు. ప్రస్తుతం కొత్తగూడెం మున్సిపల్ ఆఫీసులో జేఏఓగా విధులు నిర్వహిస్తున్నారు. గాలి జయరవికుమార్ దంపతుల చిన్న కుమారుడు రాహుల్ తమ స్వగ్రామం మామునూరులో ఎస్ఎస్సి వరకు హరికృష్ణ హై స్కూల్లో చదివి, వరంగల్లోని సివి రామన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి హన్మకొండ లోని వాగ్దేవి డిగ్రీ కళాశాల లో డిగ్రీ పూర్తి చేశారు.అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్.ఎల్.బి(లా)చదివారు. తన తండ్రి చాలా కష్టపడి చదివించాడని, పెట్రోలు పంపులో పనిచేశాడని, ఉస్మానియా యూనివర్సిటీలో వాచ్మెన్ గా పనిచేశాడని, నిజాం కాలేజీలో అటెండర్గా పని చేసి పోషించాడని రాహుల్ చెప్పుకొచ్చాడు. తన అన్నయ్య గాలి ఉదయ్ కిరణ్ ఎంతో హెల్ప్ చేశాడన్నారు. తల్లి గాలి జయ తనని ఎంతో ప్రోత్సహించిందన్నారు.తన పెద్దనాన్న లా ఫ్యాకల్టీ ,ఉస్మానియా యూనివర్సిటీ మాజీ డీన్గా పనిచేసిన గాలి వినోద్కుమార్ సివిల్స్ ప్రిపేర్ అవమని చెప్పారని రాహుల్ చెప్పుకొచ్చారు. తమ గ్రామం నుండి రాహుల్ గ్రూప్1 ఆఫీసర్ గా ఎంపిక అవడం ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఎస్ఆర్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

**ప్రజాపక్షం/హసన్పర్తి :** ఎస్ఆర్ యూనివర్సిటీ, నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ ఎస్ ఎస్) సంయుక్తగా 2024–2025 సంవత్సరానికి సంబంధించిన ప్రత్యేక శిబిరాన్ని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామం జడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఏప్రిల్ 1నుండి ఏప్రిల్ 7 వరకు ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథి డా. అర్.అర్చన రెడ్డి రిజిస్ట్రార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక బాధ్యత, సమాజానికి, పర్యావరణ అవగాహన పెంపొందించుకోవడానికి లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త డాక్టర్ కె.రవీందర్ మాట్లాడుతూ ప్రత్యేక శిబిరం విద్యార్థుల్లో స్వచ్ఛంద సేవా భావాన్ని,సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలలో పాల్గొనే ప్రేరణను పెంపొందించుకోవడానికి దోహదపడుతుందన్నారు.డాక్టర్ అర్.అర్చనరెడ్డి రిజిస్ట్రార్, డాక్టర్ జి.భూపాల్ రాజ్, డీన్, సో ఏ, డాక్టర్ ఎ. వి.వి సుధాకర్, డీన్, ఎస్ డబ్ల్యూ ప్రధాన ఆదరణదారు, డాక్టర్ కె. రవీందర్ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త సంయోజకుడు, ప్రత్యేక అతిథి పి.సంపత్ జెడ్. పిహెచ్ హెస్ ఎల్లాపూర్, డాక్టర్ అర్.భార్గవ్ ,శిబిరం ఇంచార్జ్ ఏ. శ్రీరామ్ పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకాని పేటలో ఆర్చి పక్క పేకాట ఆడుతున్న సమాచారం మేరకు నెక్కొండ ఎస్సై మహేందర్ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకోవడం జరిగింది. 42 780, నగదు నాలుగు సెల్ ఫోన్లు, ఒక మోటార్ బైక్, ప్యాక్ ముక్కలు, పట్టుకొని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై మహేందర్ తెలిపారు. నలుగురు నిందితులలో మంగిశెట్టి శ్రీను, మాస్ కుమారస్వామి, ఎడ్ల లక్ష్మీనారాయణ, గాజుల జనార్దన్, లు ఉన్నార ఎస్సై మహేందర్ తెలిపారు.

# మత్తు పదార్థాల క్రయ, విక్రయాలపై నిఘా

### వరంగల్ సిపి సన్ప్రీత్సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం హనుమకొండ డివిజన్ పరిధిలోని సుబేదారి, హన్మకొండ, కెయూసి పోలీస్ స్టేషన్లతో పాటు హన్మకొండ ట్రాఫిక్, సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్లను సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా హన్మకొండ డివిజన్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్స్పెక్టర్ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి. స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు వున్నాయి, సెక్టార్వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐని అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పని తీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాల కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలని. ట్రై సిటి పరిధిలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పని చేయాలని. నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకొసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని సూచించారు. హన్మకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి సత్యనారయణ, ఇన్స్పెక్టర్లు సతీష్,సత్యనారయణ,రవికుమార్, సీతారెడ్డి, సువర్ణ ఉన్నారు.

## పేదలకు సన్న బియ్యం అందించడమే లక్ష్యం

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రతి నిరుపేదకుటుంబానికి సన్నబియ్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ శాసనన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున హన్మకొండ 5 వ డివిజన్ రెడ్డి కాలని, 57 వ డివిజన్ గోకుల్ నగర్ లో సన్న బియ్యాన్నిలబ్దిదారులకు పంపిణి చేసారు. నాయిని రాజేందర్రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సన్న బియ్యం కార్యక్రమం అందుబాటు లోకి తెచ్చారు.సన్న బియ్యం పంపిణి కోసం ప్రభుత్వం కిలోకు రూ.40 వరకు ఖర్చు చేసింది. ధనవంతులు తినే సన్న బియ్యం ఇకపై పేదలు కూడా తినే రోజులు వచ్చాయని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి ఉగాది కానుకగా సన్నబియ్యం పంపిణిని లాంచనంగా ప్రారంభించడం జరిగిందని,మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రారంభించడం జరిగిందన్నారు.కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, కాజీపేట తహసిల్దారు భావ్ సింగ్, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని రమేష్ , నాయకులు బంక సంపత్ యాదవ్, అనిత తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## 'సన్నబియ్యం పంపిణీ'ప్రారంభించిన పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న రేషన్ బియ్యాని..ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని పెద్దతండలో మంగళవారం పంపిణీ చేశారు. దీనికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా..హాజరయ్యి లబ్ధిదారులకు అందజేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రాంప్రసాద్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బైరు హరినాథ్ బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, ధరావత్ రామ్మూర్తి నాయక్, మద్ది కిషోర్‌రెడ్డి, తిప్పని రాజశేఖర్‌రెడ్డి, అజ్మీర అశోక్‌నాయక్, భూక్య సురేష్‌నాయక్, మండల అధ్యక్షులు కళ్లెం వెంకట్ రెడ్డి, నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## అవకతవకలు లేకుండా లబ్ధిదారులకు సన్న బియ్యం

సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:**అవకతవకలు లేకుండా లబ్ధిదారులకు సన్న బియ్యం ప్రజలకు అందజేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని 9వ నెంబర్ రేషన్ షాప్ నందు తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, స్వయంగా లబ్ధిదారులకు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఎమ్మార్వో , మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు ఆధ్వర్యంలో పాదయాత్ర



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా గెలుపొందిన పింగళి శ్రీపాల్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పిఆర్‌టియు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. మంగళవారం పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని ఇందిరా నగర్‌లో ఉన్న వినాయక స్వామి దేవాలయం నుండి వైరా పట్టణంలోని పాత శివాలయం వరకు 23 మంది సభ్యులతో కూడిన బృందం పాదయాత్ర ద్వారా చేరుకున్నారు. ఈ బృందానికి వైరా మండల పిఆర్‌టియు అధ్యక్షుడు వెలిశెట్టి నర్సింహారావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం శివాలయంలో ఎంఎల్‌సి పింగళి శ్రీపాల్‌రెడ్డి పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా వైరా రిజార్వాయర్ సమీపాన గల దాసాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీతారామయ్య, కుసుమ నాగేశ్వరరావు, జి. రామారావు, కెవి నాయుడు, టి. రాఘవయ్య, పి. వెంకటరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ వీల్ కేర్ ప్రారంభించిన మేయర్ నీరజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని పాండురంగాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ వీల్ కేర్‌ను మేయర్ పునుకొల్లు నీరజ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్ల వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించి వారి మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. ఎస్ఎస్ వీల్ కేర్ నందు కారుకు సంబంధించి అన్ని రకాల సర్వీసులు, కారు ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయని వాటిని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండవ డివిజన్ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, నల్లమల వెంకటేశ్వరరావు, పోట్ల వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మ్యూజియం సంస్కృతి, సంప్రదాయాలకు తలమానికం

**ప్రజాపక్షం/భద్రాచల:** ఐటిడిఏ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న గిరిజన మ్యూజియం గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు తలమానికంగా మారనుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐటిడిఏ ప్రాంగణంలో నిర్మాణం అవుతున్న గిరిజన మ్యూజియాన్ని ఐటిడిఏ పిఓ రాహుల్, ఏఎస్‌పి రోహిత్ రాజ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన పూర్వికుల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, అడవి తల్లి ఒడిలో సాగిపోయిన జీవనం విధానం నేటి గిరిజన యువతకు అవగాహన కల్పించేందుకు అక్కడి మ్యూజియాన్ని రూపొందించడం అభినందనీయం అన్నారు. ఖండాంతరాలకు ఈ సంస్కృతి సంప్రదాయాలను తెలిపే విధంగా రూపొందించడం జిల్లాకే గర్వకారణం అన్నారు. శ్రీరామ నవమి, పట్టాభిషేక మహోత్సవాలకు వచ్చే భక్తులు గిరిజన మ్యూజియాన్ని కూడా వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం పిఓ మాట్లాడుతూ చిన్న పిల్లలకు బోటింగ్, క్రీడా స్థలం, ఆహారపు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిని టూరిజం స్పాట్‌గా చేసేందుకు కసరత్తు చేస్తున్నామనిచెప్పారు.కార్యక్రమంలో ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, ఏపిఓ , తహసీల్దార్ , ఐటిడిఏ యూనిట్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎంఎల్ఏ డా.తెల్లం



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఇది ముమ్మాటికీ పేదల ప్రభుత్వమని, పేదలకు సరైన పౌష్టికాహారాన్ని అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ పేదల ప్రభుత్వమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు నిరూపించారని చెప్పారు. ప్రజలు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని, ప్రజల అవసరాలను గుర్తించి తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సొంతింటి కల నెరవేర్చండి

* కోర్ట్ రోడ్డు, త్రిమాత టెంపుల్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించండి
* 17 కమ్యూనిటీహాళ్ళ నిర్మాణానికి స్థలాలు కేటాయించాలి
* వీకే ఉపరితల గని సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టేందుకు చర్యలు చేపట్టాలి
* కొత్తగూడెం ఎమ్మెల్యే, గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షుడు కూనంనేని
* సింగరేణి ప్రధాన కార్యాలయం లో సంస్థ సిఎండి బలరాంతో ఆయన భేటీ



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సంస్థ అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల సొంతింటి కల నెరవేర్చేవిధంగా చర్యలు చేపట్టాలని, అదే విధంగా సంస్థకు సేవ చేసి పదవి విరమణ పొందిన కార్మికులు నివసిస్తున్న క్వార్టర్లను పూర్తిస్థాయిలో కేటాయించి గృహవసతి కల్పించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను కోరారు. సంస్థ ప్రధాల కార్యాలయంలో మంగళవారం సిఎండితో సమావేశమై కార్మికులు, మాజీ కార్మిక కుటుంబాలు, కోల్ బెల్ట్ ప్రాంతాల సంబందించిన పలు అంశాలను అయన దృష్టికి తీసుకెళ్లారు. తన ప్రతిపాదనలను లేఖల రూపంలో అధికారికి అందించారు. మూడుగంటలపాటు సుదీర్ఘంగా చర్చించిన అనంతరం కూనంనేని మాట్లాడుతూ సంస్థలో పనిచేసి పదవి విరమణ పొందిన కార్మికులకు నిలువ నీడలేని పరిస్థితులు నెలకొంటున్నాయని, కార్మికులకు సొంతింటి పథకాన్ని అమలు చేస్తామని గతంలో ఐటీయూసీతో జరిగిన ఒప్పందాన్ని సిఎండి చేశామన్నారు. కార్మికులు పదవి విరమణ పొందిన అనంతరం వారు నివసిస్తున్న క్వార్టర్లను వారికి కేటాయించి యాజమాన్య హక్కు కల్పించాలని కోరామని తెలిపారు. పోస్టాఫీసు సెంటర్ నుంచి హేమచంద్రాపురం ఉన్న రోడ్డు బొగ్గు లారీల రాకపోకల వాళ్ళ పూర్తిగా శిధిలమైందని, తరచు ప్రమాదాలు చోటుచుకుంటున్నందున ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి, డివైడర్తోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలనీ అదేవిధంగా బస్టాండు సెంటర్ నుంచి త్రిమాత టెంపుల్ వరకు ఉన్న రోడ్డును కూడా విస్తరించి డివైడర్లు ఏర్పాటు చేసే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కొత్తగూడెం ప్రాంతంలో 17 కమ్యూనిటీ హాళ్ల నిర్మించేందుకు ప్రతిపాదించామని అందుకు కావాల్సిన స్థలాలని యాజమాన్యం కేటాయించాలని, కొత్తగూడెం, రామవరం ప్రాంతాల్లో వున్నా కమ్యూనిటీ హాళ్లను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనీ కోరామన్నారు. ఎంజి రోడ్డులోని సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్సును ఆధునిక పద్దతిలో నిర్మాణం చేయాలనీ, ఇక్కడి ప్రజల అవసరాల దృష్ట్యా సంస్థ ఆధ్వర్యంలో మల్టిప్లక్సు నిర్మాణం చేపట్టాలని కోరామన్నారు. త్వరలో ప్రారంభం కానున్న వికె ఉపరితల గని నిర్వహణను సంగరేణి యాజమాన్యమే చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని, ప్రేవేటు సంస్థలకు అప్పగిస్తే అడ్డుకుంటామని సిఏండికి తెలిపామన్నారు. తమ ప్రతిపాదనలపై సిఏండి సానుకూలంగా స్పందించారని, త్వరలో వీటి అమలుకు యాజమాన్యం చర్యలు చేపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజ్ కుమార్, నాయకులు కె.సారయ్య, వట్టికొండ మల్లికార్జున్ రావు, ఎస్‌వి రమణమూర్తి, సందెబోయిన శ్రీనివాస్, సింగరేణి డైరెక్టర్ పా వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్లు రాధాకృష్ణ, రాజేశ్వర్ రావు, సూర్యనారాయణ తదితరులు వున్నారు.

## నేటి తరానికి వెంకటలాలయ్య సేవలు తెలియాలి

బాగం హేమంతురావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :**యాసా వెంకటలాలయ్య గ్రామానికి చేసిన సేవలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జాతీయసమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. మండల పరిధిలోని తనికెళ్లలో తనికెళ్ల గ్రామ ప్రథమ సర్పంచ్ యాసా వెంకటలాలయ్య 35వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య ఆవిష్కరించగా తనికెళ్ల సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బాగం ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. దళితులు గ్రామానికి దూరంగా ఉండటంతో పార్టీ నిర్ణయానికి కట్టుబడి రాష్ట్రీయప్రధాన రహదారిప్రక్కన గల 12 ఎకరాల వ్యవసాయభూమిని ఇండ్ల స్థలాలకు ఇచ్చిన ఘనత ఆయనదని పేర్కొన్నారు. తాగునీటికి ఇబ్బందిపడుతున్న రోజుల్లో తన సొంతడబ్బుతో వడ్డెర కాలనీ, గౌడ్‌బజార్, గొల్లబజార్, ఎస్సీ కాలనీయందు బావులు తవ్వించి నీటిఎద్దడిని తగ్గించిన వ్యక్తి అని కొనియాడారు. జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతు నాడు నిస్వార్థంగా పార్టీకి వారు వేసిన పునాదులే ఈరోజుకి పార్టీకి ఆదరణ ఉందని అన్నారు. విద్యాభివృద్ధికోసం విశాలమైన స్థలాలను విద్యాశాఖకు అప్పగించారని అధికారంలో లేకున్నా ఈగ్రామంలో సుమారు వంద ఎకరాల ఇండ్లస్థలాలను పంచిపెట్టిన ఘనత కమ్యూనిస్టుపార్టీకే దక్కిందని అన్నారు చుట్టుప్రక్కల గ్రామాలకు బలమైన కేంద్రంగా తనికెళ్ల ఉండేదని వచ్చే పంచాయతీ ఎన్నికల్లో తిరిగి ఎర్రజెండాను గెలిపించడం ద్వారా ఇలాంటి నాయకులకు నిజమైన నివాళి అర్పిద్దామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు యర్రాబాబు, దొండపాటి రమష్, తాటి వెంకటేశ్వర్లు, పివిరావు, ఉపాధ్యాయసంఘం నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కొణపర్తి విష్ణుమూర్తి, వెంకటలాలయ్య కుమారులు తదితరులు పాల్గొన్నారు.

## 'రాజీవ్ యువ వికాసం'గడువు పొడిగింపు:కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** రాజీవ్ యువ వికాసం పథకం క్రింద దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 14 వరకు గడువు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. నిరుద్యోగ యువతపై పెద్ద మొత్తంలో ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తూ రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు.రాజీవ్ యువ వికాసం పథకం పొందేందుకు గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయ పరిమితి రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాలలో రెండు లక్షల లోపు ఉండాలని తెల్ల రేషన్ కార్డులో దరఖాస్తుదారుని పేరు లేని పక్షంలో మాత్రమే ఆదాయ సర్టిఫికెట్ సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయేతర పథకాలకు అభ్యర్థుల వయస్సు 21 నుంచి 55 ఏళ్ల మధ్యలో ఉండాలని వ్యవసాయ అనుబంధ రంగాల యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి 60 సంవత్సరాల వరకు సడలింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఐదేండ్లకు కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే ఉపాధి పథకం మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, రవాణా రంగ పథకాలకు శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ పథకాలకు పట్టాదారు పాసుపుస్తకం, దివ్యాంగుల సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, దుర్బల సమూహ ధృవీకరణ మండల శాఖ కమిటీ ద్వారా జారీ చేసిన పత్రంతో పాటు ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలన్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసిన తర్వాత వారికి మంజూరు పత్రాలు జారీ చేయడంతో పాటు యూనిట్ గ్రౌండింగ్, వ్యాపార నిర్వహణలో పాటించాల్సిన సూత్రాలపై శిక్షణ అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల యువకులు నిర్ణీత గడువు లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## రామభక్తులకు సకల సౌకర్యాలు

కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాచలం :**శ్రీ సీతారామ నవమిని పురస్కరించుకుని రామభక్తుల కోసం సకల సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన రామాలయ పరిసరాల్లో గల మిథిలా స్టేడియంలో జరుగుతున్న పనులను ఐటిడిఏ పిఓ రాహుల్, ఎస్‌పి రోహిత్ రాజ్, ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలన్నీ దృష్టిలో పెట్టుకుని మొట్టమొదటి సారిగా మిస్ట్ ఫాగింగ్ (పొగ మంచు) ఏరాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిఐపి, విఐపి, భక్తులు కూర్చునే స్వామివారి కళ్యాణాన్ని తలకించేందుక సెక్టార్ల వారీగా ఏర్పాటు చేయాలన్నారు. కళ్యాణం, పట్టాభిషేకాన్ని ముగించుకుని భక్తులు సంతోషంగా తిరిగి వెళ్లేలా ఆహ్లాదకరమైన వాతావారణాన్ని కల్పించాల్సిన బాధ్యత మనదే అన్నారు. మంచినీరు, మజ్జిక ప్యాకెట్లను భక్తులు అందించాలని, ఇందు కోసం స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని చెప్పారు. ప్రధానంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఇందు కోసం గ్రామపంచాయితీతో పాటు ఇతర సిబ్బంది కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే కదులు, టెంట్లు, సేదతీరే సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ప్రసాదాలు, తలంబ్రాలు అందరికీ అందేలా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గోదావరి తీరంలో జాగ్రత్తలు పాటించాలని, పోలీస్ బందు బస్తు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి, ఆర్డిఓ , తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాబోయే రోజులు ఎర్రజెండావే...

సిపిఐ నేతలు మొహమ్మద్ మౌలానా, దండి సురేష్




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్పోరేట్ విధానాలపై నిస్వార్థంగా ప్రజలపక్షాన పోరాడే కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉండాలని రాజకీయ విశ్లేషకులు, ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారని, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని మద్దులపల్లిలో గ్రామశాఖ మహాసభను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత మద్దులపల్లిగ్రామంలో, మహాసభ ప్రాంగాణం వద్ద ఏర్పాటు చేసిన అరుణ పతాకాలను మౌలానా, సురేష్ ఆవిష్కరించారు. అనంతరం శాఖ కార్యదర్శి రెంటాల శ్రీరాముల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు...100సంవత్సరాల క్రితం భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించినప్పటికీ ఏనాడు అధికారం పదవుల కోసం వెంపర్లాడలేదన్నారు. కేవలం పేద ప్రజల పక్షాన ఎర్రజెండా చేతబట్టి నాటి నుంచి నేటి వరకు పోరాడుతూ అజరామరంగా నిలిచిందన్నారు. కమ్యూనిస్టులకు ఎంపి, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధి, అధికారం అనే పదవులు అవసరం లేదని ఎర్రజెండా చేతబట్టి ప్రజల సమస్యలపై చేసే పోరాటమే అతి పెద్ద పదవి అన్నారు. ఈ సందర్భంగా మహాసభను నిర్వహించిన మద్దులపల్లిశాఖను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సిపిఐ శాఖ కమిటీతో పాటు ఎఐటియుసి, ఎఐవైఎఫ్, మహిళా సమాఖ్య నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు శాఖ నాయకులు , ఎఐవైఎఫ్ పాలేరు నియోజకవర్గ సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం అందించేందుకు సన్న బియ్యం పంపిణీ

ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజలకు పౌష్టికాహా రం అందించేందుకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని మేయర్ పునుకొల్లు నీరజ తె లిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని చర్చికాంపౌండ్ ప్రాంతంలో ఉన్న రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీని మేయర్ పునుకొల్లు నీ రజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు పో షక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ధనవంతులు తినే సన్న బియ్యాన్ని పేదలకు పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే నేటి నుంచి పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని ఆమె తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీని ఖమ్మంజిల్లాలోని 748 చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఏ చౌక దుకాణం నుండైనా పోర్టబిలిటి ద్వారా రేషన్‌కార్డు దారులు సన్నబియ్యాన్ని తీసుకోవచ్చునని తెలిపారు. గత ఖరీఫ్ (వానాకాలం) 2024 25 సీజన్ నందు ఖమ్మంజిల్లాలో 51312 మంది రైతుల వద్ద నుంచి 295608 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అందులో సన్న రకం ధాన్యం 272674 మెట్రిక్ టన్నులను 47494 మంది రైతులకు బోనస్ రూపంలో రూ.136333000 కోట్లను బోనస్ రూపంలో రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిటి విజయ్‌బాబు, ఆర్ఐ వహిద్, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు

## ఉమ్మడి జిల్లాలో ఫుల్‌గా తాగేశారు




**ప్రజాపక్షం/ఖమ్మం :**వైరా మద్యం డిపోనందు 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 ఆర్థిక సంవత్సరానికి రూ 2290 కోట్ల 51 లక్షల మద్యం అమ్మకాలు జరిగాయి. గతంతో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. 29,38,191 వేల మద్యం లిక్కర్ కేసులు, 1900704 కేసుల బీర్లు అమ్మకాలు జరిగాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెద్ద ఎత్తున అమ్మకాలు జరగడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం పెరిగింది. పండుగలు, ఫంక్షన్‌లకు తెగతాగేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వైరా మద్యం డిపోకు మద్యం అమ్మకాల్లో ప్రత్యేక గుర్తింపు వచ్చినట్లు సమాచారం.

## ప్రజారోగ్యంతో చెలగాటం !

* ఎస్‌టిపి వ్యవస్థకు తిలోదకాలు
* ధనార్జనే ధ్యేయంగా ఆసుపత్రుల నిర్వహణ
* నిద్రావస్థలో అధికార యంత్రాంగం




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆసుపత్రుల యజమాన్యాలు కొన్ని ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉండడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రుల నుంచి వచ్చే వ్యర్థ జలాలు నేరుగా డ్రైనేజీల్లో కలుస్తున్నాయి. తద్వారా ప్రజలు వివిధ వ్యాధులకు గురవుతున్నారు. ఆసుపత్రులకు అనుమతి ఇచ్చేముందు ఎస్‌టిపి (మురుగునీటి శుద్ధి కర్మాగారం) ఉంటేనే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది లేకపోతే ఆసుపత్రులకు అనుమతి ఇవ్వకూడదన్న నిబంధన ఉంది. కానీ చాలా ఆసుపత్రులు అనుమతులు పొందే సమయంలో ఎస్‌టిపిని ఏర్పాటు చేయడం ఆ తర్వాత నిర్వహణను పట్టించుకోకుండా గాలికి వదిలేస్తున్నారు. ఆసుపత్రుల్లో వాడుతున్న వ్యర్థ జలమ ంతా శుద్ధి కాకుండానే నేరుగా డ్రైనేజీలోకి చేరుతుంది. దీ ని ప్రభావం ప్రత్యక్షంగా పలు వ్యాధులకు కారణమవుతు ంది. ప్రతి నెల వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఖచ్చితంగా ఎస్‌టిపిలను పరిశీలించాల్సి ఉంటుంది. కొన్ని ఆసుపత్రు లు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయి. రోగం వ చ్చిందంటే ఆస్తులు అమ్మితే తప్ప నయం కాని పరిస్థితి ఏ ర్పడింది. 20 నుంచి 30 శాతం కమిషన్ దాటి ఇప్పుడు 50 శాతం కమిషన్‌కు చేరిపోయిందట. 50 శాతం కమిషన్ ఇవ్వడంతో పాటు తమ ఆసుపత్రి నిర్వహణ, లాభాలను దృష్టిలో ఉంచుకుని రోగి వద్ద నుంచి సాధారణంగా అయ్యే ఖర్చు కంటే మూడురెట్లు అదనంగా వసూలు చేస్తున్నారు. ఖమ్మంలో రెండు మూడు ఆసుపత్రులు మినహా మిగిలిన వారంతా ఆర్ఎంపిల సేవలో తరిస్తూ కాకులు కొట్టి గద్దలకు వేసినట్లు రోగుల వద్ద దోచుకుని ఆర్ఎంపిలకు దోచిపెడుతున్నారు. వైద్యానికి సరిపడ డబ్బులు వచ్చిన ఆర్ఎంపికి ఇవ్వాల్సిన కమిషన్ సరిపడ రాలేదని మృతదేహాన్ని పది గంటల పాటు ఆసుపత్రిలోనే ఉంచుకుని చివరకు శోకసంద్రంలో ఉన్న మృతుని కుటుంబ సభ్యుల వద్ద నుంచి డబ్బులు పిండి కాని మృతదేహాన్ని అప్పగించలేదంటే ఆసుపత్రుల్లో ఎంతటి అమానవీయ ఘటనలు చోటు చేసుకుంటున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉంది. అవసరం లేని చోట ఆర్ఎంపి చెప్పాడని ఆపరేషన్, ఆర్ఎంపి చెప్పాడని మూడు రోజులు ఆసుపత్రిలో ఉంచుకోవడం అవసరం లేకపోయినా ఐసియుకి రిఫర్ చేయడం ఇవ్వన్ని రోగిని పరీక్షించిన వైద్యులు నిర్ణయించడం లేదు. ఆర్ఎంపి వ్యవస్థ మొత్తం వైద్య రంగాన్ని శాసిస్తుంది. కాసుల కోసం కక్కుర్తిపడుతున్న ఆసుపత్రుల యజమాన్యాలు కనీసం మానవత్వం లేకుండా రోగం వచ్చిందంటే ఎలా డబ్బులు పిండాలో ఆర్ఎంపి చెబుతుంటే అదే పంథాను ఆసుపత్రులు అవలంభిస్తున్నాయి. రోగులారా తస్మాత్ జాగ్రత్త. వారితో వచ్చారా ఆస్తులు అమ్ముకోవాల్సిందే.

క్రీడ

# ఆపద్బాంధవులైన పూరన్, బదోని

## పంజాబ్ టార్గెట్ 172



హిట్టర్లతో నిండిన లక్నో సూపర్ జెయింట్స్ పెద్ద స్కోర్ చేయలేకపోయింది. పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్(343) విజృంభణతో ఆది నుంచి తడబడుతూ సాగింది. పవర్ ప్లేలోనే 3 కీలక వికెట్లు కోల్పోయిన జట్టును నికోలస్ పూరన్(44), ఆయుష్ బదోని(41)లు ఆదుకున్నారు. పంజాబ్ స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొంటూ లక్నో స్కోర్‌బోర్డును ఉరికించారు. అర్ధ సెంచరీకి ముందు పూరన్ ఔటైనా.. అబ్దుల్ సమద్(27)తో కలిసి బదోని సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో, పంత్ సేన నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేయగలిగింది. టాస్ ఓడిన లక్నోకు పంజాబ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఆదిలోనే షాకిచ్చాడు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే డేంజరస్ మిచెల్ మార్ష్(0)ను ఊరించే బంతితో పెవిలియన్ పంపాడు. మార్ష్ ఔటయ్యాక ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్(28) ధాటిగా ఆడాడు. వరుసగా బౌండరీలతో చెలరేగిన అతడిని ఫెర్గూసన్ ఔట్ చేసి బ్రేకిచ్చాడు. అంతే.. 32 కే వికెట్లు.. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్ (2)ను మ్యాక్స్‌వెల్ బోల్తా కొట్టించాడు. 353తో పీకల్లోతు కష్టాల్లో పడిన జట్టును పూరన్ ఆదుకున్నాడు. డేవిడ్ మిల్లర్(19), అయుష్ బదోని(41)తో కలిసి జట్టు స్కోర్ 50 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అర్థ శతకానికి చేరువైన పూరన్‌ను చాహల్ వెనక్కి పంపి లక్నో కష్టాలను మరింత పెంచాడు. అయితే.. బదోని సాధికారక ఇన్నింగ్స్ ఆడాడు. అబ్దుల్ సమద్(27)తో కలిసి 47 పరుగులు జోడించాడు. ఎడాపెడా బౌండరీలతో చెలరేగి వీళ్లిద్దరు జట్టు స్కోర్ 150 దాటించారు. వీళ్ల విధ్వంసంతో లక్నో 180 ప్లస్ కొట్టడం ఖాయమనిపించింది.

కానీ, 20 ఓవర్లో అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయడంతో లక్నో7 వికెట్ల నష్టానికి 171కే పరిమితమైంది.

## వచ్చే వన్డే వరల్డ్ కప్ ఆడుతా

### వీడ్కోలు వార్తలకు కోహ్లీ చెక్





భారత జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అభిమానులకు తీపి కబురు చెప్పాడు. తన వీడ్కోలు గురించి ప్రచారమవుతున్న వదంతులను తోసిపుచ్చాడు. టీ20లకు రిటైర్మెంట్ పలికిన తాను వన్డేలకు అందుబాటులో ఉంటానని, వచ్చే వన్డే వరల్డ్ కప్‌లోనూ ఆడతానని చెప్పాడు విరాట్. ఐపీఎల్ 18వ సీజన్‌లో చెలరేగి ఆడుతున్న కోహ్లీ తాజాగా ఒక ఈవెంట్‌కు హాజరయ్యాడు. అక్కడ నిర్వాహకులు, అభిమానులు అతడిని 'మీ సుదీర్ఘ కెరియర్‌లో తర్వాతి పెద్ద అడుగు ఏంటీ?' అని అడిగారు. అందుకు.. తర్వాతి బిగ్ స్టెప్ అంటే.. ప్రస్తుతానికి కచ్చితంగా ఫలానా అని చెప్పలేను. కానీ, వచ్చే వరల్డ్ కప్ గెలవాలని ఉంది. అదే బహుశా నా కెరియర్‌లో మరో పెద్ద అడుగు అని బదులిచ్చాడు కోహ్లీ. అతడి సమాధానం విన్న అక్కడివారంతా చప్పట్లు కొడుతూ భారత స్టార్ ప్లేయర్‌కు మద్దతు తెలిపారు.

వెస్టిండీస్ గడ్డపై నిరుడు టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన విరాట్.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. సఫారీలను ఓడించి ట్రోఫీ గెలుపొందిన తర్వాత భావోద్వేగానికి గురైన అతడు.. పొట్టి ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. అతడిని అనుసరిస్తూ కెప్టెన్ రోహిత్ శర్మ, రవీంద్ర జడేజాలు టీ20లకు వీడ్కోలు పలికారు. అప్పటి నుంచి వన్డేలు, టెస్టులకు మాత్రమే అందుబాటులో ఉంటున్నారీ సీనియర్ త్రయం. అయితే.. ఈ మధ్యే ఈ ముగ్గురి సెంట్రల్ కాంట్రాక్ట్‌లో మార్పులు తథ్యమనే వార్తలు వినిపించాయి. ప్రస్తుతం ఏ ప్లస్ విభాగంలో ఉన్న విరాట్, రోహిత్, జడ్డూలను ఏ కేటగిరీ ఆటగాళ్లుగా పరిగణించాలని బీసీసీఐ భావిస్తుందనే కథనాలు ప్రసారమయ్యాయి. ఈ నేపథ్యంలో తాను దక్షిణాఫ్రికా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలని భావిస్తున్నట్టు విరాట్ చెప్పడంతో రిటైర్మెంట్ ఇప్పట్లో లేనట్టే అని అభిమానులు మురిసిపోతున్నారు. ప్రస్తుతం 36 ఏళ్లున్న కోహ్లీ.. ఫిట్‌నెస్ రీత్యా, ఫామ్ రీత్యా.. వరల్డ్ కప్ టోర్నీలో ఆడేందుకు అన్ని విధాలా అర్హుడే. ఇప్పటికే 2011 వన్డే వరల్డ్ కప్, 2013 ఛాంపియన్స్ ట్రోఫీ, ఈమధ్యే ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపొందిన జట్టులో సభ్యుడైన విరాట్ మరొక వరల్డ్ కప్ ఆడి.. ట్రోఫీని ముద్దాడితే చూసి తరించాలని ప్రతి ఒక్కరి కోరిక.




## మెగా 157: ఇది చాలదు..

మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఇపుడు చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో లేటెస్ట్‌గా ఉగాది కానుకగా అనౌన్స్ అయ్యిన చిత్రం మెగా 157 కూడా ఒకటి. బ్లాక్ బస్టర్ దర్శకుడు అనీల్ రావిపూడితో అనౌన్స్ చేసిన ఈ చిత్రంపై మంచి హైప్ ఆల్రెడీ నెలకొంది. ఇక ఈ సినిమా ఇలా ముహూర్త కార్యక్రమాలతో స్టార్ట్ అయ్యిందో లేదో అనీల్ రావిపూడి ఈ స్టార్టింగ్ తోనే తన మార్క్ ప్రమోషన్స్‌ని స్టార్ట్ చేసాడు. మన టాలీవుడ్‌లో అనీల్ రావిపూడి మార్కెటింగ్ ఆడియెన్స్‌లోకి స్యూర్ షాట్‌గా నచ్చేలా ఉంటుంది. గతంలో సంక్రాంతికి వస్తున్నాం ప్రమోషన్స్ చూసి అంతా ఒకింత ఆశ్చర్యానికి కూడా లోనయ్యారు. మరి ఇదే ఫార్మాట్‌లో చిరు సినిమాపై ఓ క్రేజీ వీడియో రిలీజ్ చేశారు. చిరుపై కొన్ని ఐకానిక్ పాత్రలు వాటితో సినిమా మెయిన్ టీమ్ అంతటినీ పరిచయం చేస్తూ ప్లాన్ చేసిన వీడియో మాత్రం సూపర్ ఎంటర్టైనింగ్ గా ఉందని చెప్పాలి. ఇక ఇందులో మెగాస్టార్ ఎనర్జీ కానీ కామెడీ టైమింగ్ కానీ అదిరిపోయాయి. అలానే లాస్ట్‌లో అనీల్ తో ఇది చాలదు అంటూ తన మార్క్ కామెడీ టైమింగ్‌తో రఫ్ఫాడించాల్సిందే అంటూ రివీల్ చేసిన ఈ వీడియో మెగా ఫ్యాన్స్‌కి మంచి కిక్ అందిస్తుంది. ఇక షూటింగ్ అతి త్వరలోనే స్టార్ట్ కానున్నట్టుగా మేకర్స్ కన్ఫర్మ్ చేయగా వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

## అల్లు అర్జున్ - త్రివిక్రమ్ మూవీ.. అధికారిక అప్‌డేట్..

'పుష్ప 2'లో తన మాస్ యాక్షన్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించారు అల్లు అర్జున్. ఈ చిత్రం భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో తర్వాత చేయనున్న సినిమాపై ఆసక్తి నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌పై తాజాగా నిర్మాత నాగవంశీ ఓ అప్‌డేట్ పంచుకున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో బన్ని ఓ మూవీ చేయనున్న విషయం తెలిసిందే. ఇది పూర్తిగా మైథలాజికల్ జానర్ అని నాగవంశీ అన్నారు. సోషియో ఫాంటసీ చిత్రం కాదన్నారు. పురాణాల ఆధారంగానే అన్ని సన్నివేశాలు ఉంటాయన్నారు. అక్టోబర్ నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని స్పష్టం చేశారు. ఇక ఈ సినిమాలో బన్ని.. కుమారస్వామిగా కనిపించనున్నారంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. ఇప్పుడు నాగవంశీ కూడా మైథలాజికల్ జానర్ అని చెప్పడంతో బన్ని లుక్ ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఎక్స్‌లోనూ ఈ హీరో కుమారస్వామిగా ఉన్న జీబ్లీ ఇమేజ్‌లు ట్రెండ్ అవుతున్నాయి.



### 'కెజియఫ్' స్థాయిలో 'కింగ్‌డమ్'..

ఇదే ప్రెస్‌మీట్‌లో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్‌డమ్' గురించి కూడా నాగవంశీ మాట్లాడారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రానున్న ఆ సినిమాలో యాక్షన్ సన్నివేశాలు 'కేజీయఫ్' స్థాయిలో ఉంటాయన్నారు. వాటికే అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆ సినిమాలో అన్ని లాజిక్‌లు ఉంటాయని.. సందేహాలన్నింటికీ గౌతమ్ తన వర్క్‌తో సమాధానమిస్తారని చెప్పారు. ఇది కచ్చితంగా హిట్ అవుతుందన్నారు. అలాగే రవితేజ హీరోగా తెరకెక్కుతున్న 'మాస్ జాతర' అనుకున్న సమయానికే రాకపోవచ్చని నాగవంశీ తెలిపారు. జులైలో ప్రేక్షకుల ముందుకు వస్తుందన్నారు.

రీల్

## ఆ సీన్ వల్లే సిమ్రాన్ జీవితంలో బ్రేకప్?



అందాల ముద్దుగుమ్మ సిమ్రాన్ సిమ్రాన్.. ఇప్పటి తరానికి తెలీదు కానీ.. అసలు ఒకప్పుడు సిమ్రాన్ అంటే సంచలనం. 90,2000ల దశకాల్లో సిమ్రాన్ అంటే అభిమానులు పిచ్చెక్కిపోయేవారు. హీరో ఎవరా అని కూడా ఆలోచించకుండా సిమ్రాన్ కోసమే ప్రేక్షకులు థియేటర్స్‌కి వెళ్లేవారు.. అయితే బ్రహ్మచారి అనే సినిమాలో కమల్ హాసన్‌తో లిప్‌లాక్ సీన్ చేయడం రాజు సుందరంతో ఆమె సంబంధాన్ని దెబ్బతీసిందని అప్పట్లో ఎన్నో వార్తలు వచ్చాయి. సిమ్రాన్‌ను కమల్‌కు దూరంగా ఉండాలని రాజ సుందరం ఆదేశించిన ఆమె కమల్‌తో క్లోజ్‌గా మూవ్ కావడం తోనే రాజ సుందరం బ్రేకప్ చెప్పినట్టు అప్పుడు జోరుగా ప్రచారం సాగింది. మరోవైపు కమల్ హాసన్, సారిక నుంచి విడిపోయిన తర్వాత సిమ్రాన్‌తో ప్రేమలో పడ్డారని, అయితే ఇద్దరి మధ్య కొన్ని భిన్నాభిప్రాయాలు రావడం వల్ల.. కమల్ హాసన్ తన ప్రేమను గౌతమీతో కంటిన్యూ చేశారనే ప్రచారం కూడా సాగింది. ఇక రాజ సుందరంతో బ్రేకప్ తర్వాత సిమ్రాన్ దీపక్ బగ్గా అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. ప్రస్తుతం తమిళంలో పలు షోలకు సిమ్రాన్ జడ్జీగా వ్యవహరిస్తున్నారు.

## సినిమాలు ఓకే.. కానీ గుర్తింపు ఎక్కడ?



టాలీవుడ్‌లో వరుస సినిమాల్లో ఛాన్స్ దక్కించుకుని మంచి పాత్రలతో ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేసినా ఓ యాక్టర్‌కు అనుకున్న స్థాయిలో గుర్తింపు మాత్రం రావడం లేదు. మలయాళంలో విలక్షణ యాక్టర్‌గా పేరు తెచ్చుకున్న నటుడు షైన్ టామ్ చాకో టాలీవుడ్‌లోనూ వరుస చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. మీడియం, భారీ రేంజ్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు షైన్ టామ్ చాకో తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. విలన్ పాత్రలతో పాటు మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రల్లోనూ ఈ యాక్టర్ కనిపిస్తున్నాడు. కానీ, ఆయనకు తగిన గుర్తింపు రావడం లేదని ఆయన పర్ఫార్మెన్స్ చూసిన వారు చెబుతున్నారు. దసరా చిత్రంతో విలన్ పాత్రలో తనదైన పర్ఫార్మెన్స్‌ను ఇచ్చిన ఈ యాక్టర్, ఇటీవల వరుస చిత్రాలలో నటిస్తున్నాడు.

## 6న 'ప్రశ్నించే గొంతులు-పాలకుల అణచివేత'పై సదస్సు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రజా యుద్ధనౌక, దివంగత గద్దర్‌పై 1997 ఏప్రిల్ 6న కాల్పులు జరిపిన సందర్భంగా 'ప్రశ్నించే గొంతులు – పాలకుల అణచివేత' అంశంపై సదస్సును ఏప్రిల్ 6న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు గద్దర్ ఫౌండేషన్ అధ్యక్షులు సూర్యకిరణ్ తెలిపారు. హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో మంగళవారం సదస్సు వాల్ పోస్టర్‌ను సూర్యకిరణ్‌తోపాటు ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ ఆవిష్కరించారు. నాడు గద్దర్‌పై కాల్పులు ఎవరు చేశారనే విషయాన్ని అప్పటి ప్రభుత్వాలు తేల్చలేదని, ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వం గద్దర్‌పై కాల్పులు ఎవరు జరిపారో నిగ్గు తేల్చాలని వారు డిమాండ్ చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని గద్దర్ ఉర్రుతాలూగించారని తెలిపారు. సదస్సులో గద్దర్ అభిమానులు పాల్గొని, విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంవి ఫౌండేషన్ ప్రతినిధులు వెంకట్ రెడ్డి, వినయ్ శంకర్, శ్రీరాములు, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ(ఎం) జాతీయ మహాసభ

(మొదటి పేజీ తరువాయి)

బాలకృష్ణన్ స్మారక మందిరంగా నామకరణం చేశారు. మదురైలో జాతీయ మహాసభలకు ఆతిథ్యం ఇవ్వడం మూడవసారి. ముగింపు రోజున ఆదివారం ప్రదర్శన, బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3వ తేదీన 'సమాఖ్యవాదం భారతదేశానికి బలం' అనే అంశంపై నిర్వహించే సెమినార్‌కు కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, కర్నాటక ఉన్నత విద్యా శాఖ మంత్రి సుధాకర్‌లు ప్రసంగిస్తారు. అదే రోజు సాంస్కృతిక సమ్మేళనంలో ప్రారంభమవుతుంది. మహాసభ చివరి రోజైన ఏప్రిల్ 6న ఎన్.శంకరయ్య మెమోరియల్ గ్రౌండ్‌లోలో బహిరంగ సభను నిర్వహించనున్నారు. సిపిఐ(ఎం) మొత్తం 10,19,009 సభ్యులలో సగానికిపైగా 5.64 లక్షల మంది సభ్యులు కలిగిన కేరళ రాష్ట్రంలో వరుసగా మూడవ సారి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన(ఎల్‌డిఎఫ్) విజయం సాధించేందుకు అంశంపై ప్రతినిధులు చర్చించనున్నారు. అయితే, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని నయా ఫాసిస్టు అని సిపిఐ(ఎం) ముసాయిదా నివేదికలో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. బిజెపి పాలనలో ''నయా ఫాసిస్టు పోకడలు'' పెరుగుతున్నాయని, ''ప్రతీఘాత హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్తూ, ప్రతిపక్షాన్ని, ప్రజాస్వామ్యాన్ని నిరంకుశంగా అణిచివేయడం వంటి చర్యలు నయా ఫాసిస్టు పోకడలను చూపెడుతున్నాయని తెలిపింది. సిపిఐ(ఎం) కేంద్ర కమిటీకి 75ఏళ్ల గరిష్ట వయోఃపరిమితి ఉంది. కేంద్ర కమిటీ పాత, కొత్త నాయకుల కలయికతో ఉండబోతుందని, దీనిని మహాసభ ఎన్నుకుంటుందని ప్రకాశ్ కారాత్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. మహాసభ 83 మంది కేంద్ర కమిటీ సభ్యులను ఎన్నుకుంటుంది. వారి నుంచి 16 మందితో పొలిట్‌బ్యూరో ఎన్నికవుతుంది. ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ఆకస్మిక మృతితో ప్రత్యేక పరిస్థితుల్లో ప్రధాన కార్యదర్శి లేకుండానే జాతీయ మహాసభలు జరుగుతున్నాయి.

# ఆ 400 ఎకరాలు ఎన్నడూ అటవీ భూమి కాదు

### హైకోర్టులో కౌంటర్ వేయనున్న అటవీ శాఖ.. ప్రభుత్వ వర్గాల వెల్లడి



'రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25లోని 2,324.05 ఎకరాలు మొత్తం ప్రభుత్వం భూమి. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ సర్వే నంబర్‌లో భూమిని 'కంచ అస్తాబల్ పోరంబోకు సర్కారి'(ప్రభుత్వ భూమి) అని నమోదైంది. కంచ అంటే పడావు భూమి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యుఒహెచ్)కు 1975లో సర్వే నంబర్ 25లోని మొత్తం భూమిని, అలాగే అదే గ్రామంలోని ఇతర సర్వే నంబర్‌లోని భూమిని స్వాధీనం చేశారు. అయితే, ఆ భూమిపై యాజమాన్య హక్కును ఎన్నడూ యూనివర్సిటీ పేరుపై బదిలీ చేయలేదు. రెవెన్యూ రికార్డు, అటవీ శాఖ రికార్డు ప్రకారం సర్వే నంబర్ 25లోని భూమి ఎన్నడూ 'అటవీ' భూమిగా క్లాసిఫై చేయలేదు' అని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అలాగే అటవీ శాఖ కూడా హైకోర్టులో ఉన్న ప్రజా ప్రయోజన వ్యాజ్యం నేపథ్యంలో అది అటవీ భూమి కాదని కౌంటర్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. గచ్చిబౌలిలో హరిత ప్రదేశం, లంగ్ స్పేస్‌ను కోల్పోతున్నామనే వాదన పూర్తిగా నిరాధారమని, ఆ భూమికి 5 కిలోమీటర్ల రేడియస్‌లో భారీ లంగ్ స్పేస్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆ వర్గాల సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి..2003 ఆగస్టు 9న నాటి ప్రభుత్వం ఐఎంజి భారత ప్రైవేటు లిమిటెడ్‌తో అవగాహన (ఎంఒయు) కుదుర్చుకుంది. ఎంఒయు ప్రకారం గచ్చిబౌలిలోని 400 ఎకరాలను, రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం మామిడిపల్లిలోని 450 ఎకరాలను అప్పగించేందుకు ప్రతిపాదించింది. ఎంఒయు ప్రకారం ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి 534.28 ఎకరాలను తిరిగి తీసుకొని, అందులో 400 ఎకరాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, 134.24 గుంటలను టిజి ఎన్‌జిఒలకు అప్పగించింది. అప్పటి యూనివర్సిటీ రిజిస్ట్రార్ పంచనామాపై 2004 ఫిబ్రవరి 3న సంతకం చేయడంతో, రెవెన్యూ యంత్రాంగ స్వాధీనం చేసుకుంది. ఈ నిర్ణయం సందర్భంగా ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా సర్వే నంబర్ 36లో 191.36 గుంటలు, సర్వే నంబర్ 37లో 205.20 గుంటలు కలిపి మొత్తం 397 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్ అదే రోజున పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నారు. బదులుగా 397 ఎకరాలు తీసుకున్న నేపథ్యంలో 400 ఎకరాల భూమిపై యూనివర్సిటీ తన హక్కులను వదులుకున్నది. ఈ విషయంలో యూనివర్సిటీ సంపూర్ణ అంగీకారంతో ఐఎంజికి భూమిని బదలాయించింది. 2017లో ప్రభుత్వం జనవరి 1వ తేదీన రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు మెమో జారీ చేసి, టిజి టిఎన్‌జిఒకు రోడ్డు వేసేందుకు భూమిని డీమార్క్‌చేయాలని పేర్కొంది. ఆ మెమోపై యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ హైకోర్టులో సవాలు చేయగా, దానిని డిస్మిస్ చేస్తూ వర్సిటీకి 400 ఎకరాలపై ఎలాంటి టైటిల్ లేదని, కాబట్టి ప్రభుత్వ చర్యను సవాలు చేయలేదని తీర్పునిచ్చింది. ఇటీవల సుప్రీం కోర్టు తీర్పుతో టిజిఐఐసికి ఆ 400 ఎకరాలు కేటాయించాలనే అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

**ఆ భూమితో రూ.50వేల కోట్లు పెట్టుబడులు.. 5 లక్షల ఉద్యోగాలు..**

సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన నెల రోజుల్లోనే ప్రభుత్వం రంగంలోకి దిగి భూమిని టిజిఐఐసికి అభివృద్ధి చేసేందుకు అప్పగించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ ప్రాంతంలో ఉండే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చుట్టుపక్కల ఐటి, ఇతర అభివృద్ధికి విపరీతమైన డిమాండ్ ఉందని పేర్కొన్నాయి. ఆ భూమిని అభివృద్ధి చేసి, పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడం ద్వారా రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తుంది. కొంత మంది స్వప్రయోజనాలతో హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తోంది.

## ఆర్‌బిఐ, ప్రభుత్వం మధ్య శాశ్వత భాగస్వామ్యం

### ఆర్‌బిఐ స్మారకోత్సవ ముగింపు కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశం

**న్యూఢిల్లీ :** సాంకేతిక పురోగతులు ఆర్థిక మోసాల ప్రమాదాలను అధికం చేస్తున్నాయని, స్థూల ఆర్థిక స్థిరత్వం సాధనకోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ), ప్రభుత్వం మధ్య చిరకాల భాగస్వామ్యం ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము నొక్కిచెప్పారు. మంగళవారం ఇక్కడ జరిగిన ఆర్‌బిఐ స్మారకోత్సవ ముగింపు వేడుకలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రసంగించారు. సురక్షిత బ్యాంకింగ్ వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడానికి ఆర్‌బిఐ తీసుకుంటున్న సానుకూల క్రియాశీల చర్యలను ఆమె ప్రశంసించారు. సాంకేతిక పురోగతులలో వేగవంతమైన అభివృద్ధితోపాటు ఆర్థిక మోసాల ప్రమాదాలు, సైబర్ బెదిరింపులు కూడా పెరుగుతున్నాయని ముర్ము ఆందోళన వ్యక్తంచేశారు. మనం వీటి నివారణ కోసం మరింత అప్రమత్తం కావాలన్న సంకేతాలు వెలువడుతున్నాయన్నారు. ప్రభుత్వ పాలసీవిధానాల విజన్‌తో సన్నిహితంగా అనుసంధానమై గడచిన 90 ఏళ్లుగా ఆర్‌బిఐ ప్రయాణం విశేషమైనదని ప్రశంసించారు. దేశంలోనే అత్యంత క్లిష్టమైన ముఖ్య సంస్థలలో ఆర్‌బిఐ ఒకటి అని చెప్పడానికి తాను ఏమాత్రం సంకోచించడం లేదని ముర్ము అన్నారు. ధరల స్థిరత్వం, వృద్ధి, ఆర్థిక స్థిరత్వం సహా దేశ అభివృద్ధి అవసరాలను తీర్చడంలో ఆర్‌బిఐపై విశ్వాసం పెంపొందిందన్నారు. నవకల్పనలతో కూడిన ఆర్థిక పర్యావరణ విధానాన్ని ఆచరించడంలో, సులభతరం చేయడంలో రిజర్వ్ బ్యాంక్ ప్రయాణం విశేషమైనదని ఆమె ప్రస్తుతిస్తూ ఇవన్నీ వికసిత్ భారత్ 2047సాధనకు అత్యంత కీలకం అన్నారు. సమావేశంలో ప్రసంగించిన ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఆర్థిక నిర్మాణాన్ని సరైన ఆకృతిలో రూపుదిద్దడానికి రానున్న దశాబ్దం అత్యంత కీలకమైనదని తెలిపారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ ఆర్‌బిఐ భారతదేశ ఆర్థిక పురోగతిలో ఒక పటిష్టమైన స్తంభంగా నిలిచిందన్నారు. ఆర్థిక కార్యదర్శి అజయ్ సేథ్, సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే, మాజీ ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## యువకుడి దారుణహత్య

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల పార్ధసారథికి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగం వచ్చింది. దీంతో గత రెండురోజులుగా ఉగాది. రంజాన్ సెలవులు కావడంతో మంగళవారం భద్రాచలం నుంచి దంతాలపల్లి పాఠశాలకు వస్తున్న క్రమంలో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం శివారు భజనతండా దగ్గర పార్ధసారథి హత్యకు గురయ్యాడు. హత్య చేసిన హంతకులు భద్రాచలం నుంచి వస్తున్న పార్ధసారథిని వెంబడిస్తూ వచ్చారని, అదును చూసి భజనతండా దగ్గర హత్య చేసిఉంటారని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా గతంలోనూ పార్ధసారథిపై భద్రాచలంలో హత్యాయత్నం జరిగినట్లు, తీవ్రంగా దెబ్బలు తగిలి బయటపడ్డాడని సమాచారం. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పలువురు అనుమానిస్తున్నారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. జిల్లా పోలీసు యంత్రాంగం, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో విచారణ ప్రారంభించారు. పోలీసుల విచారణలో హత్య కు సంబంధిచిన కారణాలు, ఆసక్తికర విషయాలు తెలుస్తాయని మహబూబాబాద్ జిల్లా ప్రజలు వేచి చూస్తున్నారు.

## నేడు లోక్‌సభకు వక్ఫ్ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

ఈ బిల్లు విషయంలో మొండిగా వ్యవహరిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలకు విలువ ఇవ్వడంలేదని, తమ గొంతు నొక్కుతున్నారని 'ఇండియా' కూటమి పార్టీ నాయకులు విమర్శించారు.

స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన సమావేశమైన లోక్‌సభావ్యవహారాల సంఘం (బిఎసి) ఎనిమిది గంటలసేపు ఈ వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చ జరపాలని నిర్ణయించిందనీ, సభలో ఆ సమయంలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఈ చర్చా సమయాన్ని పెంచాలని కూడా అంగీకరించినట్లు మంత్రి కిరెన్ రిజిజు మంగళవారంనాడు పాత్రికేయులకు చెప్పారు. చాలా రాజకీయపార్టీలు నాలుగు నుండి ఆరు గంటలపాటు సభలో చర్చకు సమయం ఉండాలని కోరాయని, ఐతే ప్రతిపక్ష ఎంపీలు మాత్రం 12 గంటలు చర్చకు సమయం కేటాయించాలని కోరాయని మంత్రి రిజిజు పాత్రికేయులతో అన్నారు. పరిస్థితిని బట్టి చూసి ఈ చర్చా సమయాన్ని పొడిగిస్తామన్నారు.

ఈ బిఎసి సమావేశంలో అన్ని ప్రధాన ప్రతిపక్షాలకు చెందిన నాయకులు పాల్గొన్నారని చెప్పారు. బుధవారం నాడు సభలో జరిగే ఉద్రిక్త వాతావరణ పరిస్థితి ఈ బిఎసి సమావేశంలోనే సూచనాప్రాయంగా కనిపించింది. కాంగ్రెస్‌తోపాటు 'ఇండియా'' కూటమిలో ఉన్న పలు పార్టీల సభ్యులు సమావేశం నుండి వాకౌట్ చేయడంతో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని అంచనావేస్తున్నారు.

**టిడిపి, జెడి(యు) లాంటి మిత్రపక్షాలకు ప్రజలు గుణపాఠం చెబుతారు**

ఎఐఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ఈ బిల్లును చాలా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సభలో ఆయన ప్రసంగం వాడీవేడీగా ఉంటుంది. ఈ బిల్లు ఏ విధంగా రాజ్యాంగ విరుద్ధమో సభకు తాను వివరించదలిచానని ఈ సందర్భంగా ఒవైసీ పాత్రికేయులతో అన్నారు. ముస్లింల మతస్వేచ్ఛను అడ్డుకునే ఉద్దేశంతోనే ఈ బిల్లును తెచ్చారని విమర్శించారు. తెలుగుదేశంపార్టీ, జెడి(యు) వంటి బిజెపి మిత్రపక్షాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ఐతే రాజకీయంగా ప్రతిపక్షసభ్యులు హోరాహోరీగా తమ వాదన వినిపించినప్పటికీ, తీవ్ర వాగ్వాదాలు జరిగినప్పటికీ, లోక్‌సభలో ఎన్‌డిఎ కూటమికి మూకబలం ఉన్నందువల్ల సంఖ్యాపరంగా బిల్లు ఆమోదం పొందే అవకాశం ఉంది. తమ మాటలను లక్ష్యపెట్టడంలేదని, తమను నిర్లక్ష్యం చేస్తున్నారనీ లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉపనాయకుడు గౌరవ్ గొగోయ్ విమర్శించారు. ప్రతిపక్షాల నుండి ఎంపీలు ఎక్కువమంది మాట్లాడేందుకు ఎక్కువ సమయం కేటాయించాలని, ఎక్కువ సమస్యలు మాట్లాడవలసినవి ఉన్నాయని కోరుతున్నారు. మణిపూర్‌లో పరిస్థితిని కూడా చర్చించేందుకు ప్రతిపక్షాలు పట్టుపడుతున్నాయి. అదేవిధంగా ఓటరు గుర్తింపు కార్డుల సమస్యను కూడా ప్రప్రముఖంగా చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు కోరుతున్నారు.

**ఎవరికెంత బలం ఉంది?**

లోక్‌సభలో ఎన్‌డిఎ కూటమికి 243 మంది సభ్యుల బలం ఉంది. లోక్‌సభలో మొత్తం 542 మంది ఎంపీలు ఉన్నారు. వీరిలో ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల సభ్యుల మద్దతు కూడగట్టడంలో బిజెపి ఇప్పటివరకూ తరచు విజయం సాధిస్తూ వచ్చింది. తెలుగుదేశంపార్టీ, జనతా దళ్ (యు), చిరాగ్ పాశ్వాన్ నాయకత్వానగల ఎల్‌జెపి (రామ్ విలాస్ పార్టీలు ప్రాథమికంగా ఈ బిల్లు విషయంలో కొన్ని కోణాలలో కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. కానీ మొత్తంమీద సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశంలో బిల్లుకు తమ మద్దతు తెలియజేశాయి. జెపిసి సమావేశంలో ప్రధాన మిత్రపక్షాలు ఇచ్చిన సలహాలను కూడా ప్రభుత్వం స్వీకరించి సవరణల్లో చేర్చింది. ఇక రాజ్యసభలో కూడా అంకెలాట ప్రభుత్వానికే వీలుగా ఉంది. బిజెపి నాయకత్వానగల ఎన్‌డిఎకు ఇప్పటికీ రాజ్యసభలో అనుకూల పరిస్థితులే ఉన్నాయి. లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించిన తర్వాత రాజ్యసభకు పంపుతారు. కేథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా, ద చర్చ్ ఆఫ్ భారత్ మంగళవారంనాడు ఈ బిల్లుకు మద్దతుగా సమావేశం జరిపాయి. దీంతో ప్రభుత్వానికి మరింత బలం చేకూరనున్నది. 2024 ఆగస్టు 8వ తేదీన కేంద్రం వక్ఫ్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. 1923 ముస్లమాన్ వక్ఫ్ యాక్ట్, 1995 వక్ఫ్ సవరణ బిల్లులో తమకు అనుకూలంగా మార్పులు చేర్పులు చేయాలన్నదే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఉద్దేశం. ఈ బిల్లును గత ఏడాద ఆగస్టు తొమ్మిదోతేదీన 31 మంది సభ్యులుగల సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపుతున్నట్లు ప్రభుత్వం లోక్‌సభలో ప్రకటించింది. ఈ బిల్లుపై జెపిసి తన నివేదికను సమర్పించిన వెంటనే ఆ మార్పుల సిఫార్సులను కేంద్రమంత్రివర్గం ఆమోదించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com